గౌతమ్ న్యూస్
తెలుగు దిన పత్రిక
రిపోర్టర్స్ కావలెను.
GAUTHAM NEWS
9441735522
9849440951
అనతి కాలంలోనే విశేష ప్రజాదరణ పొందుతున్న గౌతమ్ న్యూస్ తెలుగు దినపత్రికకు మరియు Gtv లో పని చేయుటకు స్టాఫ్ రిపోర్టర్లు ,ఆర్ సీ ఇంఛార్జీలు, మండల విలేకరులు కావలెను.

# గౌతమ్ న్యూస్
తెలుగు దిన పత్రిక




హైదరాబాద్ సంపుటి : 01 సంచిక : 144, ఎడిటర్,భీముడు నాయక్ పేజీలు : 12, వెల రూ. 1, శనివారం - 29- జూన్ - 2024
PUBILSHED FROM HYDERABAD, CIRCULATED BY RANGAREDDY, NALGONDA, KHAMMAM, KARIMNAGAR, WARANGAL, MAHABOOBNAGAR, MEDAK, NIZAMABAD, ADILABAD


2

## ఒకరి ఐఆర్‌సీటీసీ ఐడీతో ఇతరులకు టికెట్స్ బుక్ చేస్తే జైలుశిక్ష విధిస్తారా..

సోషల్ మీడియా వేదికగా జరుగుతున్న ప్రచారాన్ని ఖండించిన ఇండియన్ రైల్వేస్
స్నేహితులు, బంధువులకు బుక్ చేసుకోవచ్చని వెల్లడి
వేర్వేరు ఇంటి పేర్లు ఉన్న వ్యక్తులకు టికెట్ బుకింగ్‌పై పరిమితి లేదని స్పష్టత


2

### ఉభయ సభలను కుదిపేస్తోన్న నీట్ అంశం..
## లోక్‌సభ సోమవారానికి వాయిదా

ఢిల్లీ: నీట్ పేపర్ లీక్ అంశం ఉభయ సభలను కుదిపేస్తోంది. దీనిపై చర్చ జరపాలని విపక్ష కూటమి సభ్యులు డిమాండ్ చేయడంతో శుక్రవారం లోక్‌సభ, రాజ్యసభలో గందరగోళ పరిస్థితి నెలకొంది. దీంతో విపక్షాల ఆందోళనలతో దిగువ సభ సోమవారానికి వాయిదా పడింది. ఉదయం 11 గంటలకు ఉభయ సభలు ప్రారంభం కాగానే రాష్ట్రపతి ప్రసంగంపై ధన్యవాదాలు తెలిపే తీర్మానాన్ని కేంద్రం ప్రవేశపెట్టింది.

## జగిత్యాల ఎమ్మెల్యే పార్టీ వీడటంపై కేసీఆర్ ఆగ్రహం...


వివరాలు 2లో..

- పార్టీని వీడి దొంగలతో కలిసే వారి గురించి బాధలేదన్న కేసీఆర్
- రాజకీయ భవిష్యత్తు ఇచ్చిన పార్టీని వదిలి వెళ్లిపోయారని మండిపాటు
- కార్యకర్తల నుంచే మంచి నాయకుడిని తయారు చేస్తానని వ్యాఖ్య

హైదరాబాద్ : పార్టీని వీడి దొంగలతో కలిసేవారి గురించి బాధలేదని...

# 'చంద్రబాబు చెబితే జగన్ ఇంటి గోడలు కూలగొట్టారా అన్న ప్రశ్నకు రేవంత్ రెడ్డి సమాధానం ఇదీ!

- చంద్రబాబు కోసం నా ఉద్యోగం వదులుకుంటానా? అన్న రేవంత్ రెడ్డి
- నా ప్రత్యర్థి కేసీఆర్ ఫామ్ హౌస్ గదులే ముట్టలేదు... జగన్‌వి ముట్టుకుంటానా? అని ప్రశ్న
- చచ్చిన పాము జగన్... ఆయన గదులు కూల్చమని చెప్పే అవసరం చంద్రబాబుకు ఏముందని ప్రశ్న
- తెలంగాణలో, పోటీలో టీడీపీ ఉంటే కాంగ్రెస్ పరిస్థితి ఎలా ఉండేదోనని వ్యాఖ్య
- బండి సంజయ్ ఉండి ఉంటే... తన తర్వాత ఆయనకు అవకాశం ఉండేదేమోనన్న రేవంత్ రెడ్డి


2లో

హైదరాబాద్, : ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా చంద్రబాబు బాధ్యతలు చేపట్టినప్పటికీ తెలంగాణ రాష్ట్ర రాజకీయ ప్రయోజనాల విషయంలో తాను రాజీపడేది లేదని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. ఢిల్లీలో ఆయన మీడియాతో పిచ్చాపాటిగా మాట్లాడుతూ... చంద్రబాబు ఏపీ కోసం ఎంత నిబద్ధతతో పని చేస్తారో... తెలంగాణ కోసం తానూ అలాగే పని చేస్తానన్నారు. చంద్రబాబు ఏదో చెప్పారని రాష్ట్ర ప్రయోజనాలను పక్కన పెడితే ప్రజలు తనను రాజకీయాల్లో క్షమిస్తారా? అని ప్రశ్నించారు. తన ఉద్యోగం కోసమే చంద్రబాబును వదిలి వచ్చానని... అలాంటప్పుడు ఆయన కోసం ఉద్యోగం వదులుకుంటానా? అన్నారు.

కేసీఆర్‌వే ముట్టలేదు... జగన్‌వి కూలగొడతానా?

హైదరాబాద్‌లోని జగన్ ఇంటిముందు కూల్చివేతల గురించి తనకు ఎవరూ చెప్పలేదన్నారు. దీనిపై ఆరా తీస్తే ఓ నాయకుడు చెబితే అధికారులు అలా చేశారని తెలిసిందని... అందుకే వారిని సరెండర్ చేశామన్నారు. కానీ, చంద్రబాబు చెబితే తాను అలా చేశానని బయట ప్రచారం జరిగిందని... అది అవాస్తవమన్నారు. జగన్ చచ్చిన పాము అని... అలాంటి వ్యక్తి ఇంటి ముందు ఉన్న గదులు కూలగొట్టాలని చెప్పాల్సిన అవసరం చంద్రబాబుకు ఏముంటుందని ప్రశ్నించారు. అసలు తన ప్రధాన ప్రత్యర్థి కేసీఆర్ ఫామ్ హౌస్ ముందే ఏవేవో కట్టుకున్నారని... వాటినే తీయలేదని... ఇక జగన్‌వి తాను ఎందుకు ముట్టుకుంటానన్నారు.

## కేసీఆర్ చేసిన తప్పులు మేం చేయం.. సీఎం రేవంత్ షాకింగ్ కామెంట్స్


వివరాలు 2లో..

ఢిల్లీ: బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ చేసిన తప్పులు, తాము చేయమని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. తెలంగాణా రాష్ట్రానికి 7 లక్షల కోట్లకు పైగా అప్పులున్నాయని చెప్పారు. ఢిల్లీ వేదికగా సీఎం రేవంత్ ఈరోజు(శుక్రవారం) మీడియాతో మాట్లాడారు. వాటి వడ్డీ ఏమాత్రం తగ్గినా ప్రతి ఏటా రూ.1000 కోట్ల వరకు ప్రభుత్వానికి ఆదా అవుతుందని చెప్పారు. ఐఏఎస్, ఐపీఎస్ అధికారుల పోస్టింగ్స్‌లో రూల్స్ బ్రేక్ చేయదలుచుకోలేదని అన్నారు. కొత్త పీసీసీ చీఫ్ నియామకం, సామాజిక సమీకరణాలు దృష్టిలో ఉంచుకుని హై కమాండ్ డిసైడ్ నిర్ణయం తీసుకుంటుందని తెలిపారు.

రుణమాఫీపై కీలక ప్రకటన

"కాంగ్రెస్ బీ ఫామ్ మిద గెలిచిన వారికి మాత్రమే పదవులు వచ్చాయి. పీసీసీ చీఫ్‌గా రెండు ఎన్నికలు పూర్తి చేశా. జూలై 7 తో మూడేళ్లు పీసీసీ పూర్తి కానుంది. పీసీసీ , కేబినెట్ విస్తరణ నిర్ణయాలు ఒకే సారి ఫైనల్ అవుతాయి. తెలంగాణలో కరెంట్ కోతలు లేవు.. సరిపడ విద్యుత్‌ను కొంటున్నాం. పంట రుణాల మాఫీకి రూ. రెండు లక్షలు పరిమితం చేస్తాం. రేషన్ కార్డ్ కుటుంబ గుర్తింపు కోసం మాత్రమే. రుణమాఫీపై 4 రోజుల్లో మార్గ నిర్దేశాకాలు విడుదల చేస్తాం. రాష్ట్రంలో విద్యుత్ కొరతలు లేవు , కంపెనీలో మెయింటెనెన్స్ తప్ప. ప్రతి ఏడాది జరిగే చెకింగ్ ప్రాసెస్ జరగకపోవడమే లేకనే రాష్ట్రంలో విద్యుత్ కోతలు. వాస్తవాలకు అనుగుణంగా మాత్రమే బడ్జెట్ ఉండాలని అధికారులకు స్పష్టంగా చెప్పాం. అంచనాలకు మించి ఊహాజనిత లెక్కలు వద్దని అధికారులను సూచించామని" సీఎం రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు.

ఆర్టీసీ లాభాలతో నడుస్తున్నాయి..

## కేసీఆర్ పిటిషన్‌పై తీర్పును రిజర్వ్ చేసిన హైకోర్టు



2

కమిషన్ ఏర్పాటు నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ కేసీఆర్ హైకోర్టులో పిటిషన్ దాఖలు

కమిషన్ ఏర్పాటు నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ కేసీఆర్ హైకోర్టులో పిటిషన్ దాఖలు

హైదరాబాద్ : హైకోర్టులో తెలంగాణ తొలి సీఎం కేసీఆర్ దాఖలు చేసిన పిటిషన్‌పై వాదనలు ముగిశాయి. విద్యుత్ కమిషన్ ఏర్పాటు జీవోను కొట్టివేయాలని కేసీఆర్ పిటిషన్ దాఖలు చేసిన సంగతి తెలిసిందే.

## ఏపీ మాజీ ప్రధాన కార్యదర్శి జవహర్ రెడ్డికి మళ్లీ పోస్టింగ్!


2

జగన్ ప్రభుత్వంలో కీలకంగా వ్యవహరించిన ఐఏఎస్‌లు జవహర్ రెడ్డి, పూనం మాలకొండయ్య
త్వరలో ఇద్దరూ రిటైర్ కానుండటంతో వారిని గౌరవంగా సాగనంపేందుకు మళ్లీ పోస్టింగులు
జవహర్ రెడ్డికి సంక్షేమ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి
సాధారణ పరిపాలన శాఖలో ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా పూనం మాలకొండయ్యకు పోస్టింగ్

అమరావతి: గత ప్రభుత్వంలో కీలకంగా వ్యవహరించిన ఏపీ ప్రభుత్వ మాజీ ప్రధాన కార్యదర్శి జవహర్ రెడ్డి, పోస్టింగ్ కోసం ఎదురు చూస్తున్న ఐఏఎస్ అధికారి పూనం మాలకొండయ్యలకు టీడీపీ ప్రభుత్వం మళ్లీ పోస్టింగ్‌లు ఇచ్చింది.


## ఏపీ టీడీపీ అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావుకు శుభాకాంక్షలు తెలిపిన చంద్రబాబు, లోకేశ్


వివరాలు 2లో..

టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడిగా పల్లా శ్రీనివాసరావు నియామకం
మంగళగిరి ఎన్టీఆర్ భవన్ లో బాధ్యతల స్వీకరణ
హాజరైన నారా లోకేశ్

అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం మూడు వారాల వ్యవధిలో 7 అంశాలపై శ్వేతపత్రాలు విడుదల చేస్తామని ఇటీవల ప్రకటన
తొలి శ్వేతపత్రం విడుదల
పోలవరంపై వాస్తవాలను ప్రజలకు తెలియజెప్పే ప్రయత్నం చేస్తున్నామన్న సీఎం చంద్రబాబు

# పోలవరంపై శ్వేతపత్రం విడుదల చేసిన సీఎం చంద్రబాబు...


2లో

అమరావతి: ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు పోలవరం ప్రాజెక్టుపై నేడు శ్వేతపత్రం విడుదల చేశారు. అమరావతిలో జరిగిన ఓ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ, మొన్నటి వరకు తమకున్న అరకొర సమాచారం ఆధారంగా రాజకీయ ఆరోపణలు చేశామని, ఇప్పుడు ప్రభుత్వంలోకి వచ్చాక వాస్తవ పరిస్థితులను ప్రజలకు తెలియజేసే ప్రయత్నం చేస్తున్నామని వెల్లడించారు. పోలవరంపై ముందుకు వెళ్లేందుకు మేధావులు, నిపుణులు, మీడియా, వివిధ వర్గాల ప్రజల నుంచి సూచనలు, సలహాలు స్వీకరిస్తామని తెలిపారు. "ఎన్నికల్లో ప్రజలు గెలిచారు... ఇప్పుడు రాష్ట్రాన్ని నిలబెట్టడం మనందరి బాధ్యత. బాధ్యతను తీసుకోవడానికి మేం వెనుకంజ వేయం. అదే సమయంలో ప్రజలు కూడా సహకరించాలి. అందుకే 7 అంశాలపై శ్వేతపత్రాలు విడుదల చేస్తున్నాం. వీటిని 25 రోజుల వ్యవధిలో తీసుకువస్తాం. అన్నింటిపై చర్చలు పూర్తిచేసుకుని అసెంబ్లీ సమావేశాలకు వెళతాం. బడ్జెట్ కూడా ప్రవేశపెట్టాల్సిన అవసరం ఉంది. అటు, లోక్ సభ సమావేశాల్లో ఆయా అంశాలకు సంబంధించి నిధులు సాధించుకోవాల్సిన అవసరం ఉంది. నీటి పారుదల రంగానికి సంబంధించి మేం చేసే ప్రతి పనినీ డాక్యుమెంట్ల రూపంలో వెబ్ సైట్ లో పెడతాం.

## ఉండవల్లిలో ఏపీ సీఎం చంద్రబాబు నివాసానికి వచ్చిన తెలంగాణ గవర్నర్ రాధాకృష్ణన్


2

- ఏపీ పర్యటనకు విచ్చేసిన తెలంగాణ గవర్నర్ రాధాకృష్ణన్
- రాధాకృష్ణన్ ను తేనీటి విందుకు ఆహ్వానించిన చంద్రబాబు
- ఉండవల్లి నివాసంలో తెలంగాణ గవర్నర్ కు స్వాగతం పలికిన చంద్రబాబు, లోకేశ్

# ఒకరి ఐఆర్‌సీటీసీ ఐడీతో ఇతరులకు టికెట్స్ బుక్ చేస్తే జైలుశిక్ష విధిస్తారా..

మొదటి పేజి తరువాయి

ఢిల్లీ: చాలా మంది రైల్వే ప్రయాణికులు ఐఆర్‌సీటీసీ వెబ్‌సైట్, ఐఆర్‌సీటీసీ యాప్‌పై టికెట్లు బుక్ చేసుకుంటారు. ఇండియన్ రైల్వేస్‌కు చెందిన ఈ అధికారిక ఆన్‌లైన్ ప్లాట్‌ఫామ్స్‌పై ప్రతి నిత్యం వేలాది మంది సేవలు పొందుతున్నారు. తమకు తాము బుక్ చేసుకోవడంతో పాటు ఇతరులకు కూడా బుకింగ్ చేస్తుంటారు. అయితే ఐఆర్‌సీటీసీ ప్లాట్‌ఫామ్‌పై ఒకరి ఐడీని ఉపయోగించి ఇతరులకు టికెట్లు బుక్ చేయడం నేరమని, ఇందుకు జైలుశిక్ష పడుతుందంటూ కొంతకాలంగా సోషల్ మీడియాలో ప్రచారం జరుగుతోంది. ఈ ప్రచారాన్ని నమ్మి వేలాది మంది ఆందోళన చెందుతున్నట్టు తెలుస్తోంది. ఈ విషయం రైల్వే దృష్టికి కూడా వెళ్లింది. దీంతో ఐఆర్‌సీటీసీపై రైల్వే టికెట్ల బుకింగ్‌కు సంబంధించిన నిబంధనలను ఇండియన్ రైల్వేస్ వివరించింది. ఐఆర్‌సీటీసీపై ఒకరి ఐడీ నుంచి ఇతరులకు టికెట్ బుక్ చేస్తే జైలుశిక్ష పడుతుందనేది అవాస్తవమని, ఈ ప్రచారంలో నిజం లేదని స్పష్టం చేసింది. యూజర్లు తమ ఐడీని ఉపయోగించి వేర్వేరు ఇంటి పేర్లు ఉన్న వ్యక్తులకు టిక్కెట్‌లు బుక్ చేయవచ్చునని క్లారిటీ ఇచ్చింది. ఈ సందర్భంగా ఐఆర్‌సీటీసీ ఈ-బుకింగ్‌కు సంబంధించిన పలు నిబంధనలను వెల్లడించింది. 1. ఐఆర్‌సీటీసీ యూజర్లు వారి వ్యక్తిగత ఐడీని ఉపయోగించి స్నేహితులు, కుటుంబ సభ్యులు లేదా బంధువులకు టిక్కెట్లు బుక్ చేయవచ్చు. వేర్వేరు ఇంటి పేర్లు ఉన్న వ్యక్తులకు టిక్కెట్ల బుకింగ్‌పై ఎలాంటి పరిమితి లేదు. 2. ఇక వ్యక్తిగత ఐడీని ఉపయోగించి నెలకు గరిష్ఠంగా 12 టిక్కెట్‌లను బుక్ చేసుకోవచ్చు. మరో వ్యక్తి ఆధార్‌ను కూడా అనుసంధానించి ఇద్దరి ఐడీలపై కలిపి నెలకు గరిష్ఠంగా 24 టికెట్లు బుక్ చేసుకోవచ్చు. అయితే వ్యక్తిగత ఐడీలను ఉపయోగించి బుక్ చేసిన టిక్కెట్లు వాణిజ్యపరంగా విక్రయించకూడదని ఇండియన్ రైల్వేస్ స్పష్టం చేసింది. భారతీయ రైల్వే చట్టం-1989లోని సెక్షన్ 143 ప్రకారం ఇలాంటి కార్యకలాపాలు నేరంగా పరిగణిస్తారు. దీనిని బట్టి ఐఆర్‌సీటీసీపై వ్యక్తిగత అవసరాలు, అవసరమైతే తమ బంధువులు, స్నేహితులకు బుక్ చేసుకోవచ్చని స్పష్టమవుతోంది.

## ఉభయ సభలను కుదిపేస్తోన్న నీట్ అంశం..

# లోక్‌సభ సోమవారానికి వాయిదా

మొదటి పేజి తరువాయి

ఉదయం 11 గంటలకు ఉభయ సభలు ప్రారంభం కాగానే రాష్ట్రపతి ప్రసంగంపై ధన్యవాదాలు తెలిపే తీర్మానాన్ని కేంద్రం ప్రవేశపెట్టింది. ఈ చర్చను లోక్‌సభలో స్పీకర్ ప్రారంభించిన వెంటనే.. విపక్షాలు సభలో నీట్ అంశాన్ని లేవనెత్తాయి. రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాద తీర్మానంపై చర్చను నిలిపివేసి.. నీట్ పరీక్షపై ఇచ్చిన వాయిదా తీర్మానంపై చర్చించాలని పట్టుబట్టాయి. నీట్ పరీక్ష గురించి సభలో చర్చించాలని రాహుల్ డిమాండ్ చేశారు. ఇరు వైపుల నుంచి విద్యార్థులకు సందేశం ఇవ్వాలని ఆశిస్తున్నానని తెలిపారు. ప్రభుత్వం వైపు నుంచి, విపక్షాల వైపు నుంచి నీట్ పరీక్ష గురించి విద్యార్థులకు తెలియజేస్తామని రాహుల్ అన్నారు. నీట్‌పై ప్రత్యేక చర్చ చేపట్టాలని ఆయన డిమాండ్ చేశారు. అందుకు స్పీకర్ ఓం బిర్లా అభ్యంతరం వ్యక్తం చేశారు. రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాద తీర్మానం చేపట్టడానికి ముందు ఎటువంటి వాయిదా తీర్మానాలను స్వీకరించరు అని తెలిపారు. కానీ విపక్ష ఎంపీలు మాత్రం తమ పట్టువీడలేదు. నీట్‌పై చర్చ చేపట్టాలంటూ నినాదాలు చేయడంతో సభలో గందరగోళ పరిస్థితి నెలకొంది. దీంతో సభను 12 గంటల వరకు స్పీకర్ వాయిదా వేశారు. ఆ తర్వాత తిరిగి సభ ప్రారంభమైనప్పటికీ ఎలాంటి మార్పు లేదు. ప్రతిపక్షాల నిరసనల నేపథ్యంలో సభను సోమవారానికి వాయిదా వేస్తున్నట్లు స్పీకర్ ఓంబిర్లా ప్రకటించారు. మరోవైపు ఎగువ సభలోనూ ఇదే పరిస్థితి నెలకొంది. రాజ్యసభలో నీట్ అంశంపై చర్చకు విపక్షాలు పట్టుబడుతూ నినాదాలు చేశారు. పేపర్ లీకేజీపై ఖర్గే ఆరోపణలు చేశారు. దీంతో సభలో గందరగోళం ఏర్పడింది. ఈ నేపథ్యంలో చైర్మన్ జగదీప్ ధన్‌కర్ సభను 12 గంటల వరకు వాయిదా వేశారు. ఆ తర్వాత సభ ప్రారంభమైనప్పటికీ విపక్ష సభ్యులు ఆందోళన కొనసాగించాయి. అయినప్పటికీ చైర్మన్ ధన్‌కర్ సభలో రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై చర్చను చేపట్టారు. సభ్యులు ఆందోళన కొనసాగిస్తుండటంతో సభను మధ్యాహ్నం 2 గంటల వరకు వాయిదా వేశారు.

## జగిత్యాల ఎమ్మెల్యే పార్టీ వీడటంపై కేసీఆర్ ఆగ్రహం...

మొదటి పేజి తరువాయి

హైదరాబాద్ : పార్టీని వీడి దొంగలతో కలిసేవారి గురించి బాధలేదని... తెలంగాణ సాధించిన మనకు ఇలాంటి ఒడిదుడుకులు ఓ లెక్కనా? అని బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ అన్నారు. శుక్రవారం ఆయన ఉమ్మడి కరీంనగర్ జిల్లా నేతలో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా, జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్ కుమార్ పార్టీ మారడంపై కేసీఆర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. రాజకీయ భవిష్యత్తు ఇచ్చిన బీఆర్ఎస్ పార్టీని ఆయన వదిలి వెళ్లిపోయారన్నారు. 2001లో పార్టీ పెట్టినప్పుడు ఆయన లేరని వ్యాఖ్యానించారు. మధ్యలో వచ్చిన వారు మధ్యలోనే వెళ్లిపోతారని విమర్శించారు. అలాంటి వారితో పార్టీకి ఎలాంటి నష్టం లేదన్నారు. ఎవరూ అధైర్యపడవద్దని సూచించారు. కార్యకర్తల నుంచే మంచి నాయకుడిని తయారు చేస్తానన్నారు. పార్టీయే నాయకులను తయారు చేస్తుంది తప్ప నాయకులు పార్టీని ప్రభావితం చేయలేరన్నారు. నాడైనా... నేడైనా... నాయకులను తయారు చేసుకున్నది పార్టీయేనని... మెరికల్లాంటి యువ నాయకులను పార్టీ సృష్టిస్తుందన్నారు. రెట్టించిన ఉత్సాహంతో ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా పని చేద్దామన్నారు.

## కేసీఆర్ పిటిషన్‌పై తీర్పును రిజర్వ్ చేసిన హైకోర్టు

మొదటి పేజి తరువాయి

హైదరాబాద్ : హైకోర్టులో తెలంగాణ తొలి సీఎం కేసీఆర్ దాఖలు చేసిన పిటిషన్‌పై వాదనలు ముగిశాయి. విద్యుత్ కమిషన్ ఏర్పాటు జీవోను కొట్టివేయాలని కేసీఆర్ పిటిషన్ దాఖలు చేసిన సంగతి తెలిసిందే. జస్టిస్ ఎల్ నరసింహారెడ్డి జారీ చేసిన నోటీసులు రద్దు చేయాలని కేసీఆర్ పిటిషన్ దాఖలు చేశారు. కేసీఆర్ పిటిషన్‌కు విచారణ అర్హత ఉందా లేదా అనే దానిపై వాదనలు ముగిశాయి. అనంతరం కేసీఆర్ పిటిషన్‌పై తీర్పు రిజర్వ్ చేసినట్లు హైకోర్టు ప్రకటించింది. ఇవాళ సాయంత్రం లేదా సోమవారం తీర్పు వెల్లడించే అవకాశం ఉంది. అయితే కేసీఆర్ దాఖలు చేసిన పిటిషన్‌ను విచారణ స్వీకరించవద్దని అడ్వకేట్ జనరల్ కోరారు. పిటిషన్‌ను విచారణకు అనుమతించడంపైనే వాదనలు వినిపించాలని మెరిట్స్‌లోకి వెళ్లవద్దని ఏజీకి ధర్మాసనం సూచించింది. ఏజీ వాదనలపై కేసీఆర్ న్యాయవాది ఆదిత్యా సోంధీ అభ్యంతర వ్యక్తం చేశారు. జ్యుడిషియల్ విచారణగా నోటిఫికేషన్‌లో పేర్కొన్నారు. దానిపై నివేదిక ఇవ్వాలే గానీ, మీడియాకు వివరాలు వెల్లడించకూడదు. విద్యుత్ రంగానికి తీవ్ర నష్టం వాటిల్లిందని ముందే చెప్పి కారకులెవరో తేల్చుమన్నారు. ఇది సరికాదు అని ఆదిత్యా సోంధీ పేర్కొన్నారు. విద్యుత్తు కొనుగోళ్లు, థర్మల్ ప్లాంట్ల నిర్మాణంపై జస్టిస్ ఎల్ నరసింహారెడ్డి నేతృత్వంలో విచారణ సంఘం ఏర్పాటును సవాల్ చేస్తూ కేసీఆర్ దాఖలు చేసిన పిటిషన్‌కు నంబర్ కేటాయించాలని హైకోర్టు గురువారం నిర్ణయించిన సంగతి తెలిసిందే. ఈ మేరకు హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అలోక్ అరాధే, జస్టిస్ జూకంటి అనిల్‌కుమార్‌తో కూడిన ద్విసభ్య ధర్మాసనం గురువారం హైకోర్టు రిజిస్ట్రీకి ఆదేశాలు జారీచేసింది. విద్యుత్తు వ్యవహారాలపై రాష్ట్ర ప్రభుత్వం ఈ ఏడాది మార్చి 14న జస్టిస్ ఎల్ నరసింహారెడ్డి నేతృత్వంలో విచారణ సంఘాన్ని నియమించింది. యాదాద్రి, భద్రాద్రి థర్మల్ విద్యుత్తు కేంద్రాల నిర్మాణం, ఛత్తీస్‌గఢ్-తెలంగాణ మధ్య విద్యుత్తు కొనుగోలు ఒప్పందాల్లో అక్రమాలు జరిగాయని ప్రభుత్వం ఆరోపించింది. కమిషన్ ఏర్పాటు నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ కేసీఆర్ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. విద్యుత్తుశాఖ ముఖ్య కార్యదర్శిని, జస్టిస్ ఎల్ నరసింహారెడ్డి విచారణ సంఘాన్ని, వ్యక్తిగత హోదాలో జస్టిస్ ఎల్ నరసింహారెడ్డిని ఇందులో ప్రతివాదులుగా పేరొన్నారు. అయితే, జస్టిస్ నరసింహారెడ్డిని ప్రతివాదిగా చేర్చడంపై హైకోర్టు రిజిస్ట్రీ అభ్యంతరం తెలిపారు. నంబర్ కేటాయించేందుకు నిరాకరించారు. ఈ నేపథ్యంలో కేసీఆర్ పిటిషన్ గురువారం హైకోర్టు ధర్మాసనం ముందుకు వచ్చింది. దాదాపు 45 నిమిషాలపాటు వాదప్రతివాదనలు జరిగాయి. కేసీఆర్ తరఫున సుప్రీంకోర్టు న్యాయవాది అదిత్య సోంధి బలంగా వాదనలు వినిపించారు. ఆయనతో ఏకీభవించిన ధర్మాసనం.. హైకోర్టు రిజిస్ట్రీ లేవనెత్తిన అభ్యంతరాలను తోసిపుచ్చింది. పిటిషన్‌కు నంబర్‌ను కేటాయించాలని ఆదేశించింది. జస్టిస్ నరసింహారెడ్డి ఏకపక్షంగా వ్యవహరిస్తున్నారంటూ పిటిషనర్ అభియోగాలు మోపిన నేపథ్యంలో, పిటిషన్‌పై శుక్రవారం విచారణ చేపడతామని వెల్లడించింది. ఈ మేరకు ఇవాళ విచారణ జరిగింది.

## ఏపీ మాజీ ప్రధాన కార్యదర్శి జవహర్ రెడ్డికి మళ్లీ పోస్టింగ్!

మొదటి పేజి తరువాయి



అమరావతి: గత ప్రభుత్వంలో కీలకంగా వ్యవహరించిన ఏపీ ప్రభుత్వ మాజీ ప్రధాన కార్యదర్శి జవహర్ రెడ్డి, పోస్టింగ్ కోసం ఎదురు చూస్తున్న ఐఏఎస్ అధికారి పూనం మాలకొండయ్యలకు టీడీపీ ప్రభుత్వం మళ్లీ పోస్టింగ్‌లు ఇచ్చింది. త్వరలో ఇద్దరు ఐఏఎస్ అధికారులు పదవీ విరమణ చేయనున్న నేపథ్యంలో వారికి గౌరవంగా వీడ్కోలు పలికేందుకు పోస్టింగులు ఇచ్చింది. జవహర్ రెడ్డిని సంక్షేమ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా నియమించింది. ప్రస్తుతం ఈ పోస్టులో ఉన్న అనంత రామును అదనపు బాధ్యతల నుంచి రిలీవ్ చేయాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరబ్ కుమార్ ప్రసాద్ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. మరోవైపు, నిరీక్షణలో ఉన్న ఐఏఎస్ అధికారి పూనం మాలకొండయ్యను సాధారణ పరిపాలన శాఖలో ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా నియమించారు. అక్కడ పనిచేస్తున్న పోలా భాస్కర్‌ను అదనపు బాధ్యతల నుంచి రిలీవ్ కావాలని ఆదేశించారు. పూనం మాలకొండయ్య అప్పటి సీఎం జగన్‌కు ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా పనిచేశారు. ఆమె కూడా ఈ నెలాఖరులో రిటైర్ కానున్నారు. ఇదిలా ఉంటే, ఐఏఎస్ అధికారి పీయూష్ కుమార్‌ను సీఎంకు ముఖ్య కార్యదర్శిగా నియమించారు. కేంద్ర సర్వీసుల్లో ఉన్న ఆయనను ఏపీ కేడర్‌కు తీసుకొచ్చారు. ఆయనకు ఆర్థికశాఖ ముఖ్య కార్యదర్శిగా పూర్తి అదనపు బాధ్యతలు అప్పగించారు. అక్కడ పనిచేస్తున్న ఎస్ఎస్ రావత్ సెలవులో ఉన్నారు. ఆయన్ను రిలీవ్ చేయాలని ఆదేశించారు.

## ‘చంద్రబాబు చెబితే జగన్ ఇంటి గోడలు కూలగొట్టారా

# అన్న ప్రశ్నకు రేవంత్ రెడ్డి సమాధానం ఇదీ!

మొదటి పేజి తరువాయి



హైదరాబాద్‌కు అమరావతి పోటీ కాదు

మన సొంత పగలు తీర్చుకోవడానికి ప్రజలు మనకు అధికారాన్ని ఇవ్వలేదనే విషయాన్ని జగన్‌ను చూసి నేర్చుకోవాలని రేవంత్ వ్యాఖ్యానించారు. ఏపీ ప్రజలు జగన్‌కు 151 సీట్లు ఇస్తే పగ తీర్చుకోవడానికి ప్రయత్నించారని... అందుకే ప్రజలు తాజా ఎన్నికల్లో 11 సీట్లకు సరిపెట్టారన్నారు. హైదరాబాద్‌కు అమరావతి పోటీయే కాదన్నారు. హైదరాబాద్‌ను వదిలి అమరావతిలో పెట్టుబడులు పెడతారని తాను భావించడం లేదన్నారు. మన సొంత పగలు తీర్చుకోవడానికి ప్రజలు మనకు అధికారాన్ని ఇవ్వలేదనే విషయాన్ని జగన్‌ను చూసి నేర్చుకోవాలని రేవంత్ వ్యాఖ్యానించారు. ఏపీ ప్రజలు జగన్‌కు 151 సీట్లు ఇస్తే పగ తీర్చుకోవడానికి ప్రయత్నించారని... అందుకే ప్రజలు తాజా ఎన్నికల్లో 11 సీట్లకు సరిపెట్టారన్నారు. హైదరాబాద్‌కు అమరావతి పోటీయే కాదన్నారు. హైదరాబాద్‌ను వదిలి అమరావతిలో పెట్టుబడులు పెడతారని తాను భావించడం లేదన్నారు. హైదరాబాద్‌ను వదిలి అమరావతిలో పెట్టుబడులు పెడతారని తాను భావించడం లేదన్నారు. అమరావతిలో లాభం ఉంటే మనం తాడుతో కట్టేసినా ఆగిపోరన్నారు.

టీడీపీ పోటీ చేసి ఉంటే కాంగ్రెస్ పరిస్థితి ఎలా ఉండేదో!

కేసీఆర్ తెలంగాణలో టీడీపీని లేకుండా చేయాలని భావించారని... కానీ ఆయనే తుడిచిపెట్టుకుపోయారని మండిపడ్డారు. సమాజంలో కొన్నింటిని బతకనిస్తే అవి సమాజానికో... మనుషులకో పనికి వస్తాయన్నారు. టీడీపీకి పోటీ చేసే పరిస్థితిని కల్పించి ఉంటే వాళ్లు 10 శాతం ఓట్లు దక్కించుకునే వారని జోస్యం చెప్పారు. అప్పుడు కాంగ్రెస్ పరిస్థితి ఎలా ఉండేదో తెలియదని ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు.

కేసులన్నీ ఒకేసారి తెరిస్తే పని చేయలేను

గత ప్రభుత్వంపై కేసులన్నీ ఒకేసారి తెరిస్తే తాను ఏ పనీ చేయలేకుండా అవుతుందని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. అన్ని పనులూ ఆగిపోతాయన్నారు. కేసులతో రాజకీయ ప్రయోజనాల మాట పక్కన పెడితే... వ్యవస్థ కుప్పకూలుతుందన్నారు. తాను ఏ విచారణకు ఆదేశించినా అందులో ప్రభుత్వ సంస్థలు, కేసీఆర్ మాత్రమే ఉండరని... ప్రైవేటు ఇన్‌ఫ్రా కంపెనీలు, ఇతర సంస్థలు ఉంటాయన్నారు. ఒక్కసారి కేసు నమోదైతే బ్యాంకులు ఆ కంపెనీలకు ఒక్క రూపాయి అప్పు ఇవ్వవని తెలిపారు. ఓడీలను వెనక్కు తీసుకుంటాయన్నారు.

మా ప్రత్యర్థి ఎవరనేది పనితీరుపై ఆధారపడి ఉంటుంది

ఎమ్మెల్యేలను చేర్చుకోవడం మంచిదా? చెడ్డదా? అనేది ఇప్పుడు విషయం కాదని... ప్రభుత్వాన్ని నిలుపుకోవాలన్నారు. ప్రభుత్వమే పోతే వాటి గురించి మాట్లాడుకోవడంలో అర్థం ఉండదన్నారు. బీఆర్ఎస్ నేతలు తమ ఓట్లు తామే వేసుకుంటే లోక్ సభ ఎన్నికల్లో కాంగ్రెస్ 12 సీట్లు గెలిచి ఉండేదన్నారు. ముమ్ముందు తమ ప్రత్యర్థిగా ఎవరు ఉంటారనేది బీజేపీ, కేసీఆర్ పనితీరుపై ఆధారపడి ఉంటుందన్నారు. కేసీఆర్ విధానాన్ని బట్టి రాష్ట్ర రాజకీయాలు ఉంటాయన్నారు.

అందుకే బీజేపీ అక్కడ గెలిచింది


హరీశ్ రావు ట్రాప్‌లో కేసీఆర్ పడ్డారని... భవిష్యత్తులో బీఆర్ఎస్ బతకడం కష్టమని రేవంత్ రెడ్డి అన్నారు. కేసీఆర్ రాజకీయంగా నిలదొక్కుకోవడం కష్టమే అన్నారు. కేసీఆర్ లేకుంటే తన సొంత లైన్‌ను తీసుకోవచ్చునని హరీశ్ రావు చూస్తున్నారని ఆరోపించారు. ఏపీలో 2019లో టీడీపీకి 23 సీట్లు వచ్చినా చంద్రబాబు కోర్ రాజకీయాలను వదలకుండా పోరాడారని... అందుకే మళ్లీ గెలిచారన్నారు. తెలంగాణలో కేసీఆర్ పరిస్థితి మాత్రం అలా లేదన్నారు. ఏపీలో టీడీపీ, జనసేన పొత్తు కారణంగా హైదరాబాద్ చుట్టుపక్కల సెటిలర్ల ఓట్లు బీజేపీకి పడి... మల్కాజ్‌గిరి, చేవెళ్లలో ఆ పార్టీకి ప్రయోజనం చేకూరిందన్నారు.

నా తర్వాత బండి సంజయ్...

అసెంబ్లీ ఎన్నికల్లో కేసీఆర్‌ను దించాలా? రేవంత్ రెడ్డిని గెలిపించాలా? అనే అంశంపైనే జరిగాయన్నారు. పదేళ్లు కేసీఆర్‌కు వ్యతిరేకంగా కొట్లాడానన్నారు. అందుకే ప్రజలు తనను ప్రత్యామ్నాయంగా ఎంచుకున్నారని పేర్కొన్నారు. పాలనలో తన మార్క్ ముద్ర వేస్తానన్నారు. బీజేపీ నుంచి బండి సంజయ్ ఉండి ఉంటే (బీజేపీ అధ్యక్షుడిగా) తన తర్వాత అవకాశం వచ్చేదేమో అన్నారు.


# పోలవరంపై శ్వేతపత్రం విడుదల చేసిన సీఎం చంద్రబాబు...

మొదటి పేజి తరువాయి



నీటి పారుదల రంగానికి సంబంధించి మేం చేసే ప్రతి పనినీ డాక్యుమెంట్ల రూపంలో వెబ్ సైట్ లో పెడతాం. వాళ్లకు విశ్వసనీయత లేదు. ఏది చేసినా ఎదురుదాడి చేయడం వాళ్లకు అలవాటైపోయింది. చెప్పిన అబద్ధాలనే వందసార్లు చెప్పి ప్రజలను నమ్మించే ప్రయత్నం చేస్తుంటారు. దానికి చెక్ పెట్టాల్సిన అవసరం ఉంది. అందుకే ఇవాళ తొలి శ్వేతపత్రం విడుదల చేస్తున్నాం. వాళ్లకు ప్రజలే సమాధానం చెప్పే విధంగా ఎప్పటికప్పుడు ప్రజా చైతన్యం తీసుకువస్తాం. ఇవాళ మేం విడుదల చేసిన శ్వేతపత్రం రెండు భాగాలుగా ఉంటుంది. మొదటిది పోలవరం, రెండోది ఇతర సాగునీటి ప్రాజెక్టులు. రాష్ట్రానికి సాగునీటి ప్రాజెక్టుల అవసరం ఎంతో ఉంది. 2014 నుంచి 2019 వరకు సాగునీటి ప్రాజెక్టులపై రూ.67 వేల కోట్లు ఖర్చు పెట్టాం. ఇప్పుడైతే వాటి నిర్వహణ ఖర్చులు కూడా ఇవ్వలేని పరిస్థితి ఏర్పడింది. ఇవాళ సాగునీటి ప్రాజెక్టుల గురించి వివరించడంలేదు... ఈ కార్యక్రమంలో ప్రధానంగా పోలవరం ప్రాజెక్టు గురించి వివరిస్తాను. రాష్ట్రాభివృద్ధికి జీవనాడి పోలవరం ప్రాజెక్టు. రాష్ట్రానికి రెండు ప్రధానమైన ప్రాజెక్టులు ఒకటి అమరావతి, రెండు పోలవరం. రెండు కూడా రెండు కళ్లు లాంటివి. ఈ రెండు పూర్తి చేసుకుంటే విభజన నష్టాలను పూడ్చుకునే అవకాశం ఉంటుంది. విభజన చట్టంలో పోలవరంకు జాతీయహోదా ఇచ్చారు. నదుల అనుసంధానానికి పోలవరం గుండెకాయ వంటిది. ఇలాంటి పోలవరం ప్రాజెక్టుకు జగన్ ఒక శాపంలా మారాడు. చేతకాకపోతే ఇంట్లో ఉండాలి కానీ, రాష్ట్రాన్ని నాశనం చేసే హక్కు ఎవరికీ లేదు. కానీ జగన్ క్షమించరాని నేరం చేశాడు. సముద్రంలో వృధాగా కలిసే 3,000 టీఎంసీల నీటిని సద్వినియోగం చేసుకోని ఏపీని కరవురహిత రాష్ట్రంగా మార్చే ప్రాజెక్టు పోలవరం. ఇది చౌకగా జలవిద్యుత్ అందించే ప్రాజెక్టు. 2014లో జరిగిన రాష్ట్ర విభజన కంటే ఐదేళ్ల జగన్ పాలన వల్ల జరిగిన నష్టమే ఎక్కువ. పోలవరం ప్రాజెక్టులో 194 టీఎంసీల నీరు నిల్వ చేయొచ్చు. వరద నీటిని కూడా కలుపుకుని 322 టీఎంసీల నీటిని సద్వినియోగం చేసుకోవచ్చు. దీనిద్వారా 7.2 లక్షల ఎకరాలకు సాగునీరు అందుతుంది. 28.50 లక్షల మందికి తాగునీటిని అందించవచ్చు. అంతేకాదు, పోలవరం ద్వారా 960 మెగావాట్ల విద్యుత్ ను ఉత్పత్తి చేయొచ్చు. వాటర్ టూరిజం కూడా సాధ్యపడుతుంది. పరిశ్రమలకు నీటి కొరత అనే సమస్యే ఉండదు. పోలవరం అనేది 1941 నుంచి ప్రజల ఛిరకాలం వాంఛగా ఉంది. ఈ ప్రాజెక్టు పూర్తయితే వరదలు కూడా నివారించవచ్చు. ఈ ప్రాజెక్టు సాయంతో 50 లక్షల క్యూసెక్కుల ప్రవాహాన్ని పక్కకు మళ్లించవచ్చు. పోలవరంలో డయాఫ్రం వాల్ డెప్త్ 90 మీటర్లు. 20 మీటర్ల ఎత్తు, 16 మీటర్ల వెడల్పుతో అతి భారీ గేట్లు ఉంటాయి. 390 కిలోమీటర్ల పొడవైన కుడి, ఎడమ కాల్వలతో నిర్మాణపరంగా ఇది అతి పెద్ద ప్రాజెక్టు. నాడు, టీడీపీ ప్రభుత్వ హయాంలో పోలవరంలో గిన్నిస్ బుక్ రికార్డు సాధించాం. 24 గంటల్లో 32,315 క్యూబిక్ మీటర్ల కాంక్రీట్ పనులు చేపట్టాం. ఈ స్థాయిలో మరే ప్రాజెక్టులోనూ చేపట్టలేదు. రాష్ట్ర విభజన జరిగాక... పార్లమెంటు సమావేశాలు జరగకముందే, ఢిల్లీలో ఎంతో శ్రమించి 7 ముంపు మండలాలను ఏపీలో కలిపేలా ఆర్డినెన్స్ తెప్పించాం. ముంపు మండలాలు ఏపీలో విలీనం అయ్యాకే ప్రమాణస్వీకారం చేశాను. 2014 నుంచి ఐదేళ్లలో పోలవరం ప్రాజెక్టుకు సంబంధించి 72 శాతం పనులు పూర్తి చేశాం. రూ.11,762 కోట్ల వ్యయం కాగా... డీపీఆర్-2 కింద రూ.55,548 కోట్ల వ్యయానికి టెక్నికల్ కమిటీ ఆమోదం తెలిపింది. కానీ వైసీపీ ప్రభుత్వం వచ్చాక పోలవరంలో జరిగింది నాలుగు శాతం పనులే. వీళ్లు ఖర్చు పెట్టింది రూ.4 ,167 కోట్లే. జగన్ ప్రమాణ స్వీకారం రోజునే పోలవరంలో పనులు నిలిపివేశారు. 2020 ఆగస్టులో వచ్చిన వరదలకు డయాఫ్రం వాల్ దెబ్బతిన్న విషయాన్ని హైదరాబాద్ ఐఐటీ నిపుణుల బృందం గుర్తించింది. కాఫర్ డ్యామ్ లో గ్యాప్ లు పూర్తి చేయకపోవడంతోనే డయాఫ్రం వాల్ దెబ్బతిన్న విషయం వెల్లడైంది. జగన్ ప్రభుత్వం ఆ విషయాన్ని రెండేళ్ల తర్వాత కానీ తెలుసుకోలేకపోయింది. ఇక, 2019 ఆగస్టు 13న పోలవరం పీపీఏ మీటింగ్ జరిగింది. 2009లో వైఎస్ హయాంలో కాంట్రాక్టర్ ను మార్చడం వల్ల పోలవరం హెడ్ వర్క్స్ నిలిచిపోయాయి... ఇప్పుడు కాంట్రాక్టర్ ను మార్చడం వల్ల అదే పరిస్థితి తలెత్తుతుందని 2019 నాటి పోలవరం పీపీఏ సమావేశంలో తేల్చారు. ప్రస్తుతం ఉన్న కాంట్రాక్టరు పనితీరు బాగుందని, మార్చాల్సిన అవసరం లేదనిఆ సమావేశంలో స్పష్టం చేశారు. ఇదే అంశాలతో రాష్ట్ర సీఎస్ కు 2019 ఆగస్టు 16న పీపీఏ లేఖ రాసింది. కాంట్రాక్టర్లను మార్చవద్దని సూచించింది. అయినా జగన్ పెడచెవిన పెట్టి కాంట్రాక్టర్ ను మార్చారు. వైఎస్ చేసిన తప్పునే జగన్ కూడా చేశారు. ఆ తర్వాత జరగాల్సిన నష్టం జరిగిపోయింది. మేం 2018 నాటికి డయాఫ్రం వాల్ ను రూ.436 కోట్లతో పూర్తి చేశాం. కానీ జగన్ హయాంలో డయాఫ్రం వాల్ డ్యామేజి అయింది. దాన్ని మరమ్మతు చేయాలంటే రూ.447 కోట్లు ఖర్చవుతుంది. కొత్త డయాఫ్రం వాల్ కట్టాలంటే రూ.990 కోట్లు కావాలి. ఎగువ, దిగువ కాఫర్ డ్యామ్ సీపేజీ వల్ల డ్యామ్ పై ఏ పని చేయాలన్నా వీలు కావడంలేదు. సీపేజీ అరికట్టడానికి ఎంత ఖర్చవుతుందో, ఎంత సమయం పడుతుందో అంచనా వేయలేకపోతున్నాం. జగన్ పోలవరం నిర్వాసితులకు ఎన్నో హామీలు ఇచ్చారు. ఎకరాకు రూ.19 లక్షల పరిహారం అన్నారు... ఒక్కరికీ ఇచ్చింది లేదు. ఎకరానికి అదనంగా రూ.5 లక్షలు అన్నారు... అదీ లేదు. సకల వసతులతో పునరావాస కాలనీలు అన్నారు... అది సాకారం కాలేదు. మేం కట్టిన పునరావాస కాలనీల్లో మిగిలిన పనులు కూడా వీళ్లు పూర్తి చేయలేదు. నాడు పునరావాసం కోసం మేం రూ.4,114 కోట్లు ఖర్చు పెడితే, వైసీపీ ప్రభుత్వం రూ.1,687 కోట్లు ఖర్చు చేసింది. దానికితోడు, పోలవరంపై మోసపూరిత ప్రకటనలు చేశారు. మొదట 2021 జూన్ నాటికి పూర్తి చేస్తామన్నారు, ఆ తర్వాత 2021 డిసెంబర్ నాటికి అన్నారు, ఆపై 2022 జూన్ నాటికి అన్నారు, మరోసారి ప్రజలను మోసం చేస్తూ 2022 డిసెంబరు నాటికి అన్నారు... ఐదోసారి మరీ దారుణంగా... ఎప్పటికి పూర్తవుతుందో చెప్పలేం అన్నారు. వైసీపీ అసమర్థతకు ఈ ప్రకటనలే తార్కాణం. మేం ప్రాజెక్టు అంచనాలు పెంచామని వైసీపీ చేసిందంతా దుష్ప్రచారమేనని పార్లమెంటుగా సాక్షిగా బట్టబయలైంది. ఈ ఐదేళ్లలో పోలవరం ప్రాజెక్టుకు జరిగిన నష్టం నన్ను కదిలించివేసింది. ఇకపై కేంద్రం సాయంతో ఒక్కో సమస్యను అధిగమిస్తూ ముందుకు వెళతాం. అంతర్జాతీయ నిపుణులు, దేశీయ ఐఐటీ నిపుణులు, సీడబ్ల్యూసీ, కేంద్ర ప్రభుత్వ సహకారంతో సవాళ్లను అధిగమిస్తాం... పోలవరం పూర్తి చేస్తాం” అని సీఎం చంద్రబాబు స్పష్టం చేశారు.

## ఏపీ టీడీపీ అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావుకు శుభాకాంక్షలు తెలిపిన చంద్రబాబు, లోకేశ్



మొదటి పేజి తరువాయి

అమరావతి: ఏపీ టీడీపీ చీఫ్ గా నియమితులైన గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు నేడు మంగళగిరిలోని ఎన్టీఆర్ భవన్ లో బాధ్యతలు చేపట్టారు. రాష్ట్ర టీడీపీ అధ్యక్షుడిగా బాధ్యతలు స్వీకరించిన పల్లా శ్రీనివాసరావును టీడీపీ అధినేత చంద్రబాబు, పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ అభినందించారు. “తెలుగుదేశం పార్టీ ఏపీ అధ్యక్షుడిగా ఇవాళ బాధ్యతలు చేపట్టిన గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు యాదవ్ గారికి అభినందనలు. మీ సమర్థ నాయకత్వంలో పార్టీ మరెన్నో విజయాలు సాధిస్తుందని, మరింత బలోపేతం అవుతుందని ఆశిస్తున్నాను” అంటూ చంద్రబాబు పేర్కొన్నారు. కాగా, పల్లా శ్రీనివాసరావు బాధ్యతల స్వీకరణపై నారా లోకేశ్ స్పందించారు. “మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయం ఎన్టీఆర్ భవన్ లో ఏపీ టీడీపీ అధ్యక్షుడిగా పల్లా శ్రీనివాసరావు గారి బాధ్యతల స్వీకరణ కార్యక్రమానికి హాజరయ్యాను. బీసీ నేత, అజాతశత్రువు అయిన పల్లా శ్రీనివాసరావు గారికి హృదయపూర్వక అభినందనలు తెలియజేస్తున్నాను” అంటూ లోకేశ్ సోషల్ మీడియాలో స్పందించారు.

## ఉండవల్లిలో ఏపీ సీఎం చంద్రబాబు నివాసానికి వచ్చిన తెలంగాణ గవర్నర్ రాధాకృష్ణన్



అమరావతి: తెలంగాణ గవర్నర్ రాధాకృష్ణన్ నేడు ఏపీ పర్యటనకు వచ్చారు. ఉండవల్లిలో ఆయన ఏపీ సీఎం చంద్రబాబు నివాసానికి విచ్చేశారు. ఏపీ వచ్చిన తెలంగాణ గవర్నర్ ను సీఎం చంద్రబాబు ఇవాళ తేనీటి విందుకు ఆహ్వానించారు. హైదరాబాద్ నుంచి గన్నవరం ఎయిర్ పోర్టు చేరుకున్న గవర్నర్ రాధాకృష్ణన్... చంద్రబాబు ఆహ్వానం మేరకు అక్కడ్నించి రోడ్డుమార్గంలో ఉండవల్లి వచ్చారు. ఆయనకు సీఎం చంద్రబాబు, మంత్రి నారా లోకేశ్ స్వాగతం పలికారు. మంగళగిరి చేనేత శాలువాతో ఆయనను సత్కరించారు. అనంతరం చంద్రబాబు, రాధాకృష్ణన్ మధ్య మర్యాదపూర్వక సమావేశం జరిగింది. తెలుగు రాష్ట్రాల రాజకీయ పరిస్థితులు, రాష్ట్ర విభజన అంశాలపై చర్చించుకున్నట్టు తెలిసింది.

## కేసీఆర్ చేసిన తప్పులు మేం చేయం..

# సీఎం రేవంత్ షాకింగ్ కామెంట్స్

మొదటి పేజి తరువాయి

“గత ప్రభుత్వం హయాంలో బడ్జెట్ విషయంలో అలాంటి తప్పులు ఏమి చేయదు. కేంద్ర బడ్జెట్ ప్రవేశపెట్టిన తర్వాత తెలంగాణ రాష్ట్ర బడ్జెట్ వస్తుంది. ఫ్రీ బస్ పథకం వల్ల తెలంగాణ రాష్ట్రంలో రెవెన్యూ పెరిగింది. ప్రభుత్వం 300 కోట్లు చెల్లిస్తూ వస్తోంది.. ఆర్టీసీ నిర్వహణలో వచ్చే నష్టాలు తగ్గిపోయాయి. గత అప్పులతో సంబంధం లేకుండా చూస్తే కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక ఆర్టీసీ లాభాలతో నడుస్తున్నాయి. రాష్ట్ర ఖజానాకు భారం ఉన్న సంక్షేమంపై దృష్టి పెడుతున్నా. రైతు రుణమాఫీ ప్రథమ లక్ష్యం. మిగిలిన అంశాలు పైన దృష్టి తర్వాత పెడతాం” అని సీఎం రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు.

## పోలవరం పై చంద్రబాబు చెప్పేవన్ని అసత్యాలే



పోలవరం పై చంద్రబాబు చెప్పేవన్ని అసత్యాలేనని మాజీ మంత్రి అంబటి రాంబాబు పేర్కొన్నారు. ఇవాళ ఆంధ్రప్రదేశ్ సీఎం నారా చంద్రబాబు నాయుడు పోలవరం ప్రాజెక్ట్ పై శ్వేత పత్రం విడుదల చేశారు. శ్వేత పత్రం విడుదల చేసిన తరువాత చంద్రబాబు మీడియాతో మాట్లాడిన సందర్భంలో గతంలో పోలవరం ప్రాజెక్టు సంక్లిష్టం అని.. నాకు అర్థం కావడం లేదని మాజీ మంత్రి అంబటి రాంబాబు పేర్కొన్న వ్యాఖ్యలకు చంద్రబాబు నవ్వారు. దానికి కౌంటర్ గా తాజాగా అంబటి రాంబాబు మీడియా సమావేశంలో మాట్లాడారు. వైఎస్ రాజశేఖర్ రెడ్డి ఎన్నో అనుమతులను తీసుకొచ్చారని గుర్తు చేశారు. వైఎస్ రాజశేఖర్ రెడ్డి హయాంలోనే పోలవరం ప్రాజెక్ట్ నిర్మాణం ప్రారంభమైందని తెలిపారు. చంద్రబాబు అసత్యాలు చేస్తుంటే కోపం వస్తుందన్నారు. పదే పదే జగన్ దూషించే ప్రయత్నం చేశారు. జగన్ అంటే చంద్రబాబుకు భయం అన్నారు. పోలవరం చాలా సంక్లిష్టమైనది.. నాకు అర్థం కాలేదని ఇప్పటికీ ఒప్పుకుంటున్నాని తెలిపారు. పోలవరం ప్రాజెక్టు చంద్రబాబుకు కూడా అర్థం కాలేదన్నారు. 7 గ్రామాలు కలిపినందుకే గొప్పగా చెబుకుంటున్నారు. వైఎస్ హయాంలో తీసుకొచ్చిన అనుమతులు.. పోలవరం ప్రాజెక్టు గురించి ఎంత గొప్పగా చెప్పుకోవాలని ప్రశ్నించారు. చంద్రబాబు మీరు గతంలో చెప్పిన మాటలను ఎలా సమర్థించుకుంటారని ప్రశ్నించారు.


## ఫ్రైడే , డ్రై డే సందర్భంగా 22 వార్డు పరిసరాల పరిశుభ్రతగా ఉంచుకోవాలి

సిపిఐ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ బి.అజయ్ సారధి రెడ్డి



మానుకోట జిల్లా /జూన్ 28 (గౌతమ్ న్యూస్): మహబూబాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని 22వ వార్డులో శుక్రవారం ఫ్రైడే సందర్భంగా డ్రై డే కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమనికి ముఖ్య అతిథులుగా హాజరైన సిపిఐ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ బి.అజయ్ సారధి రెడ్డి, జిల్లా మలేరియా అధికారి డి ఎమ్ ఓ సుధీర్ రెడ్డి మాట్లాడుతూ వర్షాకాలం నేపథ్యంలో ప్రజలందరూ పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని అన్నారు సీజనల్ వ్యాధులు రాకుండా అరికట్టాలని, మూరికి గుంటల్లో దోమలు ఈగలు రాకుండా ఆయిల్ బాల్స్ వేసుకోవాలి. ప్రతి ఒక్కరూ పరిశుభ్రత పాటించాలని, వర్షాకాల నేపథ్యంలో దోమల కారణంగా డెంగ్యూ, మలేరియా, టైఫాయిడ్ తదితర ప్రమాదకరమైన జబ్బులు రాకుండా ప్రజలందరూ పరిశుభ్రత పాటించి స్వీయ నియంత్రణ అనుసరించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కృష్ణ, అర్జున్ రావు, కె.వి రాజు, పురుషోత్తం, అశ్విని, మాధవి, రాధ, మల్లీశ్వరి, యశోద, విజయ, రజియా బేగం, పెరుగు కుమార్, చింతకుంట్ల వెంకన్న, రేషపల్లి నవీన్, తదితరులు పాల్గొన్నారు.

## జిల్లెల చిన్నారెడ్డికి జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన గుండ్రాతి గణేష్ గౌడ్!!



నాగర్ కర్నూల్ వనపర్తి బ్యూరో/జూన్ 28 (గౌతమ్ న్యూస్): తెలంగాణ రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షులు మాజీ మంత్రి మలిదశ తెలంగాణ ఉద్యమ నాయకుడు వనపర్తి నియోజకవర్గంలో పెట్టని పేరుగా రాజకీయ కోవిదుడుగా పేరుపొందిన జి ,చిన్నారెడ్డి జన్మదినం సందర్భంగా వనపర్తి జిల్లాలోని గోపాల్ పేట్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు తాడిపర్తి గ్రామ మాజీ సర్పంచ్ సీనియర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు గుండ్రాతి గణేష్ గౌడ్ హైదరాబాదులోని చిన్నారెడ్డి నివాసంలో ఆయనకు శుభాకాంక్షలు తెలిపి అభినందనలు తెలిపారు, జి ,చిన్నారెడ్డి తెలంగాణ రాష్ట్రంలోనే భారతదేశంలో కాంగ్రెస్ పార్టీ అగ్ర నాయకులతో పేరు పొందిన వ్యక్తిగా కాంగ్రెస్ పార్టీలో ఒక వారసునిగా ఆయనకు పేరు ఉందని గణేష్ గౌడ్ అన్నారు, అలాంటి గొప్ప నాయకుడు వనపర్తి నియోజకవర్గంలో ఎమ్మెల్యేగా మంత్రిగా పనిచేసిన సందర్భంలో వనపర్తి నియోజకవర్గంలో ఎన్నో అభివృద్ధి పనులు సాధించి పేద పడుకు బలహీనవర్గాల ప్రజల్లో ఆయన గూడు కట్టుకొని నిద్రపోతున్నారని. గోపాల్ పేట మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు గుండ్రాతి గణేష్ గౌడ్ అన్నారు, ఇలాంటి జన్మదినోత్సవ వేడుకలు మరెన్నో జరుపుకోవాలని ఆయన దేవుని ప్రార్థించారు, కాంగ్రెస్ పార్టీలో క్రియాశీలక సభ్యునిగా చేరినప్పటి నుంచి పంచలంచెలుగా ఎదుగుతూ దేశ రాజకీయాలలో చక్రం తిప్పడంలో చిన్నారెడ్డికి తిరుగు లేదని ఆయన అన్నారు , జిల్లెల్ల చిన్నారెడ్డి గురించి ఎంత చెప్పినా తక్కువ అని ఆయన అన్నారు, మచ్చలేని నాయకునిగా మహిమలేని రాజకీయ నాయకునిగా పేరు ఉన్న సంగతి రాష్ట్రంలో దేశంలో ప్రజలకు తెలుసని అన్నారు,

## అక్రమ డిప్యూటేషన్లను రద్దు చేయాలి

గిరిజన జిల్లాలో గిరిజన ఉద్యోగులు కరువయ్యారా...!

ఎస్ఎఫ్ఐ జిల్లా కన్వీనర్ పట్ల మధు



మానుకోట జిల్లా /జూన్ 28 (గౌతమ్ న్యూస్): గిరిజన సంక్షేమ శాఖలో ఉన్న డిప్యూటేషన్లను రద్దు చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కన్వీనర్ పట్ల మధు డిమాండ్ చేశారు. ఈ సందర్భంలో ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో మానుకోట జిల్లా గిరిజన శాఖ డి.డి ఎర్రయ్య కి వినతిపత్రం అందజేసినారు. ఈ సందర్భంగా మధు మాట్లాడుతూ రాష్ట్రంలోనే అత్యధిక గిరిజనులు ఉన్న మానుకోట జిల్లాలో డిప్యూటేషన్ల మీద గిరిజన శాఖ కొనసాగడం ఏంటని ప్రశ్నించారు. ఒక ఉద్యోగి ఒక చోట నుండి వేతనం తీసుకుంటు అదే శాఖలో వేరోక చోట ఉద్యోగాలు చేస్తున్నారని, దీని వలన ఉద్యోగి లేని చోట స్కూల్ ఉపాధ్యాయులతో నడిపించాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఈ డిప్యూటేషన్లను మీదనే గత కొన్ని సంవత్సరాల నుండి మానుకోట గిరిజన శాఖ నడుస్తుంది. ఈ డిప్యూటేషన్లను మీద సరైన వివరణ ఇచ్చే అధికారులే కరువయ్యారని, ఈ డిప్యూటేషన్లు పి.ఓ, కలెక్టర్ లకి తెలిసి జరగడం లేదు అని ఆరోపించారు. కావున తక్షణమే డిప్యూటేషన్లల మీద కొనసాగుతున్న ఉద్యోగులను తొలగించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కన్వీనింగ్ కమిటీ సభ్యులు గుగులోత్ సూర్య ప్రకాశ్, గందసిరి జ్యోతి బసు, వీరెందర్, రవీందర్ పాల్గొన్నారు

## ఉపసంచాలకులు పశువర్ధక శాఖ కాటూరి వెంకటేశ్వరరావు ఉద్యోగ విరమణ సన్మాన కార్యక్రమం



నందిగామ /జూన్ 28 (గౌతమ్ న్యూస్): నందిగామ పట్టణంలో పశు వైద్య శాఖ లో విధులు నిర్వహిస్తున్న ఉప సంచాలకులు కాటూరి వెంకటేశ్వరరావు ఈ నెల 30 నాడు ఉద్యోగ పదవి విరమణ చేస్తున్న సందర్భంగా శుక్రవారం నాడు సన్మాన కార్యక్రమం నందిగామ పశు వైద్య శాఖ ఆవరణలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశ కార్యక్రమంలో అతిథులుగా జిల్లా జాయింట్ డైరెక్టర్ విద్యాసాగర్ మరియు జిల్లా అధికారులు మండల అదికారులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు అధికారులు మాట్లాడుతూఈ నెలలో ఉద్యోగ పదవీ విరమణ చేస్తున్న కాటూరి వెంకటేశ్వరరావు చాలా కాలం పాటు పశు వైద్య శాఖలోనే పని చేస్తూ ఆయన చేసిన సేవల గురించి కొనియాడారు. ప్రభుత్వ ఉద్యోగం చేసిన వారికి ఉద్యోగ విరణమ తప్పదని తెలిపారు. నందిగామలో సుదీర్ఘంగా ఏడు సంవత్సరాలు పాటు ఉద్యోగం పశువైద్య శాఖలో సేవలందించారు. నందిగామ వైద్యశాఖ సిబ్బంది రామస్వామి మాట్లాడుతూ ఆయన అందరితో స్నేహశీలితో, ఎవర్ని నొప్పించకుండా, కలివిడిగా కలిసిపోయి ఉండేవారని, తోటి ఉద్యోగులతో తోటి ఉద్యోగులతో సమానంగా పనిచేసేవారు తెలిపారు. ఈ



కార్యక్రమంలో జాయింట్ డైరెక్టర్ విద్యాసాగర్, మరియు మండల అధికారులు,నందిగామ పశువైద్య శాఖ సిబ్బంది, పాల్గొని ఉద్యోగ విరమణకు వచ్చిన అతిథులుశాలువ పులమాలతో ఘనగ సన్మానించారు. నందిగామ వైద్యశాఖ సిబ్బంది ఘనంగా సన్మానించారు.

# పేదల కడుపు నింపడమే ప్రభుత్వ లక్ష్యం!!

## రేషన్ షాపుల్లో సన్నబియ్యం సరఫరాకు ప్రభుత్వం సిద్ధం!!


నాగర్ కర్నూల్ వనపర్తి బ్యూరో/జూన్ 28 (గౌతమ్ న్యూస్): తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా రేషన్ షాపుల్లో పేద ప్రజలకు సన్న బియ్యం పంపిణీ చేయడానికి ప్రభుత్వం శరవేగంగా అడుగులు ముందుకేస్తుంది, కడు పేదరికంతో తినడానికి తిండి లేక పస్తులు ఉంటున్న పేద బడుగు బలహీన వర్గాల ప్రజల సంక్షేమం కోసం కాంగ్రెస్ ప్రభుత్వం అందరూ సమానమే అనే లక్ష్యంతో పేద ప్రజలు ఆకలితో అలమటించకుండా ప్రతి ఒక్కరు సన్న బియ్యం తో కడుపునిండా ఆహారం తినాలని ప్రభుత్వం ఎంతో సంకల్పంతో ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టడం తెలంగాణ వ్యాప్తంగా ప్రజలు



హర్షం వ్యక్తం చేస్తున్నారు, రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇటీవల క్యాబినెట్ సమావేశంలో రేషన్ షాప్ లో సన్నబియ్యం పంపిణీ చేపట్టాలని అధికారులు ఆదేశించడం గొప్ప విశేషం అంతేకాక రాష్ట్రంలో కోన మైసూర్ వరి పంటకు ప్రభుత్వం ప్రాధాన్యత కల్పిస్తూ క్వింటాలు వట్లకు 500 రూపాయలు బోనస్ ప్రకటించడం కూడా ఇందుకు నిదర్శనం అని చెప్పవచ్చు , రైతులు సోనా మైసూరి పంటలు పండించి ప్రభుత్వానికి గిట్టుబాటు ధరకు అమ్మడం వల్ల ఒకపక్క రైతు లాభం పొందడమే కాక రాష్ట్రవ్యాప్తంగా రేషన్ షాపుల్లో సన్న బియ్యం పంపిణీ చేపట్టడానికి సులువుగా ఉంటుందని ప్రభుత్వం భావిస్తుంది, ఇందులో భాగంగానే సోనా మైసూర్ పంటకు ప్రభుత్వం బోనస్ ప్రకటించింది, మంత్రి తుమ్మల నాగేశ్వరావు ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు సన్న బియ్యం పంపిణీ పై యుద్ధ ప్రాతిపదికను



చర్యలు తీసుకుంటున్నారు, గతంలో దారిద్రియ రేఖకు దిగున ఉన్న పేద ప్రజలకు గత ప్రభుత్వాలు రేషన్ షాపుల్లో నిత్యావసర వస్తువులతో పాటు సన్నబియ్యాన్ని పంపిణీ చేయకపోవడం పేద ప్రజలు ఆకలితో అలమటిస్తున్న నేపథ్యంలో ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిసింది, పేద ప్రజల జీవన విధానంలో మార్పు రావాలని వారి మనగడం కోసం ఆహార ధాన్యాలు అందించే దిశగా ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడం అభినందనీయం, రైతులు పండించిన సన్నబియ్యాన్ని రేషన్ షాపులో సరఫరా చేయుటకు గతంలో ఏ ప్రభుత్వం చేయని సహాసాని గొప్ప నిర్ణయాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం ముందుకు తీసుకోవడం వల్ల లక్షలాదిమంది పేద కుటుంబాలు ఆకలితో అలమటించకుండా కడుపునిండా సన్న బియ్యంతో జీవితాలతో వెలుగు నింపాలని ప్రభుత్వం భావిస్తుంది, అంతేకాక టిఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో 9 సంవత్సరాల కాలం పాటు రాష్ట్రంలో కొత్త రేషన్ కార్డులను మంజూరు చేయకపోవడం వల్ల రేషన్ కార్డుకు నోచుకోని అభాగ్యులు అమాయక ప్రజలు ఆహార భద్రతకు ఆహార ధాన్యాలకు దూరమైపోతున్నారని ప్రభుత్వం భావించి త్వరలోనే కొత్త రేషన్ కార్డులను కూడా మంజూరు చేయుటకు




ప్రభుత్వం చర్యలు తీసుకుంటుంది, కొత్త రేషన్ కార్డులతో పాటు గతంలో ఇచ్చిన రేషన్ కార్డులలో కూడా మార్పులు చేపట్టి వాటి స్థానంలో కొత్త రేషన్ కార్డులను ప్రభుత్వం పేద ప్రజలకు అందించేందుకు కృషి చేస్తుంది, మొత్తం మీద రేషన్ షాపుల్లో సన్న బియ్యం సరఫరాతో పాటు కొత్త రేషన్ కార్డులు పంపిణీ చేసేందుకు ప్రభుత్వం సనాలు చేయడం రాష్ట్రవ్యాప్తంగా ప్రజలలో ఆనందాలు వెళ్ళు విరుస్తున్నాయి, ఈ కార్యక్రమం సాధ్యమంత త్వరగా ప్రభుత్వం చేపట్టడానికి ముందుకు సాగుతుంది,

## టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడిగా పల్లా శ్రీనివాసరావు బాధ్యతలు శుభాకాంక్షలు తెలియజేసిన నందిగామ శాసనసభ్యులు శ్రీమతి తంగిరాల సౌమ్య



నందిగామ /జూన్ 28 (గౌతమ్ న్యూస్): ఎన్టీఆర్ భవన్?లో బాధ్యతలు స్వీకరించిన పల్లా శ్రీనివాసరావు మంగళగిరి కేంద్ర పార్టీ కార్యాలయంలో టిడిపి నూతన అధ్యక్షులు శ్రీ పల్లా శ్రీనివాసరావు మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలియజేసిన నందిగామ శాసనసభ్యులు శ్రీమతి తంగిరాల సౌమ్య

## లంబాడీల ఐక్య వేదిక స్టేట్ కోఆర్డినేటర్ గా నియామకం



ధారావత్ వీరస్వామి నాయక్

మానుకోట జిల్లా /జూన్ 28 (గౌతమ్ న్యూస్): వరంగల్ జిల్లా దుగ్గొండి మండలం, వెంకటాపురం గ్రామ మంగలిపల్లి కి చెందిన దారవత్ వీరస్వామి నాయక్ కి లంబాడీల ఐక్య వేదిక రాష్ట్ర కోర్డినేటర్ గా నియామక పత్రాన్ని రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ రాజ్ కుమార్ జాదవ్ మరియు చీఫ్ కోఆర్డినేటర్ జాదవ్ రమేష్ నాయక్ రాష్ట్ర కార్యాలయం లక్డికాపూల్ లో అందజేశారు. ఎంతో నమ్మకంతో పది సంవత్సరాలుగా గిరిజన జాతికి సేవలందిస్తున్న వీరస్వామి నాయక్ ను రాష్ట్ర కోఆర్డినేటర్ గా నియమించారు. ఈ సందర్భంగా వీరస్వామి నాయక్ మాట్లాడుతూ తన పై ఉన్న నమ్మకంతో వరసగా నాల్గవ సారి స్టేట్ కోఆర్డినేటర్ గా నియమించిన అధ్యక్షులు డాక్టర్ రాజకుమార్ జాదవ్ మరియు రాష్ట్ర చీఫ్ కోఆర్డినేటర్ జాదవ్ రమేష్ నాయక్ కి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. లంబాడీ, బంజారా, సుగాలీల కోసం, గోర్ జాతిని ఏకం చేయడం కోసం, దేశ, రాష్ట్ర, జిల్లాలలో జాతి అభ్యున్నతి కోసం పాటుపడతాను. తెలంగాణలో ఉన్న గిరిజన లంబాడీలకు 10 శాతం రిజర్వేషన్ కల్పింన కోసం రాష్ట్ర ప్రభుత్వంపై ఒత్తిడి తేవాలి. రాష్ట్రవ్యాప్తంగా ప్రతి జిల్లాకి తిరిగి లంబాడి ఐక్యవేదికను బలోపేతం చేయడానికి నా వంతుగా కృషి చేస్తాను అని అన్నారు.

## రాష్ట్ర ప్రభుత్వం విద్యారంగ సమస్యలు పరిష్కరించాలి

నమస్కారానికి ప్రతి నమస్కారం సంస్కారం అంటారు పెద్దలు కానీ

నర్సంపేట ఆర్డీవో మేడం కృష్ణవేణి కూర్చొని తీసుకుంటుంది వినతి పత్రం



నర్సంపేట /జూన్ 28 (గౌతమ్ న్యూస్): ఏబీవీపీ వరంగల్ జిల్లా కన్వీనర్ గజ్జల దేవేందర్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో నర్సంపేట ఆర్డిఓ కృష్ణవేణి కి వినతి పత్రం అందజేశారు, ఈ సందర్భంగా కార్యక్రమంలో పాల్గొన్న ఏబీవీపీ వరంగల్ జిల్లా కన్వీనర్ గజ్జల దేవేందర్ మాట్లాడుతూ... రాష్ట్రంలో కొత్త ప్రభుత్వ ఏర్పడ్డాక విద్యావ్యవస్థ మెరుగుపడుతుందనుకుంటే అది కాకుండా రాష్ట్రంలో మద్యానికి ఉన్న విలువ విద్యకు లేదు అని మండి పడ్డారు, రాష్ట్రంలో మద్యం శాఖకు మంత్రి ఉన్నాడు కానీ విద్యా శాకకు లేకపోవడం రాష్ట్ర ప్రభుత్వానికి సిగ్గుచేటు అని అన్నారు,నేడు రాష్ట్రంలో నెలకొన్న విద్యారంగ సమస్యలను పరిష్కరించాలని ,రాష్ట్రంలో ఉన్నటువంటి ప్రైవేట్ కార్పొరేట్ ఇంటర్నేషనల్ పాఠశాలలో అక్రమంగా లక్షల లక్షలు ఫీజులు వసూలు చేస్తున్న కానీ వాళ్లను పట్టించుకునే నాధుడే లేదు యజమాన్యం పైన కఠిన చర్యలు తీసుకోవాలనీ, రాష్ట్రంలో ఫీజు నియంత్రణ చట్టం అమలులోకి తీసుకురావాలనీ,ప్రభుత్వ పాఠశాలలో ఉపాధ్యాయుల కొరత లేకుండా చూడాలనీ వెంటనే ఎంఈఓ డీఈఓ లను నియమించాలనీ మాట్లాడారు, మెగా డీఎస్సీ ద్వారా ఒకేసారి 24 వేలకు పైగా ఖాళీగా ఉన్నటువంటి టీచర్ పోస్టులను భర్తీ చేయాలనీ, విద్యాహక్కు చట్టం ప్రకారం ప్రైవేట్ పాఠశాలలో పేద విద్యార్థులకు 25% సీట్లు కేటాయించాలని అన్నారు, ప్రభుత్వ గుర్తింపు మరియు నిబంధనలు పాటించని ప్రైవేటు పాఠశాలల గుర్తింపు రద్దు చేయాలనీ, ప్రభుత్వ పాఠశాలలో పెడుతున్న మధ్యాహ్న భోజనంలో జరుగుతున్న అవకతవకల పైన విచారణ జరిపించి నాణ్యతలేని ఆహారాన్ని అందిస్తున్న అధికారుల పైన చట్టపరమైన చర్యలు తీసుకోవాలనీ, ప్రభుత్వ పాఠశాలలలో అటెండర్ నియమించాలనీ కొరారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పొన్నాల శశికుమార్ కార్యకర్తలు :- ఆది, సూర్యతేజ, హేమంత్, సిద్ధూ తదితరులు పాల్గొన్నారు.

## నీటి నిల్వలో యాంటి లార్వా ఆయిల్ బాల్స్ వేసిన

మున్సిపల్ చైర్మన్ డాక్టర్ పాల్వాయి రాంమోహన్ రెడ్డి



మానుకోట జిల్లా /జూన్ 28 (గౌతమ్ న్యూస్): శుక్రవారం ఫ్రైడే డ్రైడే కార్యక్రమంలో భాగంగా మహబూబాబాద్ పట్టణంలోని 24 వ వార్డు ఇందిరా నగర్ కాలనీలో నిల్వ ఉన్న నీటిలో యాంటి లార్వా ఆయిల్ బాల్స్ వేసిన మున్సిపల్ చైర్మన్ డాక్టర్ పాల్వాయి రాంమోహన్ రెడ్డి, వైస్ చైర్మన్ మార్నేని వెంకన్న. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దోమల ద్వారా వ్యాధులు వ్యాపించే అవకాశం ఉన్నందున వృద్ధి చెందకుండా నిల్వ ఉన్న నీటిలో యాంటి లార్వా ఆయిల్ బాల్స్ వేయడం జరిగినదని ప్రతీ ఒక్కరూ తమ ఇంటి పరిసరాల్లో, పాత టైర్లలో నీటిని నిల్వ లేకుండా చూసుకోవాలని తగు జాగ్రత్తలు పాటించాలని కోరారు. ఈ డ్రై డే కార్యక్రమంలో డి.ఈ ఉపేందర్, మార్నేని కిరణ్, ఎన్విరాన్మెంట్ ఇంజనీర్ క్రాంతి, అంగన్వాడి, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు మరియు స్థానికులు పాల్గొన్నారు.

## ప్రపంచ పర్యావరణ సంస్థ తెలంగాణ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా ఎన్నికైన బరిగెల భూపేష్ ను అభినందించిన

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఎస్పీ రోహిత్ రాజ్ ఐపీఎస్.




భద్రాద్రి కొత్తగూడెం ఆర్ సి /జూన్ 28 (గౌతమ్ న్యూస్): కొత్తగూడెం : భద్రాద్రి కొత్తగూడెం జిల్లా సింగరేణి కార్మిక ప్రాంతం రామవరం పట్టణానికి చెందిన బరిగెల భూపేష్ ను ఇటీవల" వరల్డ్ ఎన్విరాన్మెంట్ ఆర్గనైజేషన్". (డబ్ల్యూ ఈ ఓ)జాతీయ అధ్యక్షుడు సిహెచ్ భద్ర , రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నిఖిల్, రాష్ట్ర కార్యదర్శి ముత్యాల క్రాంతి , భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కార్యవర్గ సభ్యులు ఏకగ్రీవంగా తెలంగాణ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా ఎన్నికవ్వడం పట్ల భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఎస్పీ రోహిత్ రాజు ఐపీఎస్ భూపేష్ ను అభినందించారు.

## అంబులెన్స్ లోనే పురుడు పోసిన ఆంబులెన్స్ సిబ్బంది



ఏటూరు నాగారం /జూన్ 28 (గౌతమ్ న్యూస్): ములుగు జిల్లా స్టాపర్ కన్నాయిగూడెం మండలం గుర్రేవుల గ్రామానికి చెందిన వాసం పెల్లి సంధ్య 28 కి పురిటి నొప్పులు రావడంతో దగ్గర్లోని ప్రాథమిక వైద్యశాలకు వెళ్లగా అక్కడ పరీక్షించగా వైద్యులు మెరుగైన వైద్యం కోసం ఏటూరునాగారం సామాజిక ఆసుపత్రికి తరలించగా సంబంధిత గైనకాలజిస్ట్ డాక్టర్ గర్భిణీ స్త్రీ ఆరోగ్య పరిస్థితిని పరిశీలించి ములుగు జిల్లా కేంద్ర ఆసుపత్రికి వెళ్లాలని సూచించగా ఏటూరునాగారం అంబులెన్స్ కి సమాచారం అందించగా హుటాహుటిన ఆసుపత్రికి చేరుకొని గర్భిణీ స్త్రీని ములుగు జిల్లా ఆసుపత్రికి తరలిస్తున్న క్రమంలో పసర గ్రామం చేరుకోగానే గర్భిణీ స్త్రీకి పురిటి నొప్పులు అధికం అవడంతో గమనించిన అంబులెన్స్ సిబ్బంది ఈఎంటి నాగరాజు ఎంతోచానాచక్యంగా వ్యవహరించి గర్భిణీ స్త్రీకి సుఖ ప్రసవం చేయగా పండంటి మగ బిడ్డ జన్మించాడు తల్లి బిడ్డలు క్షేమంగా ఉండగా బాలింతకు కావలసిన ప్రథమ చికిత్స అందించి మెరుగైన వైద్యం కోసం ములుగు జిల్లా ఆస్పత్రికి తరలించి సుఖప్రసవం జరిగిన తీరుని వైద్యులకు వివరించి ఆసుపత్రిలో చేర్పించడం జరిగింది ఈ సుఖ ప్రసవంలో అంబులెన్స్ సిబ్బంది ఈఎంటి నాగరాజు పైలెట్ దశరథం గర్భిణీ శ్రీ కుటుంబ సభ్యులు ఉన్నారు రెండు ఆసుపత్రులను దాటుకొని జిల్లా ఆసుపత్రికి తీసుకెళ్తున్న క్రమంలో అంబులెన్స్ లోనే సుఖ ప్రసవం చేసిన అంబులెన్స్ సిబ్బందికి గర్భిణీ శ్రీ కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

## కౌన్సిలర్ పోతరాజు ని ధరణి హాస్పిటల్ లో పరామర్శించిన

శాసనసభ్యులు డాక్టర్ మురళి నాయక్



మానుకోట జిల్లా /జూన్ 28 (గౌతమ్ న్యూస్): మహబూబాబాద్ పట్టణ కేంద్రంలోని 14వ వార్డుకు చెందిన కాంగ్రెస్ పార్టీ వార్డు కౌన్సిలర్ పోతరాజు రాజు హాస్పిటల్లో చికిత్స పొందుతున్న విషయం తెలుసుకొని వారినీ పరామర్శించిన మహబూబాబాద్ శాసనసభ్యులు డాక్టర్ భూక్య మురళి నాయక్ అలాగే వారి యొక్క ఆరోగ్య నిలకడను అడిగి తెలుసుకొని, పోతరాజు కి మెరుగైన వైద్యం అందించాలని వైద్యులకు సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు పట్టణ పలు వార్డు కౌన్సిలర్లు, మండల కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, జిల్లా యూత్ నాయకులు, కార్యకర్తలు, వివిధ విభాగాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# విషజ్వరలపై అప్రమత్తంగా ఉండాలి

## రాష్ట్ర పంచాయితీ రాజ్ గ్రామీణాభివృద్ధి, స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మంత్రి దనసరి అనసూయ సీతక్క

## వైద్యులు అందుబాటులో ఉండాలి.





ఏటూరునాగారం **/జూన్ 28 (గౌతమ్ న్యూస్):** ములుగు జిల్లా స్టాపర్: వర్షాకాల నేపథ్యంలో విషజ్వరలపై అప్రమత్తంగా ఉండాలని, వైద్యులు అందుబాటులో ఉండాలని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మంత్రి దనసరి అనసూయ సీతక్క అన్నారు. శుక్రవారం ఏటూరు నాగారం మండల కేంద్రంలోని పల్లె దవాఖాన ను రాష్ట్ర పంచాయితీ రాజ్, గ్రామీణాభివృద్ధి, స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి దనసరి అనసూయ సీతక్క , జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్, ఐటిడిఏ ప్రాజెక్ట్ ఆఫీసర్ చిత్రా మిశ్రా లతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ వర్షాకాలం నేపథ్యంలో విష జ్వరాలపై వైద్య అధికారులు అప్రమత్తంగా ఉండాలని ప్రజలకు అందుబాటులో ఉండాలని సూచించారు. మందుల కొరత లేకుండా చూసుకోవాలని , ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించడానికి కృషి చేయాలని అన్నారు.

# ఈనెల 29-06-2024 న కొత్తగూడెం క్లబ్బులో నిర్వహించాల్సిన మెగా జాబ్ మేళా 01-07-2024 కి వాయిదా

## జిల్లా యువజన మరియు క్రీడల అధికారి కె.సంజీవరావు తెలిపారు.



భద్రాద్రి కొత్తగూడెం ఆర్ సి**/జూన్ 28 (గౌతమ్ న్యూస్):** కొత్తగూడెం కలెక్టరేట్ : ఈనెల 29న జరగాల్సిన మెగా జాబ్ మేళా జులై 1 కి వాయిదా వేసినట్లు తెలిపిన జిల్లా యువజన మరియు క్రీడల అధికారి కె సంజీవరావు.ఈ జాబ్ మేళా ( టి జి స్టెప్) తెలంగాణ సొసైటీ ఫర్ ట్రైనింగ్ అండ్ ఎంప్లాయిమెంట్ ప్రమోషన్ సికింద్రాబాద్, మరియు జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు జిల్లా యువజన మరియు క్రీడల శాఖ నిర్వహిస్తున్న అన్నారు. ఉచితంగా నమోదు చేసుకోండి మరియు జాబ్ మేళాకు హాజరు అవ్వండి ఈ కార్యక్రమంలో జిల్లా యువజన మరియు క్రీడల సూపర్డెంట్ ఉదయ్ కుమార్, తిరుమల రావు, లక్ష్మణ్ తదితరులుపాల్గొన్నారు.ఆన్లైన్ రిజిస్ట్రేషన్ కొరకు: https://forms.gle/awh1uo5poS6Rrt306.

### రిజిస్ట్రేషన్ మరియు అర్హత వివరాలు:

మెగా జాబ్ మేళా - 01 - జులై 2024/దయచేసి 10 రెజ్యూమ్‌లను తీసుకెళ్లండి సమయం ఉదయం 10 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు. వయసు - 18 - 35 సం. విద్యార్హత- 0 నుండి పీజీ వరకు. జాబ్ మేళా తేదీ: 01/07/2024 వేదిక : కొత్తగూడెం క్లబ్, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా.

# శ్రీ సమ్మక్క సారలమ్మ వన దేవతలను దర్శించుకున్న రాష్ట్ర పంచాయితీ రాజ్, గ్రామీణాభివృద్ధి, స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మంత్రి దనసరి అనసూయ సీతక్క





ఏటూరునాగారం(తాడ్వాయి)**/జూన్ 28 (గౌతమ్ న్యూస్):** ములుగు జిల్లా స్టాపర్: శుక్రవారం శ్రీ సమ్మక్క సారలమ్మ వన దేవతలను రాష్ట్ర పంచాయితీ రాజ్, గ్రామీణాభివృద్ధి, స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మంత్రి దనసరి అనసూయ సీతక్క, జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్, ఐటిడిఏ ప్రాజెక్ట్ ఆఫీసర్ చిత్రా మిశ్రా, అదనపు కలెక్టర్ పి.శ్రీజ లతో కలిసి దర్శించుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈవో రాజేంద్రం, పూజరుల సంఘం అధ్యక్షుడు సిద్దబోయిన జగ్గారావు, స్థానిక తహశీల్దార్ రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

# శివంపేట్ మండల చివరి సర్వసభ్య సమావేశంలో ఎంపీటీసీలను సన్మానించిన ఎమ్మెల్యే సునీత లక్ష్మారెడ్డి!!

## మెదక్ జిల్లా ఎంపీపీల ఫోరమ్ అధ్యక్షుడు శివంపేట్ మండల ఎంపీపీ కల్లూరి హరికృష్ణ!!







నర్సాపూర్ **/జూన్ 28 (గౌతమ్ న్యూస్):** శివంపేట మండల కేంద్రంలో శుక్రవారం సర్వ సభ్య సమావేశాన్ని నిర్వహించిన ఎంపీపీ కల్లూరి హరికృష్ణ. ముఖ్యఅతిథిగా హాజరైన నర్సాపూర్ ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి, ఈ సమావేశంలో గ్రామంలో నెలకొన్న సమస్యలపై చర్చించారు. పాలకవర్గం చివరి సమావేశం కావడంతో ఎంపీటీసీలు ,ఎంపీపీ ని ఘనంగా శాలువాతో సత్కరించిన ఎమ్మెల్యే వాకిటి సునీత లక్ష్మారెడ్డి.ఈ కార్యక్రమంలో మండల తహసిల్దార్ శ్రీనివాసచారి, ఎంపిడిఓ నాగేశ్వర్ గుప్తా,జిల్లా జడ్పీ కోఆప్షన్ మన్సూర్, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ చంద్ర గౌడ్, మండల కో ఆప్షన్ లాయక్, మండలంలోని వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు, మండలంలోని ఎంపీటీసీలు, తదితరులు పాల్గొన్నారు.




# విద్యార్థులకు పౌష్టిక ఆహారాన్ని అందించాలి... రాష్ట్ర పంచాయితీ రాజ్, గ్రామీణాభివృద్ధి, స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మంత్రి దనసరి అనసూయ సీతక్క

## వసతి గృహాల పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలి.



ఏటూరునాగారం **/జూన్ 28 (గౌతమ్ న్యూస్):** ములుగు జిల్లా స్టాపర్: విద్యార్థులకు పౌష్టిక ఆహారాన్ని అందించాలని , వసతి గృహాల పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని రాష్ట్ర పంచాయితీ రాజ్, గ్రామీణాభివృద్ధి, స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మంత్రి దనసరి అనసూయ సీతక్క అన్నారు శుక్రవారం రాష్ట్ర పంచాయితీ రాజ్,



గ్రామీణాభివృద్ధి, స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మంత్రి దనసరి అనసూయ సీతక్క , జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్, ఐటిడిఏ ప్రాజెక్ట్ ఆఫీసర్ చిత్రా మిశ్రా లతో కలిసి ఏటూరు నాగారం ఆకులవారి ఘనపురం లోని ప్రభుత్వ గిరిజన బాలికల ఆశ్రమ వసతి గృహం పరిశీలించి , విద్యార్థులతో అల్పాహారం చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ విద్యార్థులకు పౌష్టిక ఆహారాన్ని అందించాలని, ఆహారం సరిగా ఉంటే విద్యార్థులు చదువు పై దృష్టి పెడతారని, వసతి గృహాల పరిసరాలు పరిశుభ్రంగా ఉండేలా చూడాలని అధికారులను ఆదేశించారు. విద్యార్థులు చదువు తో పాటు క్రీడలు , సాంస్కృతిక కార్యక్రమాలు, స్కిల్ డెవలప్మెంట్ తగతులపై ఆసక్తి కనబర్చాలని విద్యార్థులకు సూచించారు. జిల్లా కలెక్టర్ విద్యార్థులతో మాట్లాడుతూ ఎలాంటి ఇబ్బందులు తలెత్తిన వెంటనే తమ దృష్టికి తీసుకురావాలని, జీవిత లక్ష్యాలను ఎంచుకోవాలని వాటి సాధనకు కృషి చేయాలని సూచించారు. పౌష్టిక ఆహారం అందించడం లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు పి.శ్రీజ , ఏటూరు నాగారం ఏఎస్పీ మహేష్ బాబా గీతే , ఐటిడిఏ అసిస్టెంట్ ప్రాజెక్ట్ ఆఫీసర్ వసంతరావు, ఏ టి డబ్ల్యూ ఓ దేశిరం , ఇతర అధికారులు పాలోన్నారు.

# నూతన టెక్నాలజీ తో గోదావరి నది కరకట్ట నిర్మాణం

## రాష్ట్ర పంచాయితీ రాజ్ గ్రామీణాభివృద్ధి స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి దనసరి అనసూయ సీతక్క.

ఏటూరునాగారం **/జూన్ 28 (గౌతమ్ న్యూస్):** ములుగు జిల్లా స్టాపర్: రామన్న గూడెం , మంగపేట కరకట్ట పరిశీలన. నీటిపారుదల శాఖ అధికారులతో సమీక్ష సమావేశం. కరకట్ట నిర్మాణం పై పవార్ పాయింట్ ప్రజెంటేషన్. శాశ్వత ప్రాతిపదికన కరకట్ట నిర్మాణ పనులను పనులు వెంటనే ప్రారంభించాలి :: జిల్లా కలెక్టర్ నూతన టెక్నాలజీతో గోదావరి నది కరకట్ట నిర్మాణం జరగబోతున్నదని,శాశ్వత ప్రాతిపదికన నిర్మాణ పనులు వెంటనే ప్రారంభించాలని రాష్ట్ర పంచాయితీ రాజ్ గ్రామీణాభివృద్ధి స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి దనసరి అనసూయ సీతక్క అన్నారు. శుక్రవారం ఏటూరు నాగారం ఐటిడిఏ కార్యాలయంలో రాష్ట్ర పంచాయితీ రాజ్ గ్రామీణాభివృద్ధి స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి దనసరి అనసూయ సీతక్క , జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్, ఐటిడిఏ ప్రాజెక్ట్ ఆఫీసర్ చిత్రా మిశ్రా, అదనపు కలెక్టర్ స్థానిక సంస్థ పి.శ్రీజ లతో కలిసి నీటిపారుదల శాఖ అధికారులతో గోదావరి నది కరకట్ట నిర్మాణ పనులపై సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున కరకట్ట జాప్యం జరిగిందని ఎగువ రాష్ట్రాల్లో కురిసిన వర్షాలకు వరద ప్రభావానికి కరకట్టకు ఎలాంటి ముప్పు వాటిల్లకుండా అధునాతన నూతన టెక్నాలజీతో జియో ట్యూబ్స్ టెక్నాలజీ తో డిజైన్లు రూపొందించడం జరుగుతుందని తెలిపారు.





ఎన్నో సంవత్సరాలుగా కరకట్టకు తాత్కాలిక పనులు చేసిన వర్షాకాలం లో ఇబ్బందులు ఎదుర్కునే పరిస్థితి ఉండేది కానీ నూతన టెక్నాలజీ తో శాశ్వత ప్రాతిపదికన కరకట్ట నిర్మాణం జరుగుతుందని తెలిపారు. రామన్నగూడెం, మంగపేట కరకట్ట ను పరిశీలించి గ్రామాలు ముంపుకు గురి కాకుండా ఉండే విధంగా చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. అదేవిధంగా తుప్పు పట్టిన షట్టర్లను మరమ్మత్తు పనులు చేపట్టాలని ఇరిగేషన్ అధికారులకు మంత్రి ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు పి.శ్రీజ ఏటూరు నాగారం ఏఎస్పీ మహేష్ బాబా గీతే, నీటి పారుదల శాఖ చీఫ్ ఇంజనీర్ విజయ్, తదితరులు పాల్గొన్నారు.

# అమ్మ ఆదర్శ ల్లో అభివృద్ధి పనుల్లో జాప్యం,...

నల్లబెల్లి**/జూన్ 28 (గౌతమ్ న్యూస్):** అమ్మ ఆదర్శ పాఠశాలల్లో తలపెట్టిన అభివృద్ధి పనులు నత్తనడకన సాగుతున్న దుస్థితి మండలంలో నెలకొంది . ఈ క్రమంలో విద్యార్థులు తల్లిదండ్రుల్లో అసహనం వ్యక్తం అవుతుంది మండలంలోని 45 ప్రభుత్వ పాఠశాలలను రాష్ట్ర ప్రభుత్వం అమ్మ ఆదర్శ పాఠశాలలుగా గుర్తించింది వీటిలో 1739 మంది విద్యార్థులు ఉండగా వారిలో 810 మంది బాలురు 929 మంది బాలికలు ఉన్నారు సదరు పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పించేందుకు ప్రభుత్వం రూ.1.09 కోట్లు మంజూరు చేసింది. పనుల నిర్వహణను గ్రామక్య సంఘాలకు అప్పగించింది పనులు చేపట్టేందుకు అడ్వాన్స్ గా రు.27.73 లక్షలను అమ్మ ఆదర్శ పాఠశాలల చైర్మన్ లకు అందజేశారు ఆయా పాఠశాలల్లో ఈ నెల 10 నాటికే పనులు పూర్తి చేయాల్సి ఉండగా నేటికీ పనులు పూర్తికాలేదు మండలంలోని పలు పాఠశాలల్లో కిటికీలు తలుపులు బిగించలేదు ఫ్లోరింగ్ పనులు కూడా పూర్తి కాలేదు. పాఠశాలలకు నీటి సరఫరా చేసే ట్యాంకులు బిగించలేదు మరుగుదొడ్ల మరమ్మత్తులు కూడా పూర్తి చేయలేదు అసంపూర్తిగా పనులు అయ్యాయి పాఠశాలల్లో వసతులు కల్పించే పేరుతో రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి పనులు గడువు ముగిసి 15 రోజులు కావస్తున్న పూర్తి కాకపోవడంతో విద్యార్థుల తల్లిదండ్రులు అసహనం వ్యక్తం చేస్తున్నారు పనులను గ్రామ సమాఖ్యలకు అప్పగించినట్లు చెబుతున్న వాస్తవానికి ఆయా గ్రామాల్లో కాంట్రాక్టర్లు చేస్తున్నట్లు తెలుస్తుంది. సంబంధిత అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుండడంతోనే పనులు పూర్తి చేయడంలో ఆలస్యం జరుగుతుందన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి ఇకనైనా పనులు త్వరగా పూర్తిచేయాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.



### త్వరలో పనులు పూర్తి చేయిస్తాం...

అమ్మ ఆదర్శ పాఠశాలల్లో అభివృద్ధి పనులు కొనసాగుతున్నాయి పర్యవేక్షిస్తున్నాం ఇప్పటికే 50 శాతం పూర్తి అయ్యాయి మిగతా పనులు త్వరలో పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటున్నాం శ్రీనివాసరావు ,ఎం ఎన్ ఓ ,నల్లబెల్లి

# రైతులకు త్వరలోనే 2 లక్షల రుణమాఫీ

## రాష్ట్ర పంచాయితీ రాజ్, గ్రామీణాభివృద్ధి, స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మంత్రి దనసరి అనసూయ సీతక్క.

## మహిళ శక్తి క్యాంటీన్ల ఏర్పాటుకు అవకాశం కల్పిస్తాం.



ఏటూరునాగారం**/జూన్ 28 (గౌతమ్ న్యూస్):** ములుగు జిల్లా స్టాపర్: రైతు సేవ సహకార సంఘం కాంప్లెక్స్ ప్రారంభం. రైతులు ఆధునికత వ్యవసాయంపై అవగాహన పెంచుకోవాలి :: జిల్లా కలెక్టర్ దివాకర టి. ఎస్. త్వరలోనే కమలాపురం బిల్ట్ ఫ్యాక్టరీ పున ప్రారంభానికి చర్యలు. రైతులకు త్వరలోనే రెండు లక్షల రుణమాఫీ చేయడం జరుగుతుందని రాష్ట్ర పంచాయితీ రాజ్, గ్రామీణాభివృద్ధి, స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మంత్రి దనసరి అనసూయ సీతక్క తెలిపారు. శుక్రవారం రాష్ట్ర పంచాయితీ రాజ్, గ్రామీణాభివృద్ధి, స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మంత్రి దనసరి అనసూయ సీతక్క మంగపేట మండల కేంద్రంలో నాబార్డ్ నిధులతో 10 గదులు, 10 షేటర్స్ తో కోటి 29 లక్షల రూపాయలతో నిర్మించిన రైతు సేవ సహకార సంఘం కాంప్లెక్స్ భవనాన్ని జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్. ఐటీడీఏ పీవో ప్రాజెక్ ఆఫీసర్ చిత్రా మిశ్రా లతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రైతులకు ప్రభుత్వం త్వరలోనే ఏకకాలంలో రెండు లక్షల రూపాయల రుణమాఫీ చేసే విధంగా ప్రణాళికల సిద్ధం చేస్తుందని పేర్కొన్నారు. రైతులు వ్యవసాయ రంగంలో ఎలాంటి సందేహాలు తలెత్తిన స్థానికంగా ఉండే వ్యవసాయ అధికారులను అడిగి సందేహాలను నివృత్తి చేసుకోవాలని పంట మార్పిడి పై అవగాహన పెంచుకోవాలని నకిలీ విత్తనాలను జిల్లాలో రాకుండా చూడాలని అన్నారు. మంగపేట కేంద్రంలో బస్టాండ్ నిర్మాణానికి ప్రణాళికల సిద్ధం చేస్తామని, నూతనంగా నిర్మించిన రైతు సేవ సహకార సంఘం కాంప్లెక్స్ భవనం ఆవరణలో మహిళ శక్తి క్యాంటీన్ల ఏర్పాటుకు అవకాశం ఉందని మహిళా స్వయం సంఘాల ద్వారా మహిళలు ముందుకు రావాలని సూచించారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ రైతులు అధిక దిగుబడినిచ్చే పంటలను సేద్యం చేయాలని వ్యవసాయంలో ఆధునికతపై అవగాహన పెంచుకోవాలని సూచించారు. అనంతరం మంత్రి , జిల్లా కలెక్టర్ కమలాపురం గ్రామంలోని రేయాన్స్ బిల్ట్ ఫ్యాక్టరీ పరిశ్రమను పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ త్వరలోనే కమలాపురం బీట్ ఫ్యాక్టరీ పున ప్రారంభానికి చర్యలు తీసుకుంటామని, ఫిన్ క్వెస్ట్ సంస్థ ద్వారా బిల్ట్ ఫ్యాక్టరీలోని పాత యంత్రాలు, పాత సామాను తొలగింపు పనులు జరుగుతున్నాయని , పాత మిషనరీ తొలగింపు విషయంలో జాప్యం చేయకుండా చూడాలని ఫిన్ క్వెస్ట్ సంస్థ , ప్రతినిధులకు సూచించారు. త్వరలో బిల్ట్ ఫ్యాక్టరీని పున ప్రారంభం చేసేందుకు ప్రత్యేకంగా ఐటీ శాఖ మంత్రి తో చర్చించడం జరిగిందని, ప్రారంభించేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందని పేర్కొన్నారు. దీని ద్వారా స్థానిక యువతకు , ఉపాధి అవకాశాలు లభిస్తాయని , మహిళలకు జీవనోపాధి దొరుకుతుందని మంత్రి తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు పి.శ్రీజ, ఏటూరు నాగారం ఏఎస్పి మహేష్ బాబా, డి సి ఓ సర్దార్ సింగ్ , రైతు సేవా సహకార సంఘం డైరెక్టర్లు, సభ్యులు , ఫిన్ క్వెస్ట్ సంస్థ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## వేలం పాట కార్యక్రమంలో ఎంపీవో గణేష్ గాంధీ

### టేకులపల్లి సంత 8 లక్షల 31 వేలలు పలికిన సంత వేలం:



టేకులపల్లి /జూన్ 28 (గౌతమ్ న్యూస్): టేకులపల్లి మండల కేంద్రంలో ప్రతి శనివారం నిర్వహించు సంత వేలం పాటలో 8 లక్షల 31 వేల రూపాయాలకు మూడ్ వాసు సొంతం చేసుకున్నట్లు మండల పంచాయితీ అధికారి గణేష్ గాంధీ తెలిపారు. శుక్రవారం టేకులపల్లి మండల కేంద్ర గ్రామ పంచాయితీ కార్యాలయంలో టేకులపల్లి, గోలీయాతండా గ్రామ పంచాయితీ సంయుక్తంగా నిర్వహిస్తున్న సంతను 40వారాలకు వేలం పాట కార్యక్రమం ఎంపీవో గణేష్ గాంధీ ఆధ్వర్యంలో ఉదయం 11.30గంటలకు ప్రారంభించారు. తొలుత ఉదయం 10.30గంటలలోపు 50 వేల రూపాయలు డిపాజిట్ చెల్లించి వేలం పాటలో పాల్గొనాలనే నిబంధన ప్రకారం ఐదుగురు మాత్రమే డిపాజిట్ చెల్లించి వేలం పాటలో పాల్గొన్నారు. రెండు గంటల పాటు సాగిన వేలంను టేకులపల్లి గ్రామ పంచాయితీ మూస్తోండా గ్రామానికి చెందిన మూడ్ వాసు 8 లక్షల 31 వేలకు వేలం పాడి సంత నిర్వహణ బాధ్యత చేజిక్కించుకున్నాడు. ఈ కార్యక్రమంలో ఎంపీవో గణేష్ గాంధీ,స్థానిక ఎంపీటీసీ జాలది అప్పారావు, గ్రామస్తులు ఇస్లావత్ రెడ్డి, భానుచందర్, భూక్య లాలునాయక్, దారవత్ బాలాజీ, భూక్య ఈరు.కప, బోడ మంగీలాల్, రవికుమార్తదితరులు పాల్గొన్నారు.

## గందంపల్లి శ్రీ గాయత్రీ టెక్నో స్కూల్ తనిఖీ చేసిన ఎమ్ఈఓ



బయ్యారం)/జూన్ 28 (గౌతమ్ న్యూస్): బయ్యారం మండలంలోని కొత్తపేట గ్రామపంచాయితీ పరిధిలో గంధంపల్లిలో గల శ్రీ గాయత్రీ టెక్నో(ది ఇంగ్లీష్ మోడల్) స్కూల్ ను మండల విద్యాధికారి బి.పూల్ చంద్ శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాల అనుమతి,విద్యార్థుల ప్రవేశాలు,పాఠశాల మౌళిక వసతులు,బోధన సిబ్బంది,పలు రికార్డులను పరిశీలించారు. అనంతరం ఎమ్ఈఓ మాట్లాడుతూ గత మూడు సంవత్సరాల నుండి పాఠశాల రన్నింగ్ లో లేని కారణంగా మరలా ఈ విద్యా సంవ్సరం నుండి పాఠశాల పునఃప్రారంబించిన సందర్భంగా పాఠశాలను తనిఖీ చేయాల్సి వచ్చిందని వారు తెలిపారు.

## ఏఐటియుసి సీనియర్ నాయకుడు,దళిత సంఘాల నేత మాతాంగి లింగయ్య ను పరామర్శించిన

### మాదిగ సంక్షేమ సంఘం జిల్లా నాయకత్వం.



భద్రాద్రి కొత్తగూడెం ఆర్సి/జూన్ 28 (గౌతమ్ న్యూస్): కొత్తగూడెం : భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కొత్తగూడెం పట్టణానికి చెందిన సింగరేణి ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ నాయకుడు,ఏఐటియుసి, దళిత సంఘాల సీనియర్ నాయకుడు మాతంగి లింగయ్య కాలుకు ఫ్రాక్చర్ కావడంతో ఆయనను పరామర్శించి ఆరోగ్య పరిస్థితినీ అడిగి తెలుసుకున్న రామవరం మాదిగ సంక్షేమ సంఘం జిల్లా న్యాయకత్వం. ఈ కార్యక్రమంలో మాదిగ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులు కొయ్యాడ వెంకన్న, జిల్లా ప్రధాన కార్యదర్శి సామర్ల సమ్మయ్య, జిల్లా నాయకులు బరిగెల భూపేష్, ఇండిగ పల్లి శంకర్, కొత్తూరి మల్లయ్య, ఇల్లందుల దుర్గయ్య, జంగం కృష్ణ, మాటేటి అంజయ్య, ఇల్లందుల పోచయ్య, చెరిపల్లి కోటేశ్వరరావు, మద్దికుంట గణేష్ తదితరులు పాల్గొన్నారు.

## మాజీ ప్రధాని పివి నరసింహారావు జయంతి వేడుకలు




నాగర్కర్నూల్ వనపర్తి బ్యూరో/జూన్ 28 (గౌతమ్ న్యూస్): వనపర్తి జిల్లా కేంద్రంలో ఎమ్మెల్యే తూడి మేఘా రెడ్డి ఆధ్వర్యంలో వనపర్తి పట్టణంలో ఎమ్మెల్యే క్యాంప్ ఆఫీస్ లో భారతరత్న మాజీ ప్రధాని పీవీ నరసింహారావు గారి 103 వ జయంతి వేడుకలు ఘనంగా వైభవంగా జరుపుకున్నారు, ఎమ్మెల్యే మేఘా రెడ్డి కాంగ్రెస్ పార్టీ శ్రేణులు కలిసి పీవీ నరసింహారావు చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళు లర్పించడం జరిగింది భారత దేశం తొలి తెలుగు ప్రధాని, బహుభాషా కోవిదుడు, ఆర్థిక సంస్కరణల ఆద్యుడు, పీవీ నరసింహారావు భారతీయ న్యాయవాది రాజకీయవేత తెలంగాణ ముద్దు బిడ్డ. పీవీ నరసింహా రావు అలాంటి గొప్ప నాయకుడి జయంతి జరుపుకోవడం ఎంతో గర్వకారణం ఆ మహానీయుడికి జయంతి సందర్భంగా ఆ మహనీయునికి ఘనంగా నివాళులు నివాళులర్పించడం జరిగింది ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు కాంగ్రెస్ పార్టీ అభిమానులు తదితరులు పాల్గొన్నారు,

## 'నీట్'పై ప్రభుత్వంతో చర్చకు రెడీ: రాహుల్ గాంధీ

ఢిల్లీ: లోక్సభలో ప్రతిపక్షనేత రాహుల్ గాంధీ విద్యార్థులను ఉద్దేశించి వీడియో విడుదల చేశారు. నీట్ పరీక్షలో జరిగిన అక్రమాలపై మోదీ ప్రభుత్వంతో చర్చలు జరపడమే ఇండియా కూటమి లక్ష్యమని స్పష్టం చేశారు. శుక్రవారం(జూన్28) లోక్సభలో నీట్ అంశం మాట్లాడుతుండగా తన మైక్ కట్ చేశారని మండిపడ్డారు. నీట్ పేపర్ లీక్ గురించి అందరికీ తెలుసన్నారు. విద్యార్థులకు నష్టం కలిగించి, కొందరు మాత్రం వేల కోట్ల రూపాయలు సంపాదించారని ఆరోపించారు. ప్రవేశ పరీక్షల కోసం విద్యార్థులు ఎన్నో ఏళ్లుగా చదువుతుంటారని గుర్తు చేశారు. పవిత్రమైన వైద్య వృత్తిని చేపట్టడం వారి కల అని పేర్కొన్నారు. ఇప్పటికే ప్రతిపక్షాల సమావేశంలో ఈ విషయంపై చర్చించినట్లు తెలిపారు. విద్యార్థుల తరఫున పోరాడాలని నిర్ణయించామన్నారు. ఏడేళ్లలో 70సార్లు పలు పరీక్షల ప్రశ్న పేపర్లు లీక్ అయ్యాయని, లీకుల కారణంగా రెండు కోట్ల మంది విద్యార్థులు సమస్యలు ఎదుర్కొన్నారని రాహుల్ విమర్శించారు. దీనికి పరిష్కారం చూపాలని విద్యార్థులు ప్రధాని మోదీని కోరుతున్నా ఆయన మౌనం వీడట్లేదన్నారు.

## ప్రభుత్వ సామాజిక ఆసుపత్రిని పరిశీలించిన జాతీయ ఆరోగ్య మిషన్ బృందం



ఏటూరునాగారం/జూన్ 28 (గౌతమ్ న్యూస్): ములుగు జిల్లా స్టాపర్: ఈరోజు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయము ములుగు, సమావేశ మందిరంలో, ములుగు జిల్లా మరియు జయశంకర్ భూపాలపల్లి జిల్లాలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారులకు మరియు మిడ్ లెవెల్ హెల్త్ ప్రొవైడర్స్ కి డాక్టర్ అప్పయ్య జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి ఆధ్వర్యంలో సమావేశము నిర్వహించడం జరిగింది. ఈ సమావేశంలో ,డాక్టర్ అనురాధ మెడోజు, సీనియర్ రీజినల్ డైరెక్టర్ తెలంగాణ ,నేషనల్ హెల్త్ మిషన్ నుండి అమలవుతున్న జాతీయ ఆరోగ్య కార్యక్రమాలు వాటిని అమలుపరచు దానిని గూర్చి వైద్యాధికారులకు పలు సూచనలు సలహాలు ఇవ్వడం జరిగింది. ప్రతి ఆరోగ్య కార్యక్రమంలో ఆశా కార్యకర్తలు కీలక పాత్ర పోషించాల్సి ఉంటుందని తెలిపారు. వైద్యాధికారి ప్రతి ఆరోగ్య కార్యక్రమానికి ఒక మార్గదర్శగ ఒక మంచి అడ్మినిస్ట్రేటర్ గా ఉండాల్సి ఉంటుందని తెలిపారు. వైద్యాధికారి రోగులతో త్యాగనిరతితో సేవలందిస్తూ వారి బాధలను అర్థం చేసుకోవాల్సి ఉంటుందని తెలిపారు. రోగులకు బాధ్యతాయుతంగా కమిట్మెంట్తో ,మానవతా దృక్పథంతో సేవలందించాల్సి ఉంటుందని తెలిపారు. దేవుని తర్వాత ప్రజలు కొలిచేది డాక్టర్ని అని తెలిపారు . వైద్యులుగా సేవలందించడం ఒక బాధ్యతగా ,గర్వకారణంగా కూడా ఫీల్



అవ్వాలని తెలిపారు. వైద్యాధికారులకు ప్రతిరోజు రోగులచే, ఛాలెంజింగ్ గా ఉంటుందని వారికి సేవలందించాల్సి ఉంటుందని తెలిపారు. మనదేశంలో ఆరోగ్య కార్యక్రమాలపై భారత ప్రభుత్వం వారు ఒక మంచి వ్యవస్థను ఏర్పాటు చేయడం జరిగిందని ,దాని ద్వారానే మనము కోవిడ్ లాంటి అతి క్లిష్టమైన సమయంలో కూడా ప్రజలకు సేవలు అందించడం జరిగిందని, ప్రజల ప్రాణాలను కాపాడడం జరిగిందని కొనియాడారు. ప్రభుత్వం ద్వారా అందిస్తున్న సేవలను ,జిల్లా ఆసుపత్రి, ఏరియా హాస్పిటల్, సామాజిక ఆరోగ్య కేంద్రము, ప్రాథమిక ఆరోగ్య కేంద్రము, ఆయుష్మాన్ ఆరోగ్య మంది ర యొక్క సేవలు వినియోగించుకునే విధంగా సేవలు అందించాలని విజ్ఞప్తి చేశారు. వైద్యాధికారులు సమయపాలన పాటించాలని తెలిపారు. ప్రతి జాతీయ ఆరోగ్య కార్యక్రమాలపై అవగాహన కలిగి ఉండాలని , వాటికి సంబంధించిన ప్రోటోకాల్ పాటించాలని తెలిపారు. ములుగు జిల్లాలో మాతృ మరణాల సంఖ్య తగ్గించినందుకు వైద్య సిబ్బందిని కొనియాడారు. 2018 వ సంవత్సరంలో మిడ్ లెవెల్ హెల్త్ ప్రొవైడర్స్ గురించి భారత ప్రభుత్వము నిర్ణయం తీసుకుందని , అప్పటినుండి MLHP ల ను నియామకం జరుపుతూ వారి ద్వారా ప్రజలకు సేవలు అందించడం జరుగుతుందని తెలిపారు. వీరు ముఖ్యంగా నాలుగు సూత్రాలను పాటించాలని, ఆరోగ్యం పై అవగాహన కల్పించాలని, త్వరితగతిన రోగనిర్ధారణ పరీక్షలు జరిపి చికిత్సలు అందజేయాలని, సంక్షేమం కోసము యోగా, మెడిటేషన్ లాంటివి సేవలు కల్పించాలని , క్లిష్టతరమైన కేసులను హయ్యర్ హాస్పిటల్ కి పంపించాలని, ఇవి పాటించాలని ఆదేశించారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ అప్పయ్య మాట్లాడుతూ జిల్లాలో జాతీయ ఆరోగ్య కార్యక్రమాలు అమలుపరిచేందుకు వైద్యాధికారులు, మిడ్ లెవెల్ హెల్త్ ప్రొవైడర్స్ , వైద్య సిబ్బంది అందరూ తమ వంతుగా కృషి చేయాలని, జిల్లాను ముందు వరసలో ఉంచాలని, త్యాగనిరతితో పని చేయాలని విజ్ఞప్తి చేశారు. జయశంకర్ భూపాలపల్లి జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ చల్లా మధుసూదన్ మాట్లాడుతూ గత రెండు రోజుల నుండి అనురాధ మెడోజీ డాక్టర్ ఇచ్చిన సలహాలు సూచనలు తప్పక జిల్లా లో అమలు పరుస్తామని ,రాబోవు రోజులలో జిల్లాలో మరింతగా సేవలు పెంపొందిస్తామని ,జాతీయ ఆరోగ్య కార్యక్రమాలు అమలులో జిల్లాలో ప్రగతి పథంలోకి తీసుకెళ్తామని తెలిపారు. ఈ యొక్క కార్యక్రమంలో ప్రోగ్రాం ఆఫీసర్లు డాక్టర్ రవీందర్, డాక్టర్ పవన్ ,డాక్టర్ శ్రీకాంత్, డాక్టర్ రణధీర్, డెమో తిరుపతయ్య ములుగు జిల్లా మరియు భూపాలపల్లి జిల్లా నుండి వైద్యాధికారులు మిడ్ లెవెల్ హెల్త్ ప్రొవైడర్స్ హాజరైనారు.

# చెంచు మహిళపై దాడి అమానుషం



నాగర్కర్నూలు జిల్లా కొల్లాపూర్ మండలం మొలచింతపల్లి గ్రామంలో చెంచు మహిళ ఈశ్వరమ్మపై అత్యాచారం, అత్యంత పాశవికంగా దాడి జరిగింది. జూన్ 21న చైతన్య మహిళా సంఘం సభ్యులు బాధితురాలిని పరామర్శించడానికి వెళ్లినపుడు బాధితులు అనేక విషయాలు తెలిపారు. ఇది కేవలం ఒక మహిళపై జరిగిన హింసగా మాత్రమే కనబడుతున్నది. కానీ కొల్లాపూర్ చుట్టూ ఉన్న నల్లమల అడవిలో 16 చెంచు పెంటలను ప్రభుత్వం పోలీసుల సాయంతో ఖాళీ చేయించింది. మొలచింతలపల్లి గ్రామంలో భ్రమరాంబిక కాలనీ ఏర్పరచి అక్కడ వీరిని వదిలిపెట్టారు. వారికి అక్కడ ఎలాంటి ఆశ్రయం కల్పించలేదు. పోడుభూముల్లో వ్యవసాయం చేసుకుంటూ, ఆహారాన్ని సేకరించుకుంటూ జీవనం గడిపే వీరికి భూమి లేక, ఆహారాన్ని సేకరించుకునే తోవలేక అత్యంత దయనీయ పరిస్థితుల్లో వారు జీవనాన్ని గడుపుతున్నారు. ఉండటానికి ఇల్లు, బతకడానికి సరైన ఉపాధి లేవు. అంతేకాక సరైన వైద్యం, పిల్లలకి చదువుకోడానికి సరైన పాఠశాల సౌకర్యాలు కూడా లేవు. వీరిని అడవి నుంచి గ్రామానికి తరలించడంతో వారి జీవన విధానంలో ఒక్కసారిగా వచ్చిన మార్పులను వారు తట్టుకోలేకపోయారు. ప్రభుత్వం 14 ఎకరాలు భూమిని ఒక రెడ్డి దగ్గర కొని, ఎలాంటి పట్టాలు లేకుండా, దానిని సాగు చేసుకోవాలని చెంచులకు ఇచ్చింది. అందులోనే వారు కొన్ని గుడిసెలు వేసుకున్నారు. కొన్నాళ్లకు ప్రభుత్వానికి అమ్మిన భూమిని మళ్ళీ ఆయనే ఆక్రమించి, గుడిసెలు వరకు వదిలేసి మొత్తం భూమిని దున్నుకోవడం మొదలు పెట్టాడు. కనీసం కాలి బాటకు తొవ్వ కూడా ఇవ్వలేదు. చేతిలో పట్టాలు గానీ, ప్రభుత్వం చెంచులకు ఇచ్చినట్లు ఆధారాలు గానీ లేక నిస్సహాయతతో పడుతున్న బాధలను చెప్పుకోలేని పరిస్థితిలో వారంతా మద్యానికి బానిసలయ్యారు. ఉపాధి లేక చుట్టుపక్కల కాంట్రాక్టర్ల దగ్గర, తోటల్లో కాపలాకి పనికి కుదిరి వెట్టిచాకిరి చేస్తున్నారు. తిండి, వైద్యం లేక మద్యానికి బానిసలై సుమారు 100 మంది చెంచులు మరణించారు. చాలామంది మహిళలు అత్యాచారాలకు గురయ్యారు. ఈ పరిస్థితుల్లో వెంకటేష్, శివుడు అనే ఇసుక కాంట్రాక్టర్ల ట్రాక్టర్లలో ఇసుక వేయడానికి ఈశ్వరమ్మ చిన్న మామ నాగయ్య పనికి కుదిరాడు. నాగయ్యకి నెలకు 5000 రూపాయలు ఇచ్చేవారు. అంటే రోజుకి 150 రూపాయల కూలి. ఇది సరిపోవడం లేదని మరికొంత కూలి పెంచాలని నాగయ్య భార్య అంజమ్మ కోరింది. దానికి కోపంతో ఊగిపోయిన వెంకటేశు, శివుడు ఆమెను అందరి ముందు బాగా కొట్టారు. తన కళ్ళముందే భార్యను కొట్టడాన్ని చూసిన నాగయ్య వారిపై తిరగబడ్డాడు. చివరికి పని మానేసి చేపల వేటకు వెళ్లేవాడు. అలా వెళ్లిన నాగయ్య నాలుగవ రోజే ఒళ్లంతా గాయాలతో మరణించాడు. ఇది హత్య అని, చేసింది వెంకటేశు, శివుడు అని ఊరందరికీ తెలుసు. అయినా డబ్బు, అధికారం బలం కలిగిన వారు చెంచులకు మాయమాటలు చెప్పి, బెదిరించి త్వరగా అంత్యక్రియలు పూర్తయ్యేటట్లు చేశారు. ఈశ్వరమ్మ, ఈదన్నలు కూడా వెంకటేష్, శివుడు దగ్గర పొలంలో కూలీలుగా పని చేసేవారు. వీరికి రోజుకి 200 రూపాయలు ఇచ్చేవారు. అంటే మనిషికి 100 రూపాయలు. ఈశ్వరమ్మ కుటుంబం అవసరాల నిమిత్తం 20వేల రూపాయలు వెంకటేష్ దగ్గర అప్పు తీసుకున్నది. ఈ డబ్బులు ఇచ్చేటప్పుడు మధ్యవర్తిగా ఈశ్వరమ్మ అక్క ఉన్నది. ఇచ్చే కూలి డబ్బులు సరిపోవటం లేదని, తన ముగ్గురు పిల్లల పోషణ చాలా కష్టం అవుతోందని, కూలి పెంచాలని వెంకటేష్ను ఈశ్వరమ్మ నిలదీస్తుండేది. ఇదే విషయంపై భర్తతో కూడా కొట్లాడేది. కూలి పెంచితేనే పని చేస్తానని లేదా కూలి ఎక్కువ ఇచ్చిన చోటనే పని చేస్తానని చెప్పి, వాళ్ళ అమ్మగారి ఇంటికి వెళ్లింది. తీసుకున్న 20 వేల రూపాయలు అప్పు చెల్లించకపోగా, పని మాని వెళ్లిపోయినందుకు ఈశ్వరమ్మ అక్కను వెంకటేశు, శివుడు ఇద్దరు కలిసి వెంటనే డబ్బులు కట్టాలని కొట్టారు. అంతేకాకుండా ఈశ్వరమ్మ ఎక్కడ ఉన్నా తీసుకురావాలని కుటుంబ సభ్యులపై వత్తిడి పెట్టారు. తల్లి గారి ఇంటికి వెళ్లిన ఈశ్వరమ్మను మంచి మాటలు చెప్పి తీసుకువచ్చి, ఆమెపై అత్యాచారం చేసి, పది రోజులు ఇంట్లో బంధించి ఇష్టం వచ్చిన రీతిలో కొట్టారు. ఆమె ప్రైవేటు భాగంలో పెట్రోల్లో ముంచిన గుడ్డ పెట్టి నిప్పు పెట్టారు. కుటుంబ సభ్యుల చేత కూడా కొట్టించారు. పురుషాధిక్యత గల సమాజంలో మహిళను సొంత ఆస్తిగా భావించే భూస్వామ్య భావజాలంలో మహిళే మొదట టార్గెట్ అవుతుంది. ఇది ఒక కుటుంబ సమస్యగా కనబడుతున్నా, దీని వెనుక అనేక చెంచు కుటుంబాల విధ్వంసం ఉంది. మనిషి తమకు ఇష్టం వచ్చినట్లు బతికే హక్కులను కోల్పోయేటట్లు చేసే నిర్లక్ష్యం కనబడుతుంది. మావోయిస్టులకు ఆశ్రయం కల్పిస్తున్నారని, వారికి అన్నం పెడుతున్నారని చెప్పి చెంచు పెంటలను ఖాళీ చేయించిన ప్రభుత్వం... ఉపాధి, భూమి, చదువు, ఆరోగ్యం, భద్రత లేకుండా చెంచుల మరణాలకు కారణమయింది. మావోయిస్టుల పేరు చెప్పి ఒక పథకం ప్రకారం అడవుల నుంచి చెంచులను ప్రభుత్వాలు ఖాళీ చేయిస్తున్నాయి. అటు కేంద్రంలో, ఇటు రాష్ట్రంలో అడవులకు సంరక్షణగా వుండే ఆదివాసీలను, చెంచులనూ ఖాళీ చేయించి భూమిని, ఖనిజ సంపదను దోచుకోవడంలో భాగమే ఈ సంఘటన. 1. అత్యాచారానికి, హింసకు గురి అయిన ఈశ్వరమ్మకు వెంటనే ప్రభుత్వం ఆర్థికంగా ఆదుకోవడమే కాకుండా ఆమెకు, భూమి ఇల్లు ఇవ్వాలి. 2. భ్రమరాంబ కాలనీలో ఉన్న చెంచు కుటుంబాలని తక్షణమే వారి చెంచు పెంటలకు చేర్చాలి. 3. చెంచు పెంటలో మూసుకున్న పాఠశాలను తెరిపించి, పిల్లలందరికీ అక్కడ విద్యతో పాటు అన్ని సౌకర్యాలు కల్పించాలి. 4.చెంచులు పోడు భూములు దున్నుకునే విధంగా వారికి హక్కు కల్పించాలి. 5. ప్రతి ఒక్కరికీ వైద్య పరీక్షలు చేసి వారికి తక్షణమే పోషక ఆహారాన్ని అందించాలి. 6. ఒక్కో కుటుంబానికి 15 లక్షలు పరిహారంగా ఇవ్వాలి. 7. ప్రధాన నిందితుడు శివుడును అరెస్ట్ చేయాలి. 8. అరెస్ట్ చేసిన చెంచులను విడుదల చేయాలి. ఇవన్నీ చేసిన రోజే ఈశ్వరమ్మకు న్యాయం జరిగినట్లు. దీనికి వెంకటేష్, శివయ్య మాత్రమే నేరస్తులు కారు. మనుషులు జీవించే హక్కును హరించడం కూడా నేరమేనని చైతన్య మహిళా సంఘం భావిస్తున్నది. ప్రజాసంఘాల ఒత్తిడి మేరకు నాగన్న శవాన్ని బయటకు తీసి జూన్ 26న పోస్టుమార్టం నిర్వహించారు. నాగన్న మరణానికి కారణమైన వారిని కూడా అరెస్ట్ చేయాలి. మిగిలిన అన్ని డిమాండ్లపై పౌర సమాజం కదలాలని, చెంచు ప్రజలపై జరుగుతున్న విధ్వంసాన్ని గుర్తించి, వారికి న్యాయం జరిగే వరకూ మాట్లాడాలని చైతన్య మహిళా సంఘం ప్రజలను, ప్రజా సంఘాలను పార్టీలను కోరుతున్నది.

## సీఎం చంద్రబాబుకు ఇంకా సమయం ఇవ్వాలి



ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు ఇంకా సమయం ఇవ్వాలి అన్నారు ఏపీ వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్.. నిరంతరం 20 గంటలు కష్టపడే నాయకత్వం కేంద్రం, రాష్ట్రంలో ఉందన్న ఆయన.. ఏపీ మరల అభివృద్ధికి చిరునామాగా మారిపోతుంది త్వరలో అనే నమ్మకాన్ని వ్యక్తం చేశారు.. ఎమర్జెన్సీ నాటి యదార్థ సంఘటనలపై బీజేపీ నిర్వహించిన సదస్సులో ఆయన మాట్లాడుతూ.. ఆర్టికల్ 39, ఆర్టికల్ 42లు అత్యంత దారుణం అన్నారు.. సావరిన్ సెక్యులర్ రిపబ్లిక్ అని ప్రియాంబుల్ ను మార్చారు కాంగ్రెస్ వారు ఇవాళ రాజ్యాంగం మారుస్తారంటూ దారుణంగా మాట్లాడుతున్నారు. సుద్దపూసల్లాగా వాళ్ళంతా మోడీపై వ్యాఖ్యలు చేస్తున్నారు.. గత ఐదు సంవత్సరాల పాటు రాష్ట్రంలో అప్రకటిత ఎమర్జెన్సీ కొనసాగింది. ప్రజలకు రావాల్సిన సౌలభ్యాలు అడ్డుకోవచ్చని, ప్రజాధనాన్ని విచ్చలవిడిగా దోచుకోవచ్చని ఒక వ్యక్తి నిరూపించాడు.. ఆనాడు ఇందిరాగాంధీని గద్దె దించినట్టుగా ఓటు ద్వారా మే 13న ఈ రాష్ట్రంలో ఒక ఓ(వే)టు వేశారని వ్యాఖ్యానించారు. ఇక, ఆర్టికల్ 356 విధించి కుటుంబ పాలన కొనసాగించింది కాంగ్రెస్.. కానీ, వారసత్వ రాజకీయాలను బీజేపీ ప్రోత్సహించదు అన్నారు సత్యకుమార్.. విద్యార్థి దశ నుంచి పని చేస్తూ ఉన్న వారు ప్రజలచే ఎన్నుకోబడ్డారు.. వసుంధర రాజే, రాజ్నాథ్ సింగ్ ల వారసులు రాజకీయాల్లోకి రాలేదే..? అని ప్రశ్నించారు. ఎన్నో త్యాగాలు చేసిన రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ కారణంగా అవకాశాలు ఇవాళ వచ్చాయన్నారు. ఆరు లక్షల మందికి రాజశేఖరరెడ్డి కాలంలో బలవంతపు కుటుంబ నియంత్రణ చేసారు.. పురోగమన ఆంధ్రప్రదేశ్ కాస్తా తిరోగమనంలోకి వెళ్ళి.. అవినీతి ఆంధ్రప్రదేశ్ గా మారిపోయింది అని మండిపడ్డారు. తప్పు చేసిన వారు ఎవరైనా రాజకీయ బహిష్కరణ విధించాలి.. రాజకీయ భవిష్యత్తు లేకుండా సమాధి చేయాలని పిలుపునిచ్చారు.. ఆరోగ్యశాఖ లోనే 6వేల కోట్ల బకాయిలు గత ప్రభుత్వానివి ఉన్నాయి.. నేషనల్ హెల్త్ మిషన్, ఎన్ఆర్ఈజీఎస్, ఆయుష్మాన్ భారత్ నిధులు మళ్లించారని విమర్శించారు ఏపీ వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్.

## రుణమాఫీకి నాలుగు రోజుల్లో మార్గదర్శకాలు



ఢిల్లీ: రుణమాఫీకి నాలుగు రోజుల్లో మార్గదర్శకాలు విడుదల చేస్తామని సీఎం రేవంత్రెడ్డి అన్నారు. ఇందుకు రేషన్ కార్డు ప్రామాణికం కాదని స్పష్టం చేశారు. రూ.2లక్షల వరకు మాత్రమే రుణమాఫీ చేస్తామన్నారు. ఢిల్లీలో ఆయన మీడియాతో మాట్లాడుతూ.. 'రైతు రుణమాఫీ తర్వాత రైతుబంధు ఇతర పథకాలపై దృష్టి పెడతాం. కేంద్ర బడ్జెట్ ప్రవేశ పెట్టిన రెండు రోజుల తర్వాత తెలంగాణ బడ్జెట్ సమావేశాలుంటాయి. తెలంగాణ బడ్జెట్ వాస్తవ అంచనాలకు అనుగుణంగా ఉండాలని అధికారులకు చెప్పాం. అంచనాలకు మించి ఊహాజనిత లెక్కలతో బడ్జెట్ ఉండకూడదని అధికారులను ఆదేశాలు ఇచ్చాం. మండలాలు రెవెన్యూ డివిజన్ విషయంపై అసెంబ్లీలో చర్చించి కమిషన్ ఏర్పాటు చేస్తాం. కాళేశ్వరం సంబంధించిన వాస్తవాలను కూడా అసెంబ్లీ ముందుకు తెస్తాం. చర్చల తర్వాత డ్యాం సేఫ్టీ అథారిటీ నివేదిక, నిపుణుల సూచన మేరకు ముందుకు వెళ్తాం" అన్నారు.

లాభాల్లో ఆర్టీసీ..

మహిళలకు ఉచిత బస్సు పథకం వల్ల రెవెన్యూ పెరిగింది. ఆర్టీసీకి ప్రతి నెలా రూ.350 కోట్లకు పైగా ప్రభుత్వం చెల్లిస్తోంది. 30శాతం నుంచి ఆక్యుపెన్సీ రేషియో 80 శాతానికి పెరిగింది. తద్వారా ఆర్టీసీకి నిర్వహణ నష్టాలు తగ్గాయి. గత అప్పులతో సంబంధం లేకుండా చుస్తే కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక లాభాలతో ఆర్టీసీ నడుస్తోంది. రాష్ట్ర ఖజానాకు ఆర్థిక భారం ఉన్నా సరే.. సంక్షేమానికి ప్రాధాన్యత ఇస్తున్నాం. బీసీ కమిషన్ పదవీకాలం ఆగస్టుతో పూర్తవుతుంది. కొత్త వారిని నియమించిన తరువాత కుల గణన చేస్తాం.

రుణభారం తగ్గించుకునే పనిలో ఉన్నాం

రాష్ట్రం రూ.7లక్షల కోట్ల అప్పుల్లో ఉంది. ప్రతి నెల రూ. 7వేల కోట్ల అప్పులు కడుతున్నాం. రాష్ట్రం విడిపోయినప్పుడు నెలకు రూ. 6,500 కోట్లు కట్టేవారు. గత ప్రభుత్వం 7 నుంచి 11 శాతం వడ్డీతో రుణాలు తెచ్చారు. రుణభారం తగ్గేలా రుణాల వడ్డీని తగ్గించుకునే పనిలో ఉన్నాం. ఒక్కశాతం తగ్గినా రూ. 700 కోట్లు ఆదా అవుతాయి. ఈ మేరకు కేంద్రంతో సంప్రదింపులు చేస్తున్నాం. బడ్జెట్కు ముందే రాష్ట్రానికి కావాల్సిన అంశాలను కేంద్రం దృష్టిలో ఉంచి ఎక్కువ నిధులు పొందే ప్రయత్నం చేస్తున్నాం. అన్ని శాఖలకు సంబంధించిన రాష్ట్ర మంత్రులు.. కేంద్రమంత్రులను ఇప్పటికే ఒకసారి కలిశారు" అని సీఎం రేవంత్రెడ్డి తెలిపారు.

## న్యూజిలాండ్ వీసా రూల్స్‌లో మార్పులు



న్యూజిలాండ్ వీసా రూల్స్‌లో మార్పులు చోటు చేసుకున్నాయి. తమ దేశంలో కొన్ని పాత్రల్లో పనిచేస్తున్న విదేశీయులు తమ ద్వారా తమవారికి వర్క్, విజిటర్, స్టూడెంట్ వీసాలకు స్పాన్సర్ చేయడానికి అనుమతించని కొత్త ఇమ్మిగ్రేషన్ నిబంధనలను న్యూజిలాండ్ ప్రకటించింది. వీసా స్పాన్సర్లు న్యూజిలాండ్ ఆర్థిక, ఇమ్మిగ్రేషన్ ప్రాధాన్యతలకు అనుగుణంగా నిర్దిష్ట ప్రమాణాలను చేరుకునేలా వీసా ప్రక్రియలను క్రమబద్ధీకరించడమే ఈ నిబంధనల లక్ష్యం. వీటి ప్రకారం జూన్ 26 నుంచి ఆస్ట్రేలియన్, న్యూజిలాండ్ స్టాండర్డ్ క్లాసిఫికేషన్ ఆఫ్ ఆక్యుపేషన్స్ లెవల్స్ 4, 5 లో రెసిడెన్సీ పాత్‌వేస్ (వివిధ రంగాల్లో నైపుణ్యాలు) లేకుండా అక్రిడేటెడ్ ఎంప్లాయర్ వర్క్ వీసా ఉన్నవారు ఇకపై తమ భాగస్వాములు, పిల్లల కోసం వర్క్, విజిట్, స్టూడెంట్ వీసా దరఖాస్తులకు మద్దతు ఇవ్వలేరు. ఈ సంవత్సరం ప్రారంభంలో ఏఈడబ్ల్యూవీ పథకానికి చేసిన విస్తృత సవరణలకు అనుగుణంగా ఈ సర్దుబాటు ఉంటుంది. అయితే భాగస్వాములు, పిల్లలు సంబంధిత ప్రమాణాలకు అనుగుణంగా ఉంటే ఎక్రిడేటర్ ఎంప్లాయర్ వర్క్ వీసా లేదా అంతర్జాతీయ స్టూడెంట్ వీసా వంటి వాటి కోసం సొంతంగా దరఖాస్తు చేసుకోవచ్చు. ఇప్పటికే భాగస్వాములుగా లేదా డిపెండెంట్ పిల్లలుగా వీసాలను కలిగి ఉన్నవారిపై ఈ మార్పుతో ప్రభావం ఉండదని న్యూజిలాండ్ ప్రభుత్వం స్పష్టం చేసింది.

## సభలో విపక్ష సభ్యుల తీరు ఆమోదయోగ్యం కాదు




నీట్ రగడ పార్లమెంట్ ఉభయసభలనూ కుదిపివేసింది. నీట్ ప్రశ్నాపత్రం లీకేజ్, పరీక్ష నిర్వహణ లోటుపాట్లపై చర్చకు విపక్షాలు పట్టుబట్టడంతో లోక్‌సభలో గందరగోళం నెలకొనడంతో సభ జులై 1కి వాయిదా పడింది. రాజ్యసభలోనూ నీట్ ప్రకంపనలతో సభా కార్యకలాపాలు స్తంభించాయి. విపక్షాల తీరును బీజేపీ ఎంపీ, బాలీవుడ్ క్వీన్ కంగనా రనౌత్ తప్పుపట్టారు. సభలో ప్రతిపక్ష సభ్యుల తీరు సరైంది కాదని దుయ్యబట్టారు. స్పీకర్ పలుమార్లు సంయమనంతో వ్యవహరించాలని పదేపదే కోరినా విపక్ష సభ్యులు పెడచెవిన పెట్టారని, విపక్షం ఎవరి మాటా వినిపించుకనే పరిస్థితిలో లేదని ఆందోళన వ్యక్తం చేశారు. తాము సభలో తొలిసారిగా అడుగుపెట్టమని, విపక్షాల రగడ చూసి తాము విస్తుపోయామని అన్నారు. ఏ ఒక్కరినీ మాట్లాడేందుకు వారు అనుమతించకపోవడం సరైంది కాదని చెప్పారు. రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాద తీర్మానంపై చర్చను విస్మరించి విపక్షాలు సభలో రచ్చ చేయడం విడ్డూరమని కంగనా రనౌత్ వ్యాఖ్యానించారు.సభలో విపక్ష సభ్యుల ప్రవర్తన ఏమాత్రం ఆమోదయోగ్యం కాదని పేర్కొన్నారు. కాగా, విపక్షాలు ఏ అంశం లేవనెత్తినా సమగ్ర సమాచారం ఇస్తామని తాము స్పష్టంగా చెప్పినా విపక్షాలు సభా కార్యకలాపాలకు అడ్డుపడటం విచారకరమని పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరణ్ రిజిజు అన్నారు. ప్రభుత్వం చర్చకు సిద్ధమని తాము సభ్యులకు మరోసారి హామీ ఇస్తున్నామని చెప్పారు. సభా కార్యకలపాలకు కాంగ్రెస్ సభ్యులు అడ్డుపడుతూ సభను సజావుగా జరగనివ్వకపోవడం సరైంది కాదని, దీన్ని తాను ఖండిస్తున్నానని కిరణ్ రిజిజు పేర్కొన్నారు. సభా కార్యకలాపాలకు అడ్డుతగలవద్దని ఆయా సభ్యులకు తాను విజ్ఞప్తి చేస్తున్నానని మంత్రి చెప్పారు. కాగా, నీట్ వ్యవహారంలో ప్రభుత్వ తీరును కాంగ్రెస్ ఎంపీ మనీష్ తివారీ తప్పుపట్టారు.

## ఢిల్లీకి చేరుకున్న నైరుతీ..
## పలు ప్రాంతాల్లో భారీ వర్షాలు.. ఐఎండీ ప్రకటన



న్యూఢిల్లీ: నైరుతీ రుతపవనాలు ఢిల్లీకి చేరుకున్నట్లు ఇవాళ భారతీయ వాతావరణ శాఖ పేర్కొన్నది. తీవ్రమైన ఎండ, వడగాలులకు బ్రేక్ చెబుతూ.. వర్షాకాలం వచ్చినట్లు ఢిల్లీలోని ఐఎండీ ఆఫీసు ప్రకటించింది. దీనిపై ఇవాళ ఐఎండీ అధికారిక ప్రకటన చేసింది. యావత్ ఢిల్లీ ప్రాంతాన్ని నైరుతీ రుతుపవనాలు చేరుకున్నట్లు ఐఎండీ తెలిపింది. జైసల్మేర్, చురు, భివాని, ఢిల్లీ, అలీఘడ్, కాన్పూర్, ఘాజిపూర్, గోండా, ఖేరి, మొరాదాబాద్, డెహ్రాడూన్, ఉనా, పఠాన్‌కోట్, జమ్మూ ప్రాంతాలకు నైరుతి చేరుకున్నట్లు ఐఎండీ వెల్లడించింది. శుక్రవారం తెల్లవారుజామున దేశ రాజధాని ఢిల్లీలోని పలు ప్రాంతాల్లో తొలి వర్షం కురిసినట్లు ఐఎండీ తెలిపింది. దీంతో పలు ప్రదేశాల్లో నీరు జామైంది. ట్రాఫిక్ జామ్‌లు కూడా ఏర్పడ్డాయి. సఫ్దార్‌జంగ్ వెదర్ స్టేషన్ లో 153.7 ఎంఎం వర్షపాతం నమోదు అయ్యింది. గత ఏడాది జూన్ 26వ తేదీన ఢిల్లీలోకి వర్షాకాలం ఎంటరైంది. 2021లో జూన్ 30వ తేదీన, 2020లో జూన్ 25వ తేదీన మాన్‌సూన్ ఎంట్రీ ఇచ్చింది. సఫ్దార్‌జంగ్ అబ్జర్వేటరీతో పాటు అన్నింటి అధిక స్థాయిలో వర్షం నమోదు అయినట్లు ఐఎండీ శాస్త్రవేత్త సోమా సేన్ తెలిపారు. ఉత్తరాదిలో భారీ వర్షాలు కురవనున్నట్లు ఆమె చెప్పారు. రాబోయే రెండు మూడు రోజుల్లో ఉత్తరాదిలో భీకర వర్షాలు ఉంటాయన్నారు. యూపీ, ఢిల్లీలో అధిక వర్షపాతం నమోదు కానున్నట్లు ఆమె వెల్లడించారు. రేపు, ఎల్లుండికి రెయిన్ వార్నింగ్ కూడా ఇచ్చినట్లు ఆమె చెప్పారు.

## పోలవరం పై సీఎం చంద్రబాబు శ్వేత పత్రం విడుదల



పోలవరం పై తాజాగా సీఎం చంద్రబాబు శ్వేత పత్రం విడుదల చేశారు. ఈ సందర్భంగా చంద్రబాబు మీడియాతో మాట్లాడుతూ 20 రోజుల్లో 7 అంశాలపై శ్వేత పత్రాలు విడుదల చేస్తామని తెలిపారు. పోలవరం రాష్ట్ర ప్రజల జీవనాడి అని పేర్కొన్నారు. సముద్రంలో వృథాగా కలిసి 3 వేల టీఎంసీల నీటిని ఒడిసిపట్టి కరవురహిత రాష్ట్రంగా మార్చే ప్రాజెక్టు పోలవరం అని తెలిపారు. బెల్టు స్థిరీకరణతోపాటు ఉత్తరాంధ్ర, రాయలసీమకు త్రాగునీరు, సాగునీరు అందించే బహుళార్థసాధక జాతీయ ప్రాజెక్టు. వరదల నివారణతోపాటు చౌకగా జలవిద్యుత్ అందించే ప్రాజెక్టు ఇది. 2014 రాష్ట్ర విభజన వల్ల రాష్ట్రానికి జరిగిన నష్టం కంటే 5 సంవత్సరాల జగన్ పాలన వల్ల ఎక్కువ నష్టం జరిగిందనే దానికి ఒక ఉదాహరణ పోలవరం విధ్వంసం అన్నారు చంద్రబాబు. 194 టీఎంసీల నీటి నిలువ. 322 టీఎంసీల నీటి సద్వినియోగం, 7.2 లక్షల ఎకరాలకు సాగునీరు, 23.50 లక్షల ఎకరాల ఆయకట్టు స్థిరీకరణ, 28.50 లక్షల జనాభా త్రాగునీరు, 960 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి, వాటర్ టూరిజం అంటూ స్పష్టం చేశారు. పోలవరం ప్రాజెక్ట్ పూర్తి చేసుకుంటే వ్యవసాయానికి చాలా ఉపయోగపడుతుందని తెలిపారు.

# యువతపై సోషల్ మీడియా ప్రభావం..



దేశంలో సోషల్ మీడియా వాడకం మన నిత్యజీవితంలో ఒక అవసరంగా ఏర్పడింది. ప్రపంచంలో ఏ మూలన ఏమి జరుగుతున్నా వివిధ అంశాలను, ముఖ్యంగా యువతను ఇది గణనీయంగా ప్రభావితం చేస్తోంది. ఈ ప్లాట్‌ఫారమ్‌లు మన కమ్యూనికేషన్, మన అభిప్రాయాన్ని వ్యక్తపరచడానికి, సమాచారాన్ని ప్రతీ ఒక్కరికీ తెలియజేసే అవకాశాలను పెంచుతున్నాయి. కానీ కొన్ని సందర్భాల్లో అవి మానసిక ఆరోగ్యానికి కూడా ప్రమాదాన్ని కలిగిస్తాయి. సోషల్ మీడియా భారతీయ యువతకు అనేక ప్రయోజనాలను అందిస్తున్నప్పటికీ, దాని ఉపయోగంలో ముఖ్యమైన ప్రతికూలతలు, సవాళ్లు కూడా ఉన్నాయి. సోషల్ మీడియాను రోజుకు 3 గంటలకన్నా ఎక్కువగా ఉపయోగించడం వల్ల ఆందోళన, డిప్రెషన్‌లకు దారితీయవచ్చు. ఇటీవల ఒక కథనం ప్రకారం 2024లో, భారతదేశంలో సోషల్ మీడియా వాడకం గణనీయంగా పెరిగిందని తెలిపింది. ప్రపంచవ్యాప్తంగా సోషల్ మీడియా వినియోగిస్తున్న వారిలో భారతదేశం వాటా 32.2% అంటే 46 కోట్ల మంది మనదేశంలో సోషల్ మీడియా వినియోగదారులున్నారు.

### సామాజిక అవగాహన కోసమైనప్పటికీ..

సోషల్ మీడియా సామాజిక, రాజకీయ, పర్యావరణ సమస్యలపై అవగాహన పెంచడానికి ఒక శక్తివంతమైన సాధనం. భారతీయ యువతలో ఇవి గణనీయమైన ఫాలోయింగ్ కలిగి ఉన్నాయి. ఈ



ప్లాట్‌ఫారమ్‌లు యువ వ్యాపారవేత్తలకు ఉత్పత్తులను, సేవలను విక్రయించడానికి మార్కెట్‌ను అందిస్తాయి. ఫ్రీలాన్సింగ్ ఎకానమీ, లింక్డ్‌ఇన్ వంటి సైట్‌లు, అప్‌వర్క్ వంటి ప్రత్యేక ప్లాట్‌ఫారమ్‌లు యువతకు ఫ్రీలాన్స్ వర్క్, పని చేసే అవకాశాలను కనుగొనడంలో సహాయపడతాయి. యూట్యూబ్, బ్లాగింగ్, వ్లాగింగ్, మార్కెటింగ్ చేస్తూ డబ్బును సంపాదిస్తున్నారు. సోషల్ మీడియా భారతీయ యువతకు అనేక ప్రయోజనాలను అందిస్తున్నప్పటికీ, దాని ఉపయోగంతో అనేక ముఖ్యమైన ప్రతికూలతలు, సవాళ్లు కూడా ఉన్నాయి. వీటితో పాటు మానసిక ఆరోగ్య సమస్యలు (డిప్రెషన్) సోషల్ మీడియాను రోజుకు 3 గంటలకన్నా ఎక్కువగా ఉపయోగించడం వల్ల ఆందోళన, డిప్రెషన్ భావాలకు దారితీయవచ్చు. ఇతరులు వారి జీవన శైలిలతో తమ జీవితాలతో పోలిక వల్ల తాము తక్కువ అనే స్థాయికి జీవితాలు దిగజారుతున్నాయి. సైబర్ మోసాలు, బెదిరింపు భారతీయ యువత ఆన్‌లైన్ వేధింపులకు, బెదిరింపుల వల్ల తీవ్రమైన మానసిక క్షోభకు గురవుతున్నారు. దీని వాడకం వ్యసనంగా మారి మన రోజువారీ కార్యకలాపాలకు, బాధ్యతలపై ప్రభావితం చేస్తుంది.

### తప్పుడు సమాచారం వ్యాప్తి

సోషల్ మీడియా ప్లాట్‌ఫారమ్‌లు తప్పుడు సమాచారాన్ని వేగంగా వ్యాప్తి చేయగలవు, ఇది అపోహలకు, కొన్నిసార్లు ప్రమాదకరమైన చర్యలకు దారితీస్తుంది. ఈ మధ్య మనుషుల మధ్య కమ్యూనికెషన్ తగ్గి వర్చువల్ కమ్యూనికేషన్‌పై అతిగా ఆధారపడటం అనేది ఎక్కువ అయింది. ఇది మనలను సామాజికంగా ఒంటరిగా మన చుట్టూ ఉన్న బంధాలను విచ్ఛిన్నం చేస్తుంది సోషల్ మీడియా నోటిఫికేషన్‌లు విద్యార్థులను వారి చదువుల నుండి దూరం చేస్తుంది. అర్ధరాత్రి సోషల్ మీడియా వినియోగం నిద్రకు అంతరాయం కలిగించి, విద్యార్థులపై ప్రతికూల ప్రభావితం చేస్తుంది. దీనిని అధికంగా ఉపయోగించడం వల్ల మనం అధ్యయనం చేయాల్సిన స్కిల్స్, మనలో ఉత్పాదకత పెంచగల నైపుణ్యం అభివృద్ధి వంటివాటిపై వెచ్చించాల్సిన విలువైన సమయాన్ని వృధా చేసుకోవడమే అవుతుంది. యువతను ఆకర్షించే విధంగా ఆన్లైన్ గేమ్స్, ఆన్‌లైన్ స్కామ్‌లు వలలో పడి, వారిపై తీవ్ర మానసిక ఒత్తిడికి కారణం అవుతుంది, అదేగాక ఆత్మహత్యల దిశ గానో, సైకోటిక్ బిహేవియర్ పెరిగి సమాజానికి యువతే ప్రమాదకారి అయ్యే విధంగా చేస్తుందనడంలో సందేహం లేదు.

# మేధావులకు ఆ బాధ్యత లేదా

మేధావుల మౌనం దేశానికి శాపం కాకూడదు. మేధావులు వారి కొంత సమయం సమాజసేవ చేయడానికి ఉపయోగించండి. భారతదేశంలో పుట్టడం ఒక వరం, ఆ దేశం గాలి పీల్చి, రైతు పండించే ధాన్యం తిని కండలు పెంచాము. సైనికుల వలె అందరం సేవ చేయలేము, యుద్ధంలో ప్రాణాలు దేశం కోసం వదలలేము, కానీ మన చుట్టూ ఉన్న సమాజం మార్పుకు ప్రయత్నిస్తే అదే దేశ సేవ అదే భగవత్ సేవ.



### నాయకులే దుర్మార్గులా

ప్రస్తుత సమాజంలో, ప్రజల్లో పెరుగుతున్న అనిస్థితి, అశాంతి, ఇంత మార్పులకు కారణం పాశ్చాత్య ధోరణి, ఇంటి పెద్దల నేతృత్వ లోపం. సమాజంలో విజ్ఞుల మౌనం. ప్రతి తరానికి అభివృద్ధితోపాటు కొంత సాంకేతిక అభివృద్ధిలో మార్పులు అవసరం. కానీ ఆ సాంకేతిక అభివృద్ధితో పాటు ఎన్నో విషయాలలో విశృంఖలత్వం పెరిగింది. పౌరులలో సామాజిక బాధ్యత కొరవడింది. ప్రతీది ప్రభుత్వాల మీద ఆధారపడి ఉండటం, ప్రోత్సాహకాల కోసం వేచి చూడటం. రాజకీయ నాయకుల ఆటలలో పావులుగా మారడం జరుగుతుంది. ఇంత దౌర్భాగ్యానికి కారణం మనకు మన దేశం పట్ల కానీ, మన సమాజం పట్ల కానీ, కనీసం మన మీద మనకు బాధ్యత గౌరవం లేకపోవడం. అంతేకాక ప్రజలు అవినీతిపరులైతే నాయకులు దుర్మార్గులు అవుతారు.

### పథకాలు చేయూతనివ్వాలి

నాయకుడు స్వలాభం చూసుకుంటే రాష్ట్రం ఇంకా రాష్ట్ర ప్రజలు అధోగతి పాలవడం తథ్యం. స్వాతంత్ర్య పీఠికలో మనం రాసుకున్న సమానత్వం, స్వేచ్ఛ, న్యాయం, సోదరభావం మచ్చుకకు కూడా కనపడటం లేదు. స్వేచ్ఛకూ, సమానత్వానికి అర్థాలు మారి ఇప్పటి ప్రజల పోకడలు చెప్పనలవిగా ఉన్నాయి. ప్రభుత్వాలు తెచ్చే ప్రతి పథకంలో ప్రజలను సోమరులను చేసేట్టుగా ఉన్నాయి. కానీ చేయూత పరిచేట్టుగా లేవు. ప్రజలను లంచాలకు, ఉచితాలకు అలవాటు చేశారు. ఇది ఇలానే ఉంటే వచ్చే భావితరాలకు మన దేశం ప్రస్తుత చరిత్రను నల్ల సిరాతో రాస్తారు.

### మేధావుల మౌనం శాపం కాకూడదు..

ప్రజలు సైతం ఎవరో వచ్చి ఏదో చేస్తారని వేచి చూచే ధోరణి మానాలి. ప్రతి పౌరునికి తన పట్ల, కుటుంబం పట్ల, సమాజం పట్ల బాధ్యత ఉండాలి. దాన్ని బాల్యం నుంచే చైతన్య పరచాలి. అబ్దుల్ కలాం గారి "కలలు కనండి సాధించడానికి కృషి చేయండి" అన్న పిలుపుకు ఎంతోమంది పిల్లలు స్పందించారు. అలానే ఎంతో మంది మేధావులు ముందుకు వచ్చి మన భావితరాల వారిని చైతన్య పరచాలి, సమాజం పట్ల మంచి పౌరులుగా ఉండేలా ప్రయత్నించాలి. "పిల్లలు - సమాజం ఒకటే ! పిల్లల మంచి భవిత మన బాధ్యత". ఉపాధ్యాయులు బడిలో చెప్పే పాఠాలు వారికి జీవితంలో నిలదొక్కుకునే జ్ఞానాన్ని అందిస్తాయి. కానీ ఆ జ్ఞానం ఎలా ఉపయోగించాలి అని చెప్పేది మేధావులు మాత్రమే. మంచి జీవనశైలి విద్యార్థి దశలో మలిచినట్లయితే వచ్చే తరమైన బంగారు భారతాన్ని అందించవచ్చు.

### దేశం కోసం ప్రాణాలొదలద్దు కానీ...

జీవితంలో కొంత కుటుంబ బాధ్యతలు నెరవేరిన తర్వాత, సమాజ శ్రేయస్సు కోసం మనమందరం ముందుకు రావాల్సిన సమయం ఆసన్నమైంది. అందుకే మేధావులు వారి కొంత సమయం సమాజ సేవ చేయడానికి ఉపయోగించండి. భారతదేశంలో పుట్టడం ఒక వరం, ఆ దేశం గాలి పీల్చి, రైతు పండించే ధాన్యం తిని కండలు పెంచాము. సైనికుల వలె అందరం సేవ చేయలేము, యుద్ధంలో ప్రాణాలు దేశం కోసం వదలలేము, కానీ మన చుట్టూ ఉన్న సమాజం మార్పుకు ప్రయత్నిస్తే అదే దేశ సేవ అదే భగవత్ సేవ.

# పటిష్టంగా భారత ఆర్థిక వ్యవస్థ

## 12 ఏళ్ల కనిష్ట స్థాయికి తగ్గిన మొండిబాకీలు జూన్ ఆర్థిక స్థిరత్వ నివేదికలో ఆర్‌బీఐ వెల్లడి



ముంబై:భారత ఆర్థిక వ్యవస్థ పటిష్ట స్థితిలో ఉందని జూన్ నెలకు సంబంధించిన ఆర్థిక స్థిరత్వ నివేదికలో (ఎఫ్ఎస్ఆర్) రిజర్వ్ బ్యాంక్ తెలిపింది. 2024 మార్చి ఆఖరు నాటికి షెడ్యూల్డ్ కమర్షియల్ బ్యాంకుల్లో (ఎస్‌సీబీ) స్థూల మొండి బాకీల నిష్పత్తి (జీఎన్‌పీఏ) 12 ఏళ్ల కనిష్ట స్థాయి అయిన 2.8 శాతానికి, నికర ఎన్‌పీఏల నిష్పత్తి 0.6 శాతానికి తగ్గినట్లు వివరించింది. జీఎన్‌పీఏలు ఈ ఆర్థిక సంవత్సరం ఆఖరు నాటికి 2.5 శాతానికి తగ్గగలవని వివరించింది. క్రెడిట్ రిస్కులకు సంబంధించి స్థూల స్ట్రెస్ టెస్టుల్లో ఎస్‌సీబీలు కనీస మూలధన అవసరాలను పాటించగలిగే స్థాయిలోనే ఉన్నట్లు వెల్లడైందని నివేదిక పేర్కొంది. నాన్-బ్యాంకింగ్ ఫైనాన్షియల్ కంపెనీలకు (ఎన్‌బీఎఫ్‌సీ) సంబంధించి జీఎన్‌పీఏ నిష్పత్తి 4 శాతంగాను, రిటర్న్ ఆన్ అసెట్స్ (ఆర్‌వోఏ) 3.3 శాతంగాను ఉన్నట్లు తెలిపింది. భౌగోళిక-రాజకీయ ఆందోళనలు, ప్రభుత్వాలపై భారీ రుణభారాలు, ద్రవ్యోల్బణాన్ని తగ్గించే దిశగా పురోగతి మందకొడిగా సాగుతుండటం వంటి అంశాల రూపంలో అంతర్జాతీయ ఎకానమీకి సవాళ్లు పెరిగాయని వివరించింది. సవాళ్లున్నప్పటికీ అంతర్జాతీయ ఆర్థిక వ్యవస్థ పటిష్టంగానే ఉందని నివేదిక తెలిపింది.

### గవర్నెన్స్‌పై దృష్టి పెట్టాలి..

ఎలాంటి ఒత్తిళ్లు ఎదురైనా నిలదొక్కుకునేలా అసెట్ క్వాలిటీ, పటిష్టత మెరుగుపడినట్లుగా అధ్యయనాలు చూపిస్తున్న నేపథ్యంలో గవర్నెన్స్‌కు అత్యంత ప్రాధాన్యమివ్వడంపై దృష్టి పెట్టాలంటూ ఆర్థిక వ్యవస్థలో భాగస్వాములకు ఆర్‌బీఐ గవర్నర్ శక్తికాంత దాస్ సూచించారు. ప్రస్తుతానికి ఆర్థిక స్థిరత్వం పటిష్టంగానే ఉందని, అయితే దాన్ని అలాగే కొనసాగించడంతో పాటు రాబోయే రోజుల్లో మరింత మెరుగుపర్చుకోవడమనేది నిజమైన సవాలుగా ఉండగలదని ఎఫ్ఎస్ఆర్ నివేదిక ముందుమాటలో ఆయన పేర్కొన్నారు. సైబర్ ముప్పులు, పర్యావరణ మార్పులు, అంతర్జాతీయ పరిణామాల వల్ల తలెత్తే ప్రతికూల ప్రభావాలు మొదలైన వాటన్నింటినీ ఆర్‌బీఐ పరిశీలిస్తూనే ఉంటుందన్నారు. టెక్నాలజీపై బ్యాంకులు తగినంత స్థాయిలో ఇన్వెస్ట్ చేయాలని సూచించారు.

### నివేదికలోని మరిన్ని అంశాలు..

బ్యాంక్ గ్రూపుల వ్యాప్తంగా చూస్తే ప్రభుత్వ రంగ బ్యాంకుల్లో (పీఎస్‌బీ) 2023-24 ప్రథమార్ధంలో జీఎన్‌పీఏ నిష్పత్తి గణనీయంగా 76 శాతం మేర తగ్గింది. ప్రొవిజనింగ్ కవరేజీ నిష్పత్తి (పీసీఆర్) మెరుగుపడింది. అర్ధ సంవత్సరంలో కొత్త ఎన్‌పీఏలు కూడా వివిధ బ్యాంకు గ్రూపుల్లో తగ్గాయి. పూర్తి సంవత్సరంలో మొండి బాకీల రైటాఫ్‌లు దిగివచ్చినప్పటికీ రైటాఫ్ నిష్పత్తి మాత్రం క్రితం సంవత్సరం స్థాయిలోనే ఉంది. 2023-24 ద్వితీయార్ధంలో పీఎస్‌బీలు, ఫారిన్ బ్యాంకుల్లో రుణాల మంజూరు పెరగ్గా, ప్రైవేట్ రంగ బ్యాంకుల్లో కాస్త నెమ్మదించింది. మొత్తం రుణాల పోర్ట్‌ఫోలియోలో సర్వీ సుల రంగానికి ఇచ్చిన రుణాలు, వ్యక్తిగత రుణాల వాటా పెరిగింది. ప్రైవేట్ బ్యాంకుల రుణ వృద్ధిలో వ్యక్తిగత రుణాల వాటా సగానికి పైగా ఉంది. ఇటీవలి కాలంలో ఫ్యూచర్స్ అండ్ ఆప్షన్స్ (ఎఫ్అండ్‌వో) వాల్యూమ్స్ గణనీయంగా పెరగడమనేది రిటైల్ ఇన్వెస్టర్లకు సవాలుగా మారొచ్చు. చిన్న ఇన్వెస్టర్లు సరైన రిస్కు మేనేజ్‌మెంట్ విధానాలను పాటించకపోతుండటమే ఇందుకు కారణం. కాబట్టి ఇన్వెస్టర్ల ప్రయోజనాలను పరిరక్షించడం కీలకం. ఈక్విటీ డెరివేటివ్స్ సెగ్మెంట్లో 2022-23లో 65 లక్షలుగా ఉన్న రిటైల్ ఇన్వెస్టర్ల సంఖ్య 2023-24లో ఏకంగా 95.7 లక్షలకు పెరిగింది.

## సంస్కరణలతో దేశ ప్రగతిని పీవీ పరుగులు పెట్టించారు..



సంస్కరణలతో దేశ ఆర్థిక ప్రగతిని పరుగులు పెట్టించిన ఘనత మాజీ ప్రధానమంత్రి పీవీ నరసింహారావుకు దక్కుతుందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కొనియాడారు. మాజీ ప్రధానమంత్రి పీవీ నరసింహారావు జయంతిని పురస్కరించుకొని ఢిల్లీలోని తన అధికారిక నివాసంలో పీవీ చిత్రపటానికి సీఎం రేవంత్ రెడ్డి పూలమాల వేసి నివాళులర్పించారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా, కేంద్రంలో వివిధ శాఖల మంత్రిగా, ప్రధానమంత్రిగా పీవీ నరసింహారావు చేసిన సేవలు మరువరానివని పేర్కొన్నారు. ముఖ్యమంత్రితో పాటు ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, కోదాడ ఎమ్మెల్యే ఎన్.పద్మావతి రెడ్డి పీవీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

## ఒకే వేదికపై చంద్రబాబు, రేవంత్..!



ప్రపంచ కమ్మ మహాసభకు హైదరాబాద్ కు వేదిక కానుంది. కమ్మ గ్లోబల్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో జులై 20, 21 తేదీలో తొలి ప్రపంచ కమ్మ మహాసభ హైదరాబాద్‌లోని హెచ్ఐసీసీ లో నిర్వహిస్తున్నట్లు సంస్థ వ్యవస్థాపకులు జెట్టి కుసుమకుమార్ వెల్లడించారు. ఈ మహాసభకు మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు, ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డిలు ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా పాల్గొంటారని కుసుమ కుమార్ వెల్లడించారు. కాగా ఇటీవల ఏపీలో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో ఎన్డీయే కూటమి అధికారంలోకి వచ్చి చంద్రబాబు సీఎం అయ్యారు. అయితే.. చంద్రబాబు ప్రమాణస్వీకార కార్యక్రమానికి సీఎం రేవంత్ రెడ్డి హాజరు అవుతారని అందరు అనుకున్నారు. కానీ, రాజకీయ కారణాల వల్ల రేవంత్ రెడ్డి చంద్రబాబు ప్రమాణస్వీకారానికి హాజరు కాలేదు. దాదాపు పదేళ్ల తరువాత ఇద్దరు సీఎం హోదాలో కలుసుకోనుండటం గమనార్హం. రేవంత్ రెడ్డి తొలుత టీడీపీ హయాంలోనే కొడంగల్ ఎమ్మెల్యే విజయం సాధించారు. టీడీపీలో కీలక పాత్ర పోషించిన రేవంత్ రెడ్డి రాజీనామా చేసి కాంగ్రెస్ చేరారు. అంచెలంచెలుగా ఎదుగుతూ.. సీఎంగా బాధ్యతలు చేపట్టారు.

## ఏపీలో చంద్రబాబు ఇంటికి వెళ్లిన తెలంగాణ గవర్నర్



తెలంగాణ గవర్నర్ సీపీ రాధాకృష్ణన్ ఏపీ పర్యటనకు వచ్చారు. ఈ మధ్యాహ్నం ఆయన విజయవాడను సందర్శించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడిని కలుసుకున్నారు. ఆయనతో సమావేశం అయ్యారు. ఈ భేటీలో ఐటీ, మానవ వనరుల అభివృద్ధి శాఖ మంత్రి నారా లోకేష్ పాల్గొన్నారు. ఉండవల్లిలోని చంద్రబాబు నివాసంలో ఈ భేటీ ఏర్పాటైంది. తమ ఇంటికి వచ్చిన గవర్నర్‌ను చంద్రబాబు, నారా లోకేష్ సాదరంగా ఆహ్వానించారు. ఆయనకు శాలువా కప్పారు. జ్ఞాపికను అందజేశారు. ఈ సమావేశానికి ఎలాంటి ప్రాధాన్యత లేదని, మర్యాదపూరకంగా ఏర్పాటైందని చెబుతున్నారు. ప్రస్తుతం తెలంగాణకు పూర్తిస్థాయి గవర్నర్ లేరు. సీపీ రాధాకృష్ణన్.. ఇన్‌ఛార్జ్ మాత్రమే. జార?ండ్‌కు ఆయన పూర్తి స్థాయి గవర్నర్‌గా ఉంటోన్నారు. గతంలో గవర్నర్‌గా పని చేసిన తమిళిసై సౌందరరాజన్ తన పదవికి రాజీనామా చేసి, బీజేపీ తరఫున క్రియాశీలక రాజకీయాల్లో దిగారు. మొన్నటి ఎన్నికల్లో చెన్నై సౌత్ లోక్‌సభ అభ్యర్థిగా పోటీ చేసి ఓడిపోయారు. తమిళిసై సౌందరరాజన్ రాజీనామా తరువాత తెలంగాణ వంటి కీలక రాష్ట్రానికి పూర్తి స్థాయి గవర్నర్ లేకపోవడం సరికాదనే ఉద్దేశంలో ఉంది బీజేపీ. పైగా మొన్న జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో ఎనిమిది స్థానాలను గెలిచి పట్టు నిలుపుకొంది. దీన్ని మరింత బలోపేతం చేసేలా పావులు కదుపుతోంది. ఈ పరిస్థితుల్లో సీపీ రాధాకృష్ణన్.. స్వయంగా చంద్రబాబును కలుసుకోవడం ప్రాధాన్యతను సంతరించుకుంది. తమిళనాడులోని కోయంబత్తూర్‌కు చెందిన రాధాకృష్ణన్ సుదీర్ఘకాలంగా భారతీయ జనతా పార్టీలో కొనసాగారు. తమిళనాడు మోదీగా ఆయనకు పేరుంది. రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్, జన్ సంఘ్‌లో క్రియాశీలకంగా వ్యవహరించారు. 1999 ఎన్నికల్లో కోయంబత్తూర్ నుంచి బీజేపీ అభ్యర్థిగా లోక్‌సభకు ఎన్నికయ్యారు.

## ఏపీ మాజీ సీఎం జగన్ పై తెలంగాణ సీఎం రేవంత్ సంచలన వ్యాఖ్యలు



తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి డిల్లీ పర్యటనలో ఉన్న విషయం అందరికీ తెలిసిందే. ఈనేపథ్యంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ.. వైసీపీ అధినేత ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డిపై సంచలన వ్యాఖ్యలు చేశారు. టీడీపీ అధినేత ఆంధ్రప్రదేశ్ సీఎం నారా చంద్రబాబు నాయుడు తనకు ఫోన్ చెప్పినందుకే హైదరాబాద్ లో జగన్ ఇంటి వద్ద నిర్మాణాలు తొలగించానని వైసీపీ చేస్తున్న ఆరోపణల్లో వాస్తవం లేదని తెలిపారు. ఇలా టీడీపీపై బురదజల్లి ఆంధ్ర రాష్ట్రంలో టీడీపీని ఖతం చేయాలని ప్రయత్నించే చివరికి జగనే ఖతమైయ్యారని ఆయన పేర్కోన్నారు. 2019 ఎన్నికల్లో 151 సీట్లతో అధికారంలోకి వచ్చిన జగన్ ఇటీవల ఎన్నికల్లో కేవలం 11 సీట్లకే పరిమితమయ్యారంటే దానికి జగన్ చేసుకున్న స్వయంకృపరాధమే కారణం అని అన్నారు. పాలనను విస్మరించి, అక్రమాలకు పాల్పడడంతో పరిశ్రమలు కుప్పకూలి రాష్ట్రం దెబ్బతింది అని, అందుకే జగన్ కి ప్రజలు తగిన గుణపాఠం చెప్పారని అన్నారు. వైసీపీ నేతలు తనను కలిసినందుకు జగన్ వారిని తిట్టిన సందర్భాలు చాలానే ఉన్నాయని గుర్తు చేశారు.

## లోక్‌సభలో రాహుల్ గాంధీ మాట్లాడుతుండగా మైక్ కట్!



పార్లమెంట్ సమావేశాల్లో శుక్రవారం గందరగోళం నెలకొంది. నీట్‌లో అవకతవకలపై కేంద్ర ప్రభుత్వాన్ని విపక్ష పార్టీలు నిలదీశాయి. ఇండియా కూటమి, ఎన్డీఏ వాగ్వాదానికి దిగాయి. నీట్ పేపర్ లీక్ అంశాన్ని లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ లేవనెత్తడంతో మైక్‌ను ఆఫ్ చేశారని కాంగ్రెస్ శుక్రవారం పేర్కొంది. ఆ తర్వాత మైక్రోఫోన్ యాక్సెస్ కోసం లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లాను రాహుల్ గాంధీ అభ్యర్థిస్తున్నట్లు ఉన్న వీడియోను కాంగ్రెస్ తమ అధికారిక ఎక్స్ ఖాతాలో పోస్ట్ చేసింది. నీట్ వివాదంపై చర్చ జరగాలని రాహుల్ గాంధీ కోరారు. నీట్ పై ప్రభుత్వం నుంచి ప్రకటన చేయాలని డిమాండ్ చేశారు. నీట్ డిమాండ్‌పై విపక్షాలు గందరగోళం సృష్టించడంతో స్పీకర్ ఓం బిర్లా లోక్‌సభను సోమవారానికి వాయిదా వేశారు. దేశంలో జరుగుతున్న పేపర్ లీకేజీల వల్ల యువత భవిష్యత్తు పాడైపోతుందని కాంగ్రెస్ ఎంపీ దీపేందర్ హూడా అన్నారు. హరియాణాలో పేపర్ లీక్ కేసులు అధికంగా నమోదయ్యాయని చెప్పారు.నీట్ పేపర్ లీక్ అయితే దీనికి బాధ్యత వహించాల్సిన కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ దాని నుంచి దూరంగా పారిపోతున్నారంటూ విమర్శింవచారు. నీట్ పై తాము చర్చను లేవనెత్తుతుంటే ప్రతిపక్ష నాయకుడి మైక్ ను స్విచ్ ఆఫ్ చేస్తున్నారని అన్నారు. నీట్ పై చర్చ జరగాలని డిమాండ్ చేశారు.

# వృద్ధికి వర్షపాతం, ప్రపంచ సానుకూలతల దన్ను

### 2024-25లో 7 శాతం అంచనా ఎన్‌సీఏఈఆర్ విశ్లేషణ



న్యూఢిల్లీ:సాధారణ రుతుపవనాల అంచనాలు, ఇప్పటివరకు ఎటువంటి ప్రపంచ ప్రతికూలతలు లేకపోవడం వంటి అంశాలు ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో (2024-25) భారత్ ఆర్థిక వ్యవస్థ 7 శాతం కంటే ఎక్కువగా వృద్ధి చెందడానికి దోహదపడే అవకాశం ఉందని ఎకనామిక్ థింక్ ట్యాంక్- ఎన్‌సీఏఈఆర్ తన నెలవారీ సమీక్షలో తెలిపింది. దేశీయ ఆర్థిక వ్యవస్థ నిలకడగా ఉందని హై-ఫ్రీక్వెన్సీ సూచికలు వెల్లడిస్తున్నాయని, 2024-25 వృద్ధి అంచనాలను దాదాపు అన్ని ఏజెన్సీలు కూడా ఎగువముఖంగా సవరిస్తున్నాయని పేర్కొంది. భారత్ వృద్ధి రేటు 6.2 శాతం నుంచి 7.2 శాతం శ్రేణిలో ఉంటుందని పలు సంస్థలు అంచనావేస్తున్న విషయాన్ని ఎన్‌సీఏఈఆర్ డైరెక్టర్ జనరల్ పూనమ్ గుప్తా పేర్కొంటూ.. ఎకానమీ వృద్ధి 2024-25లో 7 శాతం ఖాయమని, 7.5 శాతం వరకూ కూడా ఈ రేటు పురోగమించే వీలుందని అన్నారు. పూనమ్ గుప్తా పేర్కొన్న అంశాల్లో ముఖ్యమైనవి... మార్చి త్రైమాసికంలో కనిపించిన ఆర్థిక కార్యకలాపాలు, పెట్టుబడులు, వృద్ధి, స్థూల ఆర్థిక స్థిరత్వం వంటి అంశాలకు తోడు సాధారణ రుతుపవనాల అంచనాలు ఎకానమీకి ఊతం ఇస్తాయి. ద్రవ్యోల్బణం కనిష్ట స్థాయిల్లోనే కొనసాగే అవకాశం ఉన్నందున, కీలక రెపో రేటు మరింత కఠినమయ్యే పరిస్థితులు లేవు. అయితే ఆహార ధరలు ఇప్పుడు ప్రధానంగా సవాలు విసురుతున్న సమస్య. దీనిని పరిష్కరించడానికి విస్తృత విధాన ఫ్రేమ్‌వర్క్ అవసరం కావచ్చు. వాతావరణ సవాళ్లను తట్టుకునే ఆహార సరఫరాల చైన్‌ను వ్యవస్థీకరించడంతోపాలు, ప్యాక్ అయిన సురక్షిత ఆహార సరఫరాలవైపు క్రమంగా మారాలి. సరఫరా-డిమాండ్ అంతరాన్ని తగ్గించడానికి తగిన కృషి జరగాలి. ప్రధాన పరిశ్రమలకు సంబంధించి పారిశ్రామిక ఉత్పత్తి సూచిక (ఐఐపీ)లో వృద్ధి ఏప్రిల్ 2024లో వేగంగా ఉంది. వస్తువులు సేవల పన్ను (జీఎస్‌టీ) వసూళ్లు ఏడాది పొడవునా పటిష్టంగా ఉన్నాయి. వ్యక్తిగత రుణ వృద్ధిలో కొంత క్షీణత ఉన్నప్పటికీ, బ్యాంక్ క్రెడిట్ వృద్ధి 20 శాతం కంటే ఎక్కువగా ఉంది. జూన్‌లో వర్షపాతం తక్కువగా ఉన్నప్పటికీ 'సాధారణం కంటే ఎక్కువ' రుతుపవనాల అంచనాలు వ్యవసాయ రంగానికి ఊతం ఇస్తున్నాయి. భారత్ ఎకానమీ పురోగతిలో ఇవన్నీ కీలకాంశాలు.

# ప్రగతి మైదాన్ సొరంగంలో పగుళ్ల నుంచి.. ఢిల్లీ ఎయిర్‌పోర్టు ప్రమాదం వరకు..



ఇటీవల ప్రమాదాలు పెరిగిపోతున్నాయి. ప్రకృతి వైపరీత్యాలు వంటి ఊహించని ప్రమాదాలు కొన్ని అయితే, మానవ తప్పిదాలతో జరిగే ఘటనలు మరికొన్ని.. మధ్యకాలంలో గతంలో ఎన్నడూ చూడని స్థాయిలో అత్యంత తీవ్రతతో ఈ ప్రమాదాలు సంభవిస్తున్నాయి. వీటిలో ప్రభుత్వాలు ప్రతిష్టాత్మకంగా తీసుకొని నిర్మించినవి కూడా ఉన్నాయి. వరుస ఘటనలతో ఎటునుంచి ఏ ప్రమాదం పొంచి వస్తుందోనని ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు.

### ఢిల్లీ ప్రగతి మైదానం సొరంగంలో పగుళ్లు

సెంట్రల్ ఢిల్లీని నగర తూర్పు ప్రాంతాలతో అనుసంధానం చేస్తూ.. రూ. 777 కోట్లతో ప్రగతి మైదాన్ ఇంటిగ్రేటెడ్ ట్రాన్సిట్ కారిడార్ ప్రాజెక్ట్‌ను కేంద్రం చేపట్టింది.. ఇందులో భాగంగా 1.3 కి.మీ. పొడవైన సొరంగం, ఐదు అండర్‌పాస్‌లు నిర్మించారు. 2022 జూన్‌లో ప్రధాని మోదీ ప్రారంభించిన ఈ టన్నెల్‌లో నీళ్లు నిలిచిపోవడం, పగుళ్లు రావడం వంటి అనేక లోపాలు వెలుగుచూశాయి. పనుల్లో జాప్యం, నిర్వహణ లేమీ కారణంగా సమస్యలు తలెత్తాయి. అనంతరం మళ్లీ కోట్ల రూపాయలతతో డిజైన్‌ను సరిదిద్ది, మరమ్మతులు చేశారు.

### జలమయంగా మారిన అయోధ్య

ఉత్తరప్రదేశ్‌లోని అయోధ్య నగరంలో వర్ష బీభత్సం కారణంగా రోడ్లపై మోకాళ్ల వరకు నీరు నిలిచిపోయింది. రామమందీర్ సమీపంలోని ఇళ్లలోకి మురుగునీరు చేరింది. దీంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రామమందిరం చుట్టూ హడావిడిగా నిర్మాణ పనులు చేపట్టడంతోనే ఇళ్లలోకి నీళ్లు వచ్చాయని స్థానికులు అంటున్నారు. మరోవైపు ధ్యలో నిర్మించిన రామమందిరం ప్రారంభోత్సవం జరుపుకొని సరిగ్గా ఆరు నెలలు కూడా పూర్తి కాకముందే.. ప్రధాన గర్భాలయంలో నీరు లీకవడం ప్రస్తుతం దేశవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారిన విషయం తెలిసిందే. చిన్నపాటి వర్షానికే ఆలయం నుంచి నీరు కారుతోందని ఆలయ ప్రధాన అర్చకుడు ఆచార్య సత్యేంద్ర దాస్ పేర్కొన్నారు. రామ్‌లల్లా విగ్రహం ముందు పూజారి కూర్చునే స్థలం, వీఐపీ దర్శనం కోసం భక్తులు వచ్చే ప్రదేశం వరకూ పైకప్పు నుంచి వర్షపు నీరు లీక్ అవుతోందన్నారు ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన దేవాలయం పైకప్పు లీక్ అవడం ఆశ్చర్యంగా ఉందని, ఇలా ఎందుకు జరిగిందని విస్మయం వ్యక్త ంచేశారు. ఇంత పెద్ద ఇంజనీర్ల సమక్షంలోనే ఇలాంటి ఘటన జరగడం చాలా పొరపాటుగా పేర్కొన్నారు. అయితే గర్భగుడి నుంచి వర్షపు నీరు లీకవుతోందన్న వార్తలపై రామాలయ నిర్మాణ కమిటీ చైర్మన్ నృపేంద్ర మిశ్రా స్పందించారు. ఈ మేరకు ఆలయ ప్రధాన పూజారి ఆరోపణలను తోసిపుచ్చారు. పైకప్పు లీక్ కాలేదని, విద్యుత్ తీగల కోసం అమర్చిన పైపుల ద్వారా నీరు కిందకు వచ్చిందని వివరించారు.

### జబల్‌పూర్ ఎయిర్ పోర్టు ప్రమాదం

మధ్యప్రదేశ్‌లోని జబల్‌పూర్ దుమ్నా ఎయిర్‌పోర్ట్‌లో పెను ప్రమాదం తప్పింది. భారీ వర్షాలు కారణంగా టెర్మినల్ రూఫ్‌టాప్ పడిపోయింది. పార్కు చేసిన కారు మీద పడడంతో నుజ్జునుజ్జు అయింది. ప్రమాదానికి కొద్ది సేపటి క్రితమే కారులోంచి ఆదాయపు పన్ను అధికారి, డ్రైవర్ కిందకి దిగారు. లేదంటే ప్రాణాలు గాల్లో కలిసిపోయేవి. ఇక ఈ విమానాశ్రయాన్ని కొన్ని నెలల క్రితమే రూ.450 కోట్ల వ్యయంతో పునరుద్ధరించారు. కానీ గురువారం కురిసిన వర్షానికి అతలాకుతలం అయింది. దీంతో నాణ్యతపై అనుమానాలు రేకెత్తుతున్నాయి.

### ఢిల్లీ ఎయిర్‌పోర్టు టెర్మినల్‌లో కూలిన రూఫ్

ఈ ఘటన జరిగిన ఒక్క రోజుకే ఢిల్లీలోని విమానాశ్రయంలోని టెర్మినల్-1లో పైకప్పు కూలింది. ఈ దుర్ఘటనలో ఒకరు మృతి చెందగా, ఆరుగురికి గాయాలయ్యాయి. క్షతగాత్రులను హాస్పిటల్‌కు తరలించి చికిత్స అందిస్తున్నారు. వీరిలో ముగ్గురి పరిస్థితి విషమంగా ఉన్నట్లు డాక్టర్లు ఘటనాస్థలానికి చేరుకున్న పోలిసు బృందాలు సహాయక చర్యలు అందిస్తున్నాయి. టెర్మినల్ 1లో ప్రమాదం జరగడంతో పలు విమానాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. అయితే ఎయిర్ పోర్టును నిర్మించిన కాంట్రాక్టర్ల నిర్లక్ష్యం కారణంగానే ప్రమాదం జరిగిందని పలువురు ఆరోపిస్తున్నారు. నాసిరకం మెటీరియల్‌తో ఎయిర్ పోర్టును నిర్మించిన కంపెనీపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.

# ఎమర్జెన్సీ అప్రజాస్వామికమే కావచ్చు, కానీ

### శశిథరూర్ కీలక వ్యాఖ్యలు



న్యూఢిల్లీ: మాజీ ప్రధాని ఇందిరాగాంధీ 'ఎమర్జెన్సీ' విధించి జూన్ 26కు 50 ఏళ్లు అవుతోంది. ఈ సందర్భంగా ఈ అంశం తాజాగా లోక్‌సభ సమావేశాలను కుదిపేస్తోంది. ముందుగా దీనిని ప్రధాని నరేంద్ర మోదీ గుర్తు చేస్తూ కాంగ్రెస్‌పై విమర్శలు గుప్పించారు. అనంతరం రాష్ట్రపతి ద్రౌపదీ ముర్మ తన ప్రసంగంలో ఆ విషయాన్ని ప్రస్తావించడం, స్పీకర్ ఓం బిర్లా దీనిపై తీర్మానం చదవడం తీవ్ర దుమారం రేపుతోంది. దీనిపై విపక్షాలు అభ్యంతరం వ్యక్తంచేస్తున్నాయి. ఈ క్రమంలోనే కాంగ్రెస్ సీనియర్ ఎంపీ శశిథరూర్ నాటి అత్యయిక స్థితిపై కీలక వ్యాఖ్యలు చేశారు. ఎమర్జెన్సీ అప్రజాస్వామికమే కావచ్చు. కానీ, రాజ్యాంగ విరుద్ధం కాదన్నారు. ఈ మేరకు జాతీయ మీడియాకు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆయన మాట్లాడుతూ.. సెంగోల్‌ను భర్తీ చేయడం, నీట్ పేపర్ లీక్‌లు వంటి అంశాలపై మాట్లాడారు. అలాగే ఎమర్జెన్సీపై మోదీ, రాష్ట్రపతి, స్పీకర్ చేసిన వ్యాఖ్యలను థరూర్ తప్పుబట్టారు. 49 సంవత్సరాల క్రితం జరిగిన ఓ సంఘటనను ఎందుకు ఇప్పుడు తీసుకొచ్చి, చర్చిస్తున్నారని ప్రశ్నించారు. 'ఎమర్జెన్సీని నేను విమర్శిస్తా. ఆ చర్యను నేను సమర్థించడం లేదు. గర్వించదగ్గ విషయమనీ చెప్పట్లేదు. అత్యయిక స్థితి సమయంలో ప్రతిపక్ష నాయకులను అరెస్టు చేయడం, మీడియాపై ఆంక్షలు విధించడం వంటి చర్యలు ప్రజాస్వామ్య వ్యతిరేకమనే భావిస్తున్నా. అయితే, అది వాస్తవానికి రాజ్యాంగ విరుద్ధం మాత్రం కాదు. దేశంలో అంతర్గత ఎమర్జెన్సీని విధించేందుకు రాజ్యాంగంలో నిబంధన ఉంది. ఖచ్చితంగా ఇది రాజ్యాంగ పరిధిలోనే ఉంది. రాజ్యాంగ విరుద్ధమైన దాడి, రాజ్యాంగంపై దాడి అని రాష్ట్రపతి అనడం చట్టపరంగా సరికాదు' అని పేర్కొన్నారు. మోదీ ప్రభుత్వంపై కాంగ్రెస్ ఎంపీ విమర్శలు గుప్పించారు. ఎన్డీయే ప్రభుత్వం 1975 లేదా 2047 గురించి మాట్లాడుతోంది కానీ.. వర్తమాన అంశాలను ప్రస్తావించట్లేదని మండిపడ్డారు. దేశంలో నెలకొన్న ప్రధాన సమస్యల నుంచి ప్రజల దృష్టి మళ్లించేందుకే మోదీ సర్కారు ఇలాంటి ఎత్తుగడలు వేస్తోందని దుయ్యబట్టారు. నీట్ పేపర్ లీక్ వివాదం, నిరుద్యోగం సమస్యలు, మణిపూర్ అల్లర్ల వంటి కీలక అంశాలపై వారు దృష్టి పెట్టాలని హితవు పలికారు. కాగా తిరువనంతపురం నుంచి వరుసగా నాలుగోసారి ఎంపీగా గెలుపొందారు.

# బ్యాంకులో మిని బార్, వైసీపీ లీడర్స్ ఎంట్రీ గంగజాతర టైమ్ లో, ఖాతాదారులకు



తిరుపతిలో వైసీపీ నాయకుల ఆగడాలకు అడ్డూఅదుపులేకుండా పోతోందని ఆరోపణలు ఉన్నాయి. ఆంధ్రప్రదేశ్ లో ఎన్డీఏ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినా కూడా తిరుపతిలో వైసీపీ నాయకులు ఇంకా పద్ధతులు మార్చుకోలేదని ప్రజలు మండిపడుతున్నారు. తిరుపతి కోఆపరేటివ్ బ్యాంకును ఏకంగా బార్ గా మార్చేశారని, రాత్రి వరకు మందు పార్టీలు చేసుకుంటున్నారని ఆరోపణలు ఉన్నాయి.తిరుపతి కోఆపరేటివ్ బ్యాంకు ఛైర్మన్, వైస్ ఛైర్మన్లు వైసీపీ మార్క్ రాజకీయాలను బ్యాంకులోనే చేస్తున్నారని ఆరోపణలు ఉన్నాయి. తిరుపతి కోఆపరేటివ్ బ్యాంకులో తిరుపతి, రేణిగుంట, చంద్రగిరికి చెందిన వేలాది మంది ఖాతాదారులు ఉన్నారు. సొంత అవసరాల కోసం ఇంటి యజమానులు ఇంటి పత్రాలను బ్యాంకులో పెట్టి ఒక్కొక్కరు వారికి అవసరమైన సుమారు రూ. 15 లక్షల వరకు రుణం తీసుకుని నెలనెల ఈఎంఐలు చెల్లిస్తున్నారు. అయితే టీడీపీకి మద్దతుగా ఉంటూ రుణం తీసుకున్న ఖాతాదారులను తిరుపతి కోఆపరేటివ్ బ్యాంకు ఛైర్మన్ కేతం జయచంద్రా రెడ్డి, వైస్ ఛైర్మన్ వాసుదేవ్ యాదవ్ నానా ఇబ్బందులకు గురి చేస్తున్నారని కొంత మంది ఖాతాదారులు ఇప్పటికే ఆరోపణలు చేశారు. ఆంధ్రప్రదేశ్ లో ఎన్డీఏ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత టీడీపీకి మద్దతు పలికిన కోఆపరేటివ్ బ్యాంకు ఖాతాదారులను మరింత ఇబ్బందులకు గురి చేస్తున్నారని ఆరోపణలు ఉన్నాయి. కోఆపరేటివ్ బ్యాంకులో అర్జీలు రాసేందుకు వీలుగా ఖాతాదారుల కోసం ఓ గది ఉండేది. అయితే ఆ గదిని వైస్ ఛైర్మన్ వాసుదేవ యాదవ్ ఆయన చాంబర్ గా చేసుకున్నాడని, దానిని బార్ లాగా తయారు చేశారని ఆరోపణలు ఉన్నాయి. ఇటీవల జరిగిన తిరుపతి గంగ జాతర సందర్భంగా తిరుపతి కోఆపరేటివ్ బ్యాంకు వైస్ ఛైర్మన్ వాసుదేవ యాదవ్ చాంబర్ లో లిక్కర్ పార్టీ జరిగిందని వెలుగు చూడటంతో మీడియా మిత్రులు అక్కడికి వెళ్లి ఫోటోలు తీసి మరుసటి రోజు వార్తలు ప్రచురించారు. ఇంత జరిగినా కూడా తిరుపతి కోఆపరేటివ్ బ్యాంకు పబ్ ను తలపించే బార్ లాగా తయారైయ్యిందని కొందరు ఖాతాదారులు ఆరోపణలు చేస్తున్నారు. ఈ విషయంపై సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని, కోఆపరేటివ్ బ్యాంకు ఖాతాదారుల్లో మహిళలు ఉన్నారని, వారు బ్యాంకులోకి వచ్చి వెళ్లాలంటే ఇబ్బందిగా ఉందని కోఆపరేటివ్ బ్యాంకు ఖాతాదారులు సంబంధిత అధికారులకు ఫిర్యాదులు చేస్తున్నారు.

## మా గాంధీ తాతనే అవమానిస్తారా...
# సౌతాఫ్రికాకు దబిడి దిబిడే..!



టీ20 ప్రపంచకప్ 2024లో టీమిండియా ఫైనల్ చేరడంపై భారత అభిమానులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. సోషల్ మీడియా వేదికగా ఫన్నీ మీమ్స్‌తో నవ్వులు పూయిస్తున్నారు. ఫైనల్ ప్రత్యర్థి సౌతాఫ్రికాకు సోషల్ మీడియా వేదికగా వార్నింగ్ ఇస్తున్నారు. ఇంగ్లండ్‌తో గురువారం అర్ధరాత్రి ఏకపక్షంగా సాగిన సెమీఫైనల్లో భారత్ 68 పరుగుల భారీ తేడాతో విజయం సాధించింది. బ్యాటింగ్‌లో రోహిత్ శర్మ (39 బంతుల్లో 6 ఫోర్లు, 2 సిక్స్‌లతో 57), సూర్యకుమార్ యాదవ్(36 బంతుల్లో 4 ఫోర్లు, 2 సిక్స్‌లతో 47) చెలరేగగా.. బౌలింగ్‌లో స్పిన్నర్లు అక్షర్ పటేల్(3/23), కుల్దీప్ యాదవ్(3/19) రఫ్ఫాడించారు. ఈ మ్యాచ్‌లో ముందుగా బ్యాటింగ్ చేసిన టీమిండియా నిర్ణీత 20 ఓవర్లలో 7 వికెట్లకు 171 పరుగులు చేసింది. అనంతరం లక్ష్యఛేదనకు దిగిన ఇంగ్లండ్ భారత స్పిన్నర్ల ధాటికి 16.4 ఓవర్లలో 103 పరుగులకే కుప్పకూలింది. జోస్ బట్లర్(15 బంతుల్లో 4 ఫోర్లతో 23), హ్యారీ బ్రూక్(19 బంతుల్లో 3 ఫోర్లతో 25) టాప్ స్కోరర్లుగా నిలవగా మిగతా బ్యాటర్లు దారుణంగా విఫలమయ్యారు. ఈ గెలుపుతో గత టీ20 ప్రపంచకప్ 2022 సెమీస్‌లో ఇంగ్లండ్ చేతిలోనే ఎదురైన పరాజయానికి టీమిండియా ప్రతీకారం తీర్చుకుంది. ఆ మ్యాచ్‌లో ఇంగ్లండ్ 10 వికెట్లతో భారత్‌ను మట్టికరిపించగా.. తాజా మ్యాచ్‌లో రోహిత్ సేన భారీ విజయంతో రిటర్న్ గిఫ్ట్ ఇచ్చింది. ఇంగ్లండ్ జట్టే కాకుండా వన్డే ప్రపంచకప్ 2023 ఫైనల్లో భారత్‌ను ఓడించిన ఆస్ట్రేలియాపై కూడా టీమిండియా అదిరిపోయే రీతిలో రివేంజ్ తీసుకుంది. సూపర్-8లో ఆస్ట్రేలియాను 24 పరుగుల తేడాతో ఓడించి సెమీస్‌కు రాకుండా చేసింది. ఈ క్రమంలోనే మీమర్స్ ఈ కాన్సెప్ట్‌తో మీమ్స్ క్రియేట్ చేసి నవ్వులు పూయిస్తున్నారు. ఇంగ్లండ్, ఆస్ట్రేలియాపై అదిరిపోయే రీతిలో ప్రతీకారం తీర్చుకున్న టీమిండియా.. స్వాతంత్ర్యం తీసుకొచ్చి మహాత్మ గాంధీని అవమానించిన సౌతాఫ్రికాను వదులుతుందా? అనే మీమ్‌ను రూపొందించారు. ప్రస్తుతం ఈ మీమ్ తెగ వైరల్ అయ్యింది. ఈ మీమ్‌లో ఒకడు టీమిండియా విజయవంతంగా ఇంగ్లండ్, ఆస్ట్రేలియాను మట్టికరిపించి అదిరిపోయే రీతిలో ప్రతికారం తీర్చుకుందని అనగా.. సౌతాఫ్రికా టీమ్ 'మనకు టీమిండియాతో ఎలాంటి రివేంజ్‌లు లేవు. మనమ సేఫ్'అని సంతోషపడుతోంది. ఆ వెంటనే టీమిండియా.. 'మా గాంధీ తాతను ట్రైన్ నుంచి గెంటేసారు. మిమల్ని వదులుతామా?'అన్నట్లుగా రూపొందించిన ఈ మీమ్ ఆకట్టుకుంటోంది.

## సెమీస్‌లో ఇంగ్లండ్ చిత్తు.. ఫైనల్‌కు టీమిండియా



టీ20 వరల్డ్‌కప్-2024 ఫైనల్లో టీమిండియా అడుగుపెట్టింది. ఈ మెగా టోర్నీలో భాగంగా గయానా వేదికగా జరిగిన సెమీఫైనల్లో ఇంగ్లండ్‌ను 68 పరుగుల తేడాతో చిత్తు చేసిన భారత జట్టు.. తమ ఫైనల్ బెర్త్‌ను ఖారారు చేసుకుంది. ఈ విజయంతో గత టీ20 వరల్డ్‌కప్ సెమీస్ ఓటమికి భారత్ బదులు తీర్చుకుంది. ఈ మ్యాచ్‌లో భారత్ ఆల్‌రౌండ్ షోతో అదరగొట్టింది. తొలుత బ్యాటింగ్ చేసిన టీమిండియా నిర్ణీత 20 ఓవర్లలో నిర్ణీత 20 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 171 పరుగులు చేసింది. విరాట్ కోహ్లి, రిషబ్ పంత్ ఆరంభంలోనే ఔటైనప్పటికి కెప్టెన్ రోహిత్ శర్మ(57), సూర్యకుమార్ యాదవ్(47) అద్భుతమైన ప్రదర్శన కనబరిచారు. ఆఖరిలో హార్దిక్ పాండ్యా(23), జడేజా(17), అక్షర్ పటేల్(10) కీలక ఇన్నింగ్స్ ఆడారు. ఇంగ్లండ్ బౌలర్లలో క్రిస్ జోర్డాన్ 3 వికెట్లు పడగొట్టగా.. రషీద్, అర్చర్, టాప్లీ, కుర్రాన్ తలా వికెట్ సాధించారు.

### తిప్పేసిన స్పిన్నర్లు..

అనంతరం 172 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన భారత బౌలర్ల దాటికి 16.4 ఓవర్లలో 103 పరుగులకే కుప్పకూలింది. భారత బౌలర్లలో స్పిన్నర్లు కుల్దీప్ యాదవ్, అక్షర్ పటేల్ తిప్పేశారు. అక్షర్ పటేల్, కుల్దీప్ తలా మూడు వికెట్లు పడగొట్టి ఇంగ్లండ్ పతనాన్ని శాసించారు. వీరితో పాటు జస్ప్రీత్ బుమ్రా రెండు కీలక వికెట్లు పడగొట్టాడు. ఇంగ్లండ్ బ్యాటర్లలో హ్యారీ బ్రూక్(25) పరుగులతో టాప్ స్కోరర్‌గా నిలిచాడు. ఇక జూన్ 29న బార్బోడస్ వేదికగా జరగనున్న ఫైనల్లో దక్షిణాఫ్రికాతో భారత్ తలపడనుంది.

## నాకంటే బుమ్రా వెయ్యి రెట్లు బెటర్. తేల్చేసిన భారత దిగ్గజం!



భారత జట్టు ఏస్ బౌలర్ జస్ ప్రీత్ బుమ్రా కు అభిమానులు రోజురోజుకు పెరిగిపోతున్నారు.. అయితే వారు సాధారణ ప్రేక్షకులు కాదు.. క్రికెట్ దిగ్గజాలు.. ఇప్పటికే పాకిస్తాన్, వెస్టిండీస్ మాజీ క్రికెటర్లు వసీం అక్రమ్, ఇయాన్ రాఫెల్ బిషప్, అంబ్రోస్ బుమ్రా బౌలింగ్ కు ఫిదా అయ్యారు. అతడు వేస్తున్న బంతులకు ముగ్ధులయ్యారు.." బౌలింగ్ ఇలా కూడా చేస్తారా.. వికెట్లు ఇలా కూడా తీస్తారా.. నిర్జీవమైన మైదానంపై ఇలాంటి అద్భుతాలు కూడా చేయవచ్చా.. ఇతడు ఈ కాలపు స్వింగ్ మాస్టర్. వయసు కనుక తక్కువ ఉంటే.. అతని వద్ద బౌలింగ్ మెలకువలు నేర్చుకునే వాళ్ళమని" వసీం అక్రమ్, ఇయాన్ రాఫెల్ బిషప్, అంబ్రోస్ ఇటీవల వ్యాఖ్యానించారు.. ఇప్పుడు ఆ జాబితాలోకి మరో క్రికెట్ లెజెండ్ చేరారు. టీమిండియా కు తొలిసారి వరల్డ్ కప్ అందించిన ఘనత కపిల్ దేవ్ ది. హర్యానా ఎక్స్ ప్రెస్ గా పేరు గడించిన కపిల్ దేవ్.. బౌలింగ్లో చేయని ప్రయోగాలు అంటూ లేవు. అయితే ఇంతటి క్రికెట్ దిగ్గజం కూడా బుమ్రా బౌలింగ్ కు అభిమానిగా మారిపోయాడు.. కపిల్ దేవ్ అద్భుతమైన ఆల్ రౌండర్ అయినప్పటికీ.. తనకంటే బుమ్రా గొప్ప బౌలర్ అని అభివర్ణించాడు. "ప్రస్తుత టి20 క్రికెట్లో బుమ్రాను చూస్తే ముచ్చటేస్తోంది. వైవిధ్యమైన బంతులు వేస్తూ ప్రత్యర్థి బ్యాటర్లలో వణుకు పుట్టిస్తున్నాడు. ఎలాంటి మైదానం పైనైనా నిప్పులు చెరిగే విధంగా బంతులు వేస్తున్నాడు. అతడిని కాచుకోవడం ప్రత్యర్థి ఆటగాళ్లకు ఇబ్బందిగా మారింది. బుమ్రా నాకంటే వెయ్యిరెట్లు అద్భుతమైన బౌలర్.. ఇప్పటి వర్తమాన క్రికెట్ లో ఎంతమంది నాణ్యమైన బౌలర్లు ఉన్నారు. వారికి అనుభవం ఉందని" కపిల్ దేవ్ వ్యాఖ్యానించాడు.. ఓ స్పోర్ట్స్ ఛానల్ కు ఇచ్చిన ఇంటర్వ్యూలో కపిల్ దేవ్ ఈ వ్యాఖ్యలు చేశాడు. ప్రస్తుతం జట్టులో ఉన్న ఆటగాళ్లు అద్భుతంగా ఆడుతున్నారని.. అందువల్లే టి20 వరల్డ్ కప్ లో టీమిండియా వరుస విజయాలు సాధిస్తోందని కపిల్ దేవ్ వ్యాఖ్యానించాడు.. నాణ్యమైన క్రికెట్ ఆడుతూనే.. ఫిట్ నెస్ కూడా కాపాడుకుంటున్నారని పేర్కొన్నాడు.. మైదానంలో ఆటగాళ్లు తీవ్రంగా శ్రమిస్తున్నారని.. దానిని ఇలాగే కొనసాగిస్తే గొప్ప క్రికెటర్లుగా రూపాంతరం చెందుతారని కపిల్ దేవ్ పేర్కొన్నాడు..కాగా, ప్రస్తుత టి20 వరల్డ్ కప్ లో బుమ్రా అద్భుతంగా బౌలింగ్ చేస్తున్నాడు. అమెరికాలోని న్యూయార్క్ వేదికగా ఐర్లాండ్, పాకిస్తాన్ జట్లతో జరిగిన లీగ్ మ్యాచ్ లలో భారత జట్టుకు బుమ్రా విజయాలు అందించాడు.. మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ పురస్కారాలు దక్కించుకున్నాడు.

# కల చెదిరిన అఫ్ఘానిస్థాన్



ట్రినిడాడ్: వెస్టిండీస్, యుఎస్ఎలు సంయుక్తంగా ఆతిథ్యం ఇచ్చిన టి20 వరల్డ్‌కప్‌లో అఫ్గానిస్థాన్ టీమ్ అంచనాలకు మించి రాణించింది. లీగ్‌తో పాటు సూపర్8 దశలో రషీద్ ఖాన్ సారథ్యంలోని అఫ్గానిస్థాన్ అసాధారణ ఆటతో చెలరేగి పోయింది. ఏమాత్రం అంచనాలు లేకుండా బరిలోకి దిగిన అఫ్గాన్ అనూహ్యంగా సెమీస్‌కు చేరుకుని పెను ప్రకంపనలు సృష్టించింది. ఈ క్రమంలో న్యూజిలాండ్, ఆస్ట్రేలియా, బంగ్లాదేశ్ వంటి బలమైన జట్లను మట్టికరిపించింది. శ్రీలంక, వెస్టిండీస్, న్యూజిలాండ్ వంటి అగ్రశ్రేణి జట్లు లీగ్ దశలోనే ఇంటిదారి పట్టగా అఫ్గాన్ మాత్రం చిరస్మరణీయ ప్రదర్శనతో సూపర్8 అర్హత సాధించింది. ఈ దశలో కూడా అఫ్గాన్ అత్యంత నిలకడైన ఆటతో అలరించింది. ప్రపంచంలోనే అత్యుత్తమ జట్టుగా పేరున్న ఆస్ట్రేలియాపై చారిత్రక విజయం సాధించింది. సీనియర్, జూనియర్ ఆటగాళ్లతో కూడిన అఫ్గాన్ ఈ వరల్డ్‌కప్‌లో అద్భుతంగా రాణించింది. ఒక్కో మ్యాచ్‌లో విజయం సాధిస్తూ ముందుకు సాగింది. లీగ్ దశలో న్యూజిలాండ్‌పై అద్భుతం విజయం అందుకుంది. సూపర్8లో ఆస్ట్రేలియా, బంగ్లాదేశ్‌లను చిత్తుగా ఓడించింది. దీంతో సౌతాఫ్రికాతో జరిగే సెమీ ఫైనల్ మ్యాచ్‌లో అఫ్గాన్ టీమ్‌పై అంచనాలు భారీగా పెరిగాయి. కానీ సఫారీతో జరిగిన సెమీస్ మ్యాచ్‌లో అఫ్గాన్ ఆశించిన స్థాయిలో రాణించలేక పోయింది. బ్యాటింగ్ వైఫల్యం జట్టును వెంటాడింది. సౌతాఫ్రికా బౌలింగ్ ధాటికి ఎదురు నిలువలేక కేవలం 56 పరుగులకే కుప్పకూలింది. దీంతో అఫ్గాన్‌కు సెమీస్‌లో ఘోర పరాజయం తప్పలేదు. ఈ మ్యాచ్‌కు ముందు అఫ్గాన్‌పై అభిమానులు భారీ ఆశలు పెట్టుకున్నారు. సౌతాఫ్రికా మ్యాచ్‌లో సంచలన విజయం సాధిస్తుందని వారు భావించారు. కానీ అందరి ఆశలపై నీళ్లు చల్లుతూ అఫ్గాన్ సెమీస్‌లో పూర్తిగా తేలిపోయింది. సఫారీ టీమ్‌కు కనీస పోటీ కూడా ఇవ్వకుండానే ఓటమి చవిచూసింది. దీంతో అఫ్గాన్‌తో పాటు ఉపఖండంలోని కోట్లాది మంది అభిమానులు నిరాశలో కూరుకుపోయారు. ప్రతిభావంతులైన ఆటగాళ్లతో కూడిన అఫ్గాన్ సెమీస్‌లో సంచలనం సృష్టిస్తుందని భావించిన అభిమానులకు నిరాశే మిగిలింది. అయితే సెమీస్‌లో తప్పిస్తే మిగతా మ్యాచుల్లో అఫ్గానిస్థాన్ ఆటను ఎంత పొగిడినా తక్కువే. ఏమాత్రం అంచనాలు లేని అఫ్గాన్ టీమ్ సెమీస్‌కు చేరుకోవడం అతి పెద్ద సంచలనంగానే చెప్పొచ్చు. రానున్న రోజుల్లో ప్రపంచ క్రికెట్‌లో అఫ్గాన్ మరింత మెరుగైన ప్రదర్శన చేసేందుకు ఈ ప్రదర్శన దోహదం చేస్తుందనడంలో ఎలాంటి సందేహం లేదు.

# వరుస వైఫల్యాలు సహజమే..విరాట్ కు అండగా రోహిత్!



స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లీ వరుస వైఫల్యాలతో జట్టుకు వచ్చిన నష్టం ఏమీలేదని భారత కెప్టెన్ రోహిత్ శర్మ తేల్చిచెప్పాడు. విరాట్ కు దన్నుగా నిలిచాడు. 2024 ఐసీసీ టీ-20 ప్రపంచకప్ లో భారత స్టార్ బ్యాటర్ కమ్ ఓపెనర్ విరాట్ కోహ్లీ వరుస వైఫల్యాలతో ఉక్కిరిబిక్కిరవుతున్నాడు. జట్టుకే భారంగా మారడం ద్వారా విమర్శకుల నోటికి గట్టిగా పని చెబుతున్నాడు. అయితే..భారత కెప్టెన్ రోహిత్ శర్మ మాత్రం తన సహఓపెనర్ విరాట్ ను గట్టిగా వెనుకేసుకు వస్తున్నాడు.

### 7 ఇన్నింగ్స్ లో 75 పరుగుల రన్ మెషీన్..

బ్యాటింగ్ కు అనువుగా తయారు చేసిన ఐపీఎల్ పిచ్ లపైన పరుగుల మోత మోగించిన విరాట్ కోహ్లీ..అమెరికా, కరీబియన్ ద్వీపాలు వేదికగా జరుగుతున్న టీ-20 ప్రపంచకప్ వికెట్ల పైన మాత్రం ఘోరంగా విఫలమవుతున్నాడు. తన అంతర్జాతీయ టీ-20 కెరియర్ లో తొలిసారిగా భారత ఓపెనర్ గా ప్రపంచకప్ బరిలోకి దిగిన విరాట్ 7 ఇన్నింగ్స్ లో రెండు డకౌట్లతో 75 పరుగులు మాత్రమే చేయటాన్ని విమర్శకులు, విశ్లేషకులు తప్పుపడుతున్నారు. విరాట్ బ్యాటింగ్ ఆర్డర్ మార్చాలంటూ సలహా ఇస్తున్నారు. విరాట్ కు బదులుగా తుదిజట్టులో యువఓపెనర్ యశస్వి జైశ్వాల్ కు చోటు కల్పించాలంటూ డిమాండ్ చేస్తున్నారు. గ్రూప్-ఏ లీగ్ నుంచి సెమీఫైనల్స్ నాకౌట్ వరకూ రోహిత్ తో కలసి 7 మ్యాచ్ ల్లో ఓపెనర్ గా బ్యాటింగ్ కు దిగిన విరాట్..ప్రారంభ ఓవర్లలోనే అవుట్ కావడం ద్వారా..జట్టుకు తగిన ఆరంభాన్ని ఇవ్వలేకపోయాడు. రిటైర్మెంట్ కు దగ్గరగా వచ్చిన విరాట్ కోసం ప్రతిభావంతులైన యువఆటగాళ్లను బలిపెడతారా అంటూ పలువురు ప్రశ్నిస్తున్నారు.

### వచ్చిన నష్టం ఏమీలేదు....

జట్టుకు చక్కటి ఆరంభాన్ని ఇవ్వాల్సిన ఓపెనర్ విరాట్..పవర్ ప్లే ఓవర్లకు ముందే అవుట్ కావడంతో తమజట్టుకు వచ్చిన నష్టం ఏమీలేదని, విరాట్ విఫలమైనా తాము వరుస విజయాలు సాధిస్తూ..ఫైనల్స్ చేరిన విషయాన్ని అందరూ గుర్తుంచుకోవాలని భారత కెప్టెన్ వ్యాఖ్యానించాడు. క్రికెటర్ల జీవితంలో వరుస వైఫల్యాలు ఓ భాగమని, సహజం కూడానని రోహిత్ సమర్ధించుకొచ్చాడు. విరాట్ అసాధారణ ప్రతిభ కలిగిన ఆటగాడని, ఫైనల్లో ఓ భారీ ఇన్నింగ్స్ ఆడాలని తాను కోరుకొంటున్నట్లు తెలిపాడు.

### విరాట్ కు కపిల్ దేవ్ చురకలు..

మరోవైపు..విరాట్ కోహ్లీ లాంటి అపార అనుభవం కలిగిన స్టార్ బ్యాటర్ వరుసగా ఏడుమ్యాచ్ ల్లో విఫలం కావటం పట్ల భారత మాజీ కెప్టెన్, 65 సంవత్సరాల కపిల్ దేవ్ అసహనం వ్యక్తం చేశారు. సహఓపెనర్ రోహిత్ శర్మను చూసి నేర్చుకోవాలంటూ పరోక్షంగా చురకలంటించారు. ఓ బ్యాటర్ గా రోహిత్ కు తన పరిమితులేమిటో తెలుసునని, పరిమితమైన ప్రతిభతోనే జట్టుకు అపరిమితమైన మేలు చేస్తున్నాడంటూ కపిల్ కొనియాడారు. కొందరు ఆటగాళ్లు తమ కెరియర్ కోసం, రికార్డుల కోసమే ఆడతారని, కెప్టెన్సీని సైతం తమ స్వార్థం కోసమే ఉపయోగించుకొంటారంటూ..పరోక్షంగా విరాట్ ను దెప్పిపొడిచారు. తన కెరియర్ లో ఆఖరి టీ-20 ప్రపంచకప్ ఫైనల్ ఆడనున్న విరాట్ కు బార్బడోస్ వేదికగా దక్షిణాఫ్రికాతో జరిగే టైటిల్ పోరు అసలుసిసలు పరీక్షకానుంది.

# టీ-20 ప్రపంచకప్ ఫైనల్లో భారత్...రోహిత్ కన్నీరుమున్నీరు!

ధూమ్ ధామ్ టీ-20 ఫార్మాట్లో ప్రపంచ నంబర్ వన్ భారత్..2024 ఐసీసీ టీ-20 ప్రపంచకప్ ఫైనల్స్ కు చేరుకొంది. ఇంగ్లండ్ పై భారీవిజయంతో బదులుతీర్చుకొంది. టీ-20 టాప్ ర్యాంక్ జట్టు భారత్...2024 ప్రపంచకప్ కు గెలుపుదూరంలో నిలిచింది. దశాబ్దకాలం తరువాత ఐసీసీ టీ-20 ప్రపంచకప్ ఫైనల్స్ కు అర్హత సంపాదించింది. గయానాలోని ప్రావిడెన్స్ స్టేడియం వేదికగా ముగిసిన రెండోసెమీఫైనల్లో భారత్ 68 పరుగులతో ఇంగ్లండ్ ను చిత్తు చేయడం ద్వారా 2023 ప్రపంచకప్ సెమీఫైనల్స్ ఓటమికి ప్రతీకారం తీర్చుకోగలిగింది.

### మందకొడి పిచ్ పై రోహిత్, సూర్య బ్యాటింగ్ జోరు...

వరుణదేవుడి దోబూచులాటల నడుమ ప్రారంభమైన ఈ రెండో సెమీఫైనల్లో డిఫెండింగ్ చాంపియన్ ఇంగ్లండ్ కీలక టాస్ నెగ్గి ముందుగా ఫీల్డింగ్ ఎంచుకోడంతో..భారత్ బ్యాటింగ్ కు దిగాల్సి వచ్చింది. విరాట్- రోహిత్ లతో ఇన్నింగ్స్ మొదలు పెట్టిన భారత్ కు 2.4 ఓవర్ల ఆటలోనే గట్టి దెబ్బ తగిలింది. సిక్సర్ షాట్ తో తన బ్యాటింగ్ మొదలు పెట్టిన విరాట్ 9 బంతుల్లో 9 పరుగులకు అవుట్ కావడంతో 19 పరుగుల స్కోరుకే భారత్ మొదటి వికెట్ నష్టపోయింది. వన్ డౌన్ లో బ్యాటింగ్ కు దిగిన రిషభ్ పంత్ సైతం నిలదొక్కుకోలేకపోయాడు. కేవలం 4 పరుగులకే సామ్ కరెన్ బౌలింగ్ లో దొరికిపోడంతో భారత్ 40 పరుగుల స్కోరువద్ద 2 వికెట్ నష్టపోయి ఎదురీత మొదలు పెట్టింది.

### ముంబైజోడీ కీలక భాగస్వామ్యం...

భారత్ రెండుటాపార్డర్ వికెట్లు నష్టపోయి..ఎదురీదుతున్న తరుణంలో జట్టును ఆదుకొనే బాధ్యతను కెప్టెన్ రోహిత్ తో కలసి మిస్టర్ 360 హిట్టర్ సూర్యకుమార్ తీసుకొన్నాడు. ఈ ఇద్దరూ దూకుడుగా ఆడుతున్న తరుణంలో వర్షం పడడంతో 40 నిముషాలపాటు ఆట నిలిచిపోయింది. ఆ తరువాత కొనసాగిన ఆటలో ముంబైజోడీ కళ్లు చెదిరే షాట్లతో ఎదురుదాడి మొదలు పెట్టారు. అనూహ్యమైన బౌన్స్ తో..బ్యాటింగ్ కు అంతగా అనువుకాని పిచ్ పైన హిట్ మ్యాన్ రోహిత్, మిస్టర్ టీ-20 హిట్టర్ సూర్య తమకే సాధ్యమైన పలు రకాల షాట్లతో స్కోరుబోర్డును పరుగులెత్తించారు. 3వ వికెట్ కు 73 పరుగుల కీలక భాగస్వామ్యంతో భారత మ్యాచ్ విన్నింగ్ స్కోరుకు గట్టి పునాది వేశారు.

### రోహిత్ 32వ హాఫ్ సెంచరీ..

ప్రస్తుత ప్రపంచకప్ సూపర్-8 ఆఖరి రౌండ్ మ్యాచ్ లో ఆస్ట్రేలియా పై 92 పరుగుల స్కోరుతో ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ గా నిలిచిన కెప్టెన్ రోహిత్..ఇంగ్లండ్ తో సెమీస్ పోరులో సైతం చెలరేగిపోయాడు. 39 బంతుల్లో 6 ఫోర్లు, 2 సిక్సర్లతో 57 పరుగులు



సాధించి..లెగ్ స్పిన్నర్ రషీద్ బౌలింగ్ లో అవుటయ్యాడు. టీ-20 క్రికెట్లో రోహిత్ కు ఇది 32వ హాఫ్ సెంచరీకాగా..ప్రపంచకప్ లో 10వ అర్ధశతకం. అంతేకాదు..ప్రస్తుత ప్రపంచకప్ లో రోహిత్ కు మూడో హాఫ్ సెంచరీ. గ్రూప్ -ఏ లీగ్ ప్రారంభమ్యాచ్ లో ఐర్లాండ్ పై అజేయ హాఫ్ సెంచరీ సాధించిన రోహిత్..సూపర్-8లో ఆస్ట్రేలియాపైన, సెమీస్ లో ఇంగ్లండ్ పైన అర్ధశతకాలు బాదడం విశేషం. రోహిత్ స్థానంలో క్రీజులోకి వచ్చిన ఆల్ రౌండర్ హార్థిక్ పాండ్యాతో కలసి సూర్యకుమార్ తన పోరాటం కొనసాగించాడు. 36 బంతుల్లో 2 సిక్సర్లు, 4 ఫోర్లతో హాఫ్ సెంచరీకి 3 పరుగుల దూరంలో అవుటయ్యాడు.

### మిడిలార్డర్ కీలక పరుగులు....

15.4 ఓవర్లలో భారత్ 4 వికెట్లకు 124 పరుగులు మాతమే చేసిన తరుణంలో బ్యాటింగ్ కు దిగిన హార్థిక్ పాండ్యా 13 బంతుల్లో 23 పరుగులు, రవీంద్ర జడేజా 17 నాటౌట్, అక్షర్ పటేల్ 10 పరుగులు సాధించడంతో భారత్ 20 ఓవర్లలో 171 పరుగుల స్కోరుతో విజయానికి మార్గం సుగమం చేసుకొంది. ఇంగ్లండ్ బౌలర్లలో జోర్డాన్ 3 వికెట్లు, టోప్లే, కరెన్, రషీద్, ఆర్చర్ తలో వికెట్ పడగొట్టారు. మ్యాచ్ నెగ్గాలంటే 20 ఓవర్లలో 172 పరుగుల లక్ష్యంతో చేజింగ్ కు దిగిన ఇంగ్లండ్ బ్యాటర్లకు భారత బౌలర్లు పట్టపగలే చుక్కలు చూపించారు. ప్రధానంగా స్పిన్ జోడీ అక్షర్ పటేల్, కుల్దీప్ యాదవ్ చెలరేగిపోయారు.

### 16.4 ఓవర్లలోనే ఇంగ్లండ్ ప్యాకప్...

బ్యాటింగ్ అంతతేలికకాని పిచ్ పైన ఇంగ్లండ్ బ్యాటర్లు తెల్లమొకం వేశారు. తొలిఓవర్ నుంచే భారత బౌలర్లు వికెట్ కు అనుగుణంగా బౌల్ చేసి..పవర్ ప్లే దశలోనే పట్టుబిగించారు. ఓపెనర్లు సాల్ట్ 5, కెప్టెన్ బట్లర్ 23, మోయిన్ అలీ 8, బెయిర్ స్టో 0, సామ్ కరెన్ 2 పరుగులకు అవుట్ కావడంతో ఇంగ్లండ్ మరి కోలుకోలేకపోయింది. భారత యార్కర్లకింగ్ బుమ్రా, స్పిన్ జాదూ కుల్దీప్ ను ఎలా ఎదుర్కొనాలో అర్ధంకాక ఇంగ్లండ్ జట్టు 16.4 ఓవర్లలోనే కేవలం 103 పరుగులకే కుప్పకూలింది. దీంతో భారత్ 68 పరుగుల భారీవిజయంతో ఫైనల్ చేరడంతో పాటు..గత ప్రపంచకప్ సెమీస్ లో ఇంగ్లండ్ చేతిలో ఎదురైన 10 వికెట్ల ఘోరపరాజయానికి ప్రతీకారం తీర్చుకొన్నట్లయ్యింది. భారత బౌలర్లలో కుల్దీప్, అక్షర్ పట్లే చెరో 3 వికెట్లు, బుమ్రా 2 వికెట్లు పడగొట్టారు. భారత్ విజయంలో ప్రధానపాత్ర వహించిన స్పిన్ ఆల్ రౌండర్ అక్షర్ పటేల్ కు ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డు దక్కింది. అక్షర్ 10 పరుగులు చేయడంతో పాటు..23 పరుగులిచ్చి 3 వికెట్లు సాధించాడు.

### రోహిత్ కంట కన్నీరు...

భారతజట్టు విజయాలలో ప్రధానపాత్ర పోషిస్తూ..నాయకుడంటే ఎలా ఉండాలో చాటి చెప్పిన కెప్టెన్ రోహిత్ శర్మ..తనజట్టు ఫైనల్స్ చేరుకోడంతో పట్టలేని ఆనందంతో తీవ్రభావోద్వేగానికి గురయ్యాడు. గ్రౌండ్ నుంచి డ్రెస్సింగ్ రూమ్ చేరిన వెంటనే కుర్చీలోకి కూలబడి కంటనీరు పెట్టుకోడంతో మాజీ కెప్టెన్ విరాట్ కోహ్లీ ఓదార్చాల్సి వచ్చింది. ఈనెల 29న బార్బడోస్ కెన్సింగ్టన్ ఓవల్ వేదికగా జరిగే టైటిల్ సమరంలో తొలిసారిగా ఫైనల్ చేరిన సౌతాఫ్రికాజట్టుతో భారత్ తలపడనుంది.

# ఒలింపిక్స్ స్వర్ణ విజేతలకు కోటి నజరానా!

పారిస్ ఒలింపిక్స్ లో పతకాలు సాధించే భారత అథ్లెట్లకు గతంలో ఎన్నడూలేనంతగా భారీనజరానా దక్కనుంది. పారిస్ వేదికగా మరికొద్దివారాలలో ప్రారంభంకానున్న 2024 ఒలింపిక్స్ లో పాల్గొనే భారత అథ్లెట్ల శిక్షణ, సన్నాహాల కోసం ఇప్పటికే కోట్ల రూపాయలు ఖర్చు చేసిన భారత ఒలింపిక్ సంఘం..గతంలో ఎన్నడూ లేనంతగా ప్రోత్సాహక నగదు బహుమతుల మొత్తాన్ని సైతం పెంచింది.

### 125మంది అథ్లెట్లతో భారత్ పతకాల వేట...

ప్రపంచంలోనే అతిపెద్ద క్రీడల పండుగ ఒలింపిక్స్ లో 204 దేశాలకు చెందిన 10 వేల మంది అథ్లెట్లు తలపడబోతున్నారు. జూలై 26 నుంచి ఆగస్టు 11 వరకూ జరిగే ఈ క్రీడాసంరంభంలో 125మంది అథ్లెట్ల భారీబృందం పతకాలవేటకు దిగుతోంది. టీమ్, వ్యక్తిగత విభాగాలలో ఇప్పటికే వందమందికి పైగా భారత అథ్లెట్లు పారిస్ ఒలింపిక్స్ కు అర్హత సంపాదించారు. రానున్న కొద్దిరోజుల్లో మరికొంతమంది అథ్లెట్లు అర్హత సాధించే అవకాశం ఉంది. గత ఒలింపిక్స్ లో ఓ స్వర్ణం, రెండురజతాలు, నాలుగు కాంస్యాలు సాధించిన భారత్..ప్రస్తుత ఒలింపిక్స్ లో మరింత మెరుగై ప్రదర్శన చేయాలన్న పట్టుదలతో ఉంది.

### భారీగా పెరిగిన ఒలింపిక్స్ నజారానా....

ఒలింపిక్స్ పతక విజేతలకు గతంలో కంటే మరింత ఎక్కువ నగదు ప్రోత్సాహక బహుమతులు ఇవ్వనున్నట్లు భారత ఒలింపిక్స్ సంఘం ప్రకటించింది. బంగారు పతకం నెగ్గిన విజేతలకు కోటి రూపాయలు, రజత పతకం సాధించిన వారికి 50 లక్షల రూపాయలు, కాంస్య విజేతలకు 30 లక్షల రూపాయల చొప్పున అందచేయనున్నారు. 2018 ఆసియాక్రీడల నుంచే భారత ఒలింపిక్స్ సంఘం పతక విజేతలుగా నగదు ప్రోత్సాహక బహుమతులు అందచేస్తూ వస్తోంది. ఆసియాక్రీడల్లో స్వర్ణ, రజత, కాంస్య పతకాలు సాధించినవారికి 5 లక్షలు, 3 లక్షలు, 2 లక్షల రూపాయల చొప్పున ఇస్తూ వస్తున్నారు.

### 75 లక్షల నుంచి కోటి రూపాయలు...

2021 టోక్యో ఒలింపిక్స్ పతక విజేతలకు భారత ఒలింపిక్స్ సంఘం 75 లక్షలు, 45 లక్షలు, 25 లక్షల రూపాయల చొప్పున అందచేసింది. ఆ మొత్తాన్ని ప్రస్తుత పారిస్ ఒలింపిక్స్ నాటికి దాదాపుగా రెట్టింపు చేసింది. 2024 ఒలింపిక్స్ లో భారత అథ్లెట్లు




తొలిసారిగా రెండంకెల సంఖ్యలో పతకాలు సాధించే అవకాశం ఉందని, పతకవిజేతలకు నజరానాగా 7 కోట్ల రూపాయలు కేటాయించినట్లు..భారత ఒలింపిక్ సంఘం అధ్యక్షురాలు పీటీ ఉష ప్రకటించారు.

### హాకీజట్టుకు 2 కోట్ల నజరానా...

టీమ్ విభాగంలో బంగారు పతకం సాధించిన భారత హాకీజట్టు సభ్యులు..స్వర్ణం సాధిస్తే 2 కోట్ల రూపాయలు నగదు బహుమతిగా అందచేయనున్నారు. రజత పతకం సాధిస్తే కోటి రూపాయలు, కాంస్యం నెగ్గితే 75 లక్షల రూపాయలు చెల్లించనున్నారు. ట్రాక్ అండ్ ఫీల్డ్ విభాగంలో స్వర్ణ పతకం సాధించిన అథ్లెట్లకు 42 లక్షల ( 50 వేల డాలర్లు ) రూపాయలు చొప్పున ఇస్తామని ఇప్పటికే అంతర్జాతీయ ఒలింపిక్ సంఘం ప్రకటించింది.

### రోజుకు 50 డాలర్లు.......

ఒలింపిక్స్ లో పాల్గొనే భారత అథ్లెట్లకు రోజుకు 50 డాలర్లు చొప్పున దినసరి భత్యంగా అందచేయాలని భారత ఒలింపిక్స్ సంఘం నిర్ణయించింది. మొత్తం 195 మంది సభ్యుల కోసం అలవెన్సులను సిద్ధం చేసింది. అథ్లెట్లకు 2 లక్షల రూపాయల నగదు మొత్తాన్ని, కోచింగ్ స్టాఫ్ కు లక్ష రూపాయల చొప్పున గ్రాంట్ ను తొలిసారిగా అందచేసింది. నలుగురు సభ్యుల గోల్ఫ్ బృందానికి అవసరమైన గోల్ఫ్ బ్యాగుల కోసం 4 లక్షల 40వేల రూపాయలు కేటాయించింది. అశ్వక్రీడల కోసం ప్రత్యేకంగా 9 లక్షల రూపాయలు అందుబాటులో ఉంచింది.